


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

యుద్ధం రెచ్చగొట్టేదీ.. శాంతిజపం చేసేదీ అమెరికానే! 02

గాజాపై ట్రంప్ 20 అంశాల శాంతిమంత్రం

మూఢత్వం, ఛాందసం ముసుగులో ఆధునిక మానవుడు 06

సంపుటి 08, సంచిక: 308 | గురువారం | 09-10-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# బిసి కోటాపై కొనసాగుతున్న ఉత్కంఠ




## పిటిషన్లపై హైకోర్టులో నేడూ జరగనున్న వాదనలు

నిబంధనలకు విరుద్ధంగా స్థానిక సంస్థల్లో ప్రభుత్వం రిజర్వేషన్లు అమలుచేస్తోందని వాదించిన పిటిషనర్లు

రాజకీయాలకు అతీతంగా బిసి రిజర్వేషన్లకు మద్దతు లభించిందన్న ప్రభుత్వ తరపు న్యాయవాది

ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున కోర్టులు జోక్యం చేసుకోవద్దన్న అభిషేక్ మను సింఘ్వీ

ప్రజాపక్షం/హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికలను నిలిపివేస్తూ మధ్యంతర ఆదేశాలు ఇచ్చేందుకు హైకోర్టు సుముఖత చూపలేదు. విచారణను గురువారానికి వాయిదా వేస్తే అప్పటిలోగా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందని, ఎన్నికల అంశంపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ల లాయర్లు పలుసార్లు కోరినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ఏవిధమైన మధ్యంతర ఉత్తర్వులూ జారీ చేయలేదు. విచారణను గురువారం మధ్యాహ్నం 2.15 గంటలకు వాయిదా వేసింది. అప్పుడు అందరి వాదనలూ వింటామని ప్రకటించింది. అవసరమైతే ఎలాంటి ఆదేశాలైనా జారీ చేయవచ్చునని చెప్పింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లు పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన జిఒ 9ని కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లి మండలం కేశవాపూర్ గ్రామానికి చెందిన బుట్టెంగారి మాధవరెడ్డితో పాటు మరికొందరు పిటిషన్లు దాఖలు చేశారు. బిసి రిజర్వేషన్లకు అనుకూలంగా తమ వాదనలు కూడా వినాలంటూ సిపిఐ, కాంగ్రెస్ సహా కొందరు బిసి నాయకులు 30 మంది ఇంప్లీడ్ పిటిషన్లు వేశారు. వీటిని చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జిఎం మోహియుద్దీన్ డివిజన్ బెంచ్ బుధవారం సుదీర్ఘంగా విచారించింది. తొలుత పలువురు లాయర్లు ఒకేసారి వాదనలకు రెడీ కావడంతో హైకోర్టు తరువాయి 2లో

# నేడే తొలివిడత నోటిఫికేషన్



## ఉదయం 10.30 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలపై ఉత్కంఠ కొనసాగుతోంది. బిసి రిజర్వేషన్‌ల అంశంపై తెలంగాణ హైకోర్టులో విచారణలు జరుగుతుండగా గురువారం రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సిద్ధమైంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని గురువారం ఉదయం 10.30గంటలకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఆ వెంటనే అధికారులు నామినేషన్లు స్వీకరించనున్నారు. బిసి రిజర్వేషన్ల అంశంపై హైకోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల నోటిఫికేషన్‌ను నిలుపుదల చేస్తూ స్టే ఇవ్వాలని పిటిషనర్ కోరారు. అయితే పిటిషనర్ విజ్ఞప్తిని హైకోర్టు ధర్మాసనం పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో గురువారం నుంచి ఎన్నికల ప్రక్రియ యథావిధిగా కొనసాగనుంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం తొలుత ఎంపిటిసి, జెడ్‌పిటిసి స్థానాలకు, ఆ తర్వాత సర్పంచి, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఐదు దశల్లో జరిగే ఎన్నికల ప్రక్రియ ఈనెల 9న ప్రారంభమై తరువాయి 2లో

# నామినేషన్లకు సిద్ధం కండి




కాంగ్రెస్ ఆశావహులకు పిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ పిలుపు

షెడ్యూల్ ప్రకారమే నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని వ్యాఖ్య

ప్రజాపక్షం/హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్లకు సంసిద్ధం కావాలని కాంగ్రెస్ శ్రేణులకు పిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. బిసి రిజర్వేషన్ల అంశానికి సంబంధించి విచారణను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎకె సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారానికి వాయిదా వేస్తూ మధ్యాహ్నం 2.15 గంటలకు వాదనలు వింటామని వెల్లడించింది. ఈ నేపథ్యంలో బుధవారం అడ్వకేట్ జనరల్‌తో సమావేశమైన పిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకారమే గురువారం నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశంఉందని,కాంగ్రెస్ జిల్లాల అధ్యక్షులంతా ఆశావహులందరితో నామినేషన్ల వేయించేందుకు అంతా సిద్ధం చేసుకోవాలని సూచించారు. బిసి రిజర్వేషన్లకు కేసుకు సంబంధించి హైకోర్టులో ప్రభుత్వం తరుపున బలమైన వాదనలు వినిపించామన్నారు. బిసి రిజర్వేషన్ల అంశానికి సంబంధించి ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో ఉందని ప్రతిపక్షాల ఆరోపణలు పట్టించుకునే అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.



# ఎడారి గాలి నుంచి స్వచ్ఛమైన నీరు

రసాయనశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

**స్టాక్‌హోమ్:** ఎడారి గాలి నుంచి స్వచ్ఛమైన నీటిని సేకరించడం, వాతావరణంలోని హానికర కర్బన ఉద్గారాలను బంధించడం వంటి అసాధారణ పనులకు వీలు కల్పించే వినూత్న ఆవిష్కరణకు ఈ ఏడాది రసాయన శాస్త్రంలో అత్యున్నత పురస్కారం లభించింది. 2025 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతిని ముగ్గురు శాస్త్రవేత్తలు సంయుక్తంగా గెలుచుకున్నారు. జపాన్‌కు చెందిన సుసుము కిటగావా, ఆస్ట్రేలియాకు చెందిన రిచర్డ్ రాబ్సన్, తరువాయి 2లో

అంతరాలులేని సమాజం కోరుకున్న వ్యక్తి సురవరం
సంస్మరణ సభలో వక్తలు

వ్యవసాయ రంగాన్ని గాడిలో పెట్టాలి
రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

సమసిన మంత్రుల వివాదం
అడ్లూరి లక్ష్మణ్‌కు క్షమాపణ చెప్పిన మంత్రి పొన్నం 03

'రిలీఫ్, రెస్పిఫ్రెష్'

# దగ్గు మందుపై నిషేధం

దగ్గు మందులో అత్యంత విషపూరితమైన పదార్థం గుర్తింపు : డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలో రెండు దగ్గు మందులను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ల్యాబ్ పరీక్షల ప్రకారం గుజరాత్ రాష్ట్రానికి చెందిన 'రిలీఫ్, రెస్పిఫ్రెష్' రెండు దగ్గు మందులలో అత్యంత విషపూరిత పదార్థం కలుషితమైందని తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డిసిఎ) బుధవారం వెల్లడించింది. ఈ రెండు దగ్గు మందులను విక్రయించరాదని, రిటైల్, హోల్ సెల్లర్లు, డిస్ట్రిబ్యూటర్లు, ఆస్పత్రులు ఈ మందులను విక్రయింకుండా పక్కన పెట్టాలని ఆదేశించింది. గుజరాత్‌కు చెందిన 'రిలీఫ్ కాఫ్ సిరఫ్, రెస్ పిఫ్రెష్' రెండు మందులను తక్షణమే నిలుపుదల చేయాలని సూచించింది. ఈ రెండు మందులను మధ్యప్రదేశ్, భూపాల్‌లోని డ్రగ్ టెస్టింగ్ లేబరేటరీలో పరీక్షలు తరువాయి 2లో

బేషరతుగా వాంగ్‌చుక్‌ను

# విడుదల చేయాలి

కార్మిక సంఘాల ఐక్యవేదిక డిమాండ్



**న్యూఢిల్లీ:** హక్కుల కార్యకర్త, ఉద్యమకారుడు సోనం వాంగ్‌చుక్‌ను తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. దీర్ఘకాలంగా పెండింగ్ ఉన్న సమస్యల పరిష్కారానికిగాను లేహ్‌లదాఖ్ ప్రజాప్రతినిధులతో చర్చలను నిజాయతీగా, పారదర్శకంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. తప్పుడు కేసులు బనాయించి వాంగ్‌చుక్, ఆయన తోటివారిని నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండించింది. రాజ్యాంగానికి విరుద్ధంగా ప్రజాస్వామిక హక్కులను హరించడాన్ని, న్యాయమైన సమస్యలు పరిష్కరించకుండా అణచివేత ధోరణిని కేంద్రం అనుసరిస్తుండటాన్ని ఆక్షేపించింది. లదాఖ్ యువతలో పెరుగుతున్న నిరుద్యోగం, క్షీణిస్తున్న పర్యావరణం, పరిపాలన అంశాలపై ఢిల్లీకి పాదయాత్రలు, తరువాయి 2లో

బాణసంచా తయారీ కేంద్రంలో

# భారీ పేలుడు

## ఏడుగురు సజీవదహనం

ఎపిలోని కోనసీమ జిల్లాలో విషాదం



**మండపేట/రాయవరం :** ఎపిలోని అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం బిక్కవోలు మండలాల సరిహద్దు ప్రాంతమైన కొమరిపాలెంలో బుధవారం బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి ఆరుగురు కూలీలు సజీవ దహనమయ్యారు. 12 మంది మంది తీవ్రంగా గాయపడగా తొలుత వీరిని రామచంద్రాపురం ఏరియా ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించగా అక్కడ వైద్యం పొందుతున్నారు. కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి గల కారణం తరువాయి 2లో

# వాణిజ్య ఒప్పందంతో భారత అభివృద్ధి వేగవంతం


బ్రిటన్ ప్రధాని స్మార్టర్



**ముంబయి:** యూరోపియన్ యూనియన్ నుంచి వైదొలిగిన తర్వాత భారత్ – బ్రిటన్ మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందం కీలకమైనదని బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ అన్నారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా భారత్ పర్యటనకు వచ్చిన స్టార్మర్... బుధవారం ముంబైలో పారిశ్రామిక వేత్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం భారత్ అభివృద్ధికి లాంచ్ ప్యాడ్ లాంటిదని అభిప్రాయపడ్డారు. 2028 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడానికి ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దీని వల్ల ఇరు దేశాల మధ్య వాణిజ్యం సులభంగా, చౌకగా మారడమే కాకుండా అనేక తరువాయి 12లో

బందీలు– ఖైదీల జాబితాలు

# ఇచ్చిపుచ్చుకున్న హమాస్, ఇజ్రాయెల్



**షర్మ్–ఎల్–షేక్:** ఈజిప్టులో చర్చల సందర్భంగా ఇజ్రాయెల్–హమాస్ ప్రతినిధులు మధ్యవర్తుల ద్వారా బందీలు, ఖైదీల జాబితాలను ఇచ్చిపుచ్చుకున్నారు. చర్చల్లో పాల్గొన్న హమాస్ ప్రతినిధి తాహెర్ నును మాట్లాడుతూ, ఇజ్రాయెల్ ఎంతమంది ఖైదీలను విడుదల చేస్తోందో జాబితా ఇవ్వాలని తొలుత కోరారు. అలాగే ఇజ్రాయెల్ బందీల జాబితాను కూడా హమాస్ ఇస్తుందన్నారు. యుద్ధ విరమణకు ఉన్న ప్రతి ఆటంకాన్నీ తొలగించేందుకు మధ్యవర్తులు ఎంతో కృషి చేస్తున్నారని తాహెర్ నును చెప్పారు. బుధవారంనాటికి ఈ చర్చలు మూడోరోజుకు చేరాయి. ట్రంప్ శాంతి ప్రణాళికకు అనుగుణంగా ఈజిప్టులో జరుగుతున్న చర్చల్లో ఇజ్రాయెల్ జైళ్ళనుండి విడుదల చేసే పాలస్తీనా ఖైదీల జాబితాను ముందుగా విడుదల చేయాలని హమాస్ డిమాండ్ చేసింది. అందరిక్షేమం నిమిత్తం తమకు కొన్ని గ్యారంటీలు ఇవ్వాల్సిన అవసరం ఉందని హమాస్ అగ్రనాయకుడు ఖలీల్ హయ్యా తరువాయి 12లో





# ప్రపంచం WORLD NEWS

## ఈక్వెడార్ అధ్యక్షుడిపై హత్యాయత్నం



**క్విటో:** ఈక్వెడార్ దేశాధ్యక్షుడు డేనియల్ నోబోయాపై మోటారు సైకిలుపై వచ్చిన ఒక దండు హత్యాయత్నానికి పాల్పడింది. ఐతే ఆయన ఈ హత్యాయత్నం నుండి తప్పించుకుని సురక్షితంగా బయటపడ్డారు. మోటారుసైకిళ్ళపై వచ్చిన ఒక దండు ఆయన కాన్వాయ్‌పై తుపాకీగుళ్ళవర్షం కురిపించింది. తర్వాత సిబ్బంది అప్రమత్తమై ప్రమాదాన్ని నివారించారు. ఈ ఘటనకు సంబంధించి ఐదురుగురు ముఖ్యులను అరెస్టు చేసినట్లు పర్యావరణ, ఇంధన శాఖామంత్రి మన్‌జానో చెప్పారు. ఉగ్రవాదం, హత్యాయత్నం నిబంధనల కింద నిందితులపై కేసులు నమోదు చేశారు. దక్షిణ అమెరికా వాయువ్యప్రాంత దేశం ఈక్వెడార్‌కు కొలంబియా, పెరూ,పసిఫిక్ సముద్రాలు సరిహద్దులుగా ఉన్నాయి. డ్రగ్ మాఫియా నాయకుడు, ఉగ్రవాది జోస్ అడాల్ఫో మాకియాస్ విల్లామర్ గత ఏడాది జైలు నుండి తప్పించుకున్నాడు. దీంతో దేశాధ్యక్షుడు నోబోయా దేశంలో వ్యవస్థీకృత నేరాలపై అంతర్గత యుద్ధం ప్రకటించారు. బహుశా ఈ ముఠాలే ఆయనపై దాడిచేసి ఉంటాయని భావిస్తున్నారు.




## ఉగ్రవాదుల కాల్పుల్లో 11 మంది పాక్ సైనికులు మృతి

### వారంతా భారత్ పోషిస్తున్న ఉగ్రవాదులే: షరీఫ్

**రావల్పిండి:** ఖైబర్ పఖ్తుంఖ్వా రాష్ట్రంలో ఉగ్రవాదుల కోసం గాలింపు చర్యలు చేస్తుండగా ఎదురుకాల్పుల్లో ఒక లెఫ్టినెంట్ కల్నల్, మేజర్ సహా 11 మంది పాకిస్థాన్ సైనికులు మరణించారు. ఈ వార్త విన్నవెంటనే ఆ దేశ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ మరణించిన సైనికులకు నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తీవ్ర సంతాపం తెలియజేశారు. భారతదేశ మద్దతుతో నీచమైన హింసాత్మక చర్యలకు పాల్పడుతున్న ఉగ్రవాదులను వదిలిపెట్టేదిలేదని ఆయన హెచ్చరిక చేశారు. ఈ సైనికుల త్యాగం పాకిస్థాన్ జాతి ఐక్యతకు చిహ్నమని ఆయన పేర్కొన్నారు. దేశాధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ ఒక ప్రకటనలో మృతులకు నివాళులు అర్పిస్తూ సైనికాధికారులు జునైద్ తారిఖ్ షాహిద్, తయ్యబ్ రహత్‌లను జాతి హీరోలుగా ప్రకటించారు. భారత్ అండతో దాడులు చేస్తున్న ఉగ్రవాదులకు వ్యతిరేకంగా యావత్ దేశం సైనిక బలగాలకు అండగా నిలబడుతుందని ఆయన పేర్కొన్నారు. ఒకార్జిల్ జిల్లాలో నిఘా వర్గాలు ఇచ్చిన సమాచారం మేరకు సైన్యం రంగంలోకి దిగి గాలింపు చర్యలు కొనసాగిస్తుండగా పరస్పరం ఎదురైనప్పుడు మంగళవారం రాత్రి భారీగా కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో నిషేధిత తెహ్రీక్ ఎ తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి)కి చెందిన 19 మంది ఉగ్రవాదులు కూడా హతులయ్యారు. పాకిస్థాన్ పత్రికలు వీరని భారత ప్రభుత్వం పెంచిపోషిస్తున్న 'ఫిత్నా అల్ ఖ్వారిజ్' ఉగ్రవాదులుగా అభివర్ణించాయి. ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన పాకిస్థాన్ సైనికులు అందరూ యువ సుశిక్షితులే. వీరిలో 'సైనికబృందానికి నాయకత్వం వహిస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ జునైద్ తారిఖ్ షాహిద్ (39), కమాండ్ మేజర్ తయ్యబ్ రహత్ (33), నాయబ్ సుబేదార్ అజంగుల్ (38), నాయక్ అదిల్ హుస్సేన్ (35), నాయక్ గుల్ అమీర్ (34), లాన్స్ నాయక్ షేర్‌ఖాన్ (31) తదితరులున్నారు. ఈ ప్రాంతంలో ఇంకా భారత్ పెంచిపోషిస్తున్న ఉగ్రవాదులు ఉన్నారేమో తెలుసుకుని నిర్మూలించేందుకు గాలింపు చర్యలు కొనసాగిస్తునట్లు పాకిస్థాన్ ఇంటర్–సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పిఆర్) విభాగం బుధవారం ఒక ప్రకటనలో తెలియజేసింది.

## యుద్ధం రెచ్చగొట్టేదీ.. శాంతిజపం చేసేదీ అమెరికానే!

### ఇజ్రాయెల్‌కు 21.7 బి.డాలర్ల సైనిక సహాయం



**కైరో:** గాజాలో యుద్ధం ఆపి శాంతిసాధనకు డోనాల్డ్ ట్రంప్ కృషి చేస్తున్నప్పటికీ అసలు ఈ యుద్ధం రెండేళ్ళుగా ఎడతెగకుండా కొనసాగడానికి ప్రధాన కారణం కూడా ఆ దేశమే. గాజాపై ఇజ్రాయెల్ 2023 అక్టోబరులో దాడి చేసినప్పటి నుండీ ఇప్పటివరకూ 21.7 బిలియన్ డాలర్ల సైనిక సహాయాన్ని అమెరికా అందజేసిందని ఒక తాజా ఎకడమిక్ స్టడీ నివేదిక వెల్లడించింది. ఏడు యుద్ధాలు ఆపానని చెబుతున్న ట్రంప్ గాజాలో యుద్ధం ఆపితే ఎనిమిదో యుద్ధం కూడా ఆపినవారవుతారు. ఇక మిగిలిన ప్రధానమైన యుద్ధం ఉక్రేన్‌దే. ఉక్రేన్‌లో యుద్ధం కూడా ఆపేస్తే ట్రంప్‌కు నోబెల్ బహుమతి వచ్చే అవకాశాలు కూడా ఉన్నాయి. కానీ గాజాలో, ఉక్రేన్‌లో యుద్ధాలను రెచ్చగొట్టి సైనిక సహాయం చేసింది కూడా అమెరికా దేశమే. జోబైడెన్ అధ్యక్షుడుగా ఉన్నప్పటి నుండీ ఇప్పటివరకూ ఈ యుద్ధాలను రెచ్చగొట్టేందుకు అమెరికా అనుసరించిన విధానంలో ఎలాంటి మార్పు లేదు.

అదేవిధంగా బ్రౌన్ యూనివర్సిటీకి చెందిన వాట్సన్ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ ఎఫైర్స్ చేసిన మరో అధ్యయనం ప్రకారం, మధ్యప్రాచ్య సరిహద్దుల్లో యుద్ధ కార్యకలాపాలు, భద్రతా చర్యల నిమిత్తం మరో 10 బిలియన్ డాలర్లు కూడా అమెరికా రెండు సంవత్సరాలుగా ఖర్చుచేసింది. ఇందులో అమెరికా సైన్యం ప్రత్యక్ష జోక్యం కూడా ఉంది. ఐతే ఈ అధ్యయన నివేదికలపై అమెరికా విదేశాంగమంత్రిత్వ శాఖ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఐతే అమెరికా సహాయం లేకుండా, ఆయుధ సహకారం, ఇతరత్రాసమయానుకూలంగా సాంకేతికపరమైన సహకారం అందజేయకుండా ఇంతభారీ స్థాయిలో విజయవంతంగా ఇజ్రాయెల్ సైన్యం మధ్యప్రాచ్యంలో ఏకకాలంలో అనేక దేశాలపై యుద్ధ దాడులు చేయడం అసాధ్యమైన విషయమని కూడా ఈ నివేదికలు వెల్లడించాయి. ఒకవైపు గాజాలో సుదీర్ఘయుద్ధం చేస్తున్న ఇజ్రాయెల్ హౌతీలపై దాడులు చేసింది. ఖతార్‌లోని దోహాపై దాడులు చేసింది. ఇరాన్‌లో కూడా దాడులు చేసింది. అనేక సరిహద్దులను ఉల్లంఘించి ఏకకాలంలో శత్రువులతో పోరాటం చేయడం అమెరికా మద్దతు వల్లనే అని నివేదికలు పేర్కొన్నాయి.

## మయన్మార్‌లో బాంబు దాడి



### 24 మంది మృతి

**యాంగాన్:** మయన్మార్ చెంగ్ యూ టౌన్‌షిప్‌లో బౌద్ధులు చేసుకునే పూర్ణ చంద్రోదయ ఉత్సవం సందర్భంగా సైనిక ప్రభుత్వ బృందం దాడి చేసింది. ఈ దాడిలో 24 మంది మరణించారు. మరో 47 మంది గాయపడ్డారు.సెంట్రల్ మయన్మార్‌లో సోమవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఉత్సవంతోపాటు ప్రజలు సైనికుల దుశ్చర్యలను కూడా వ్యతిరేకిస్తూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సమయంలో మోటారు సహాయంతో పనిచేసే పారాగ్లైడర్‌ను ఉపయోగించి సైన్యం ఆ జనంపై రెండు బాంబులు వేయడంతో 24 మంది మరణించారు. ఉత్సవం ఉన్నప్పటికీ ప్రధానంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం జరుగుతోంది. పండుగ, జాతీయ సెలవుదినం సందర్భంగా దాదాపు 100 మందిపైగా ప్రజలు చెంగ్ యూ టౌన్‌షిప్‌లో గుమిగూడారు. 2021 ఫిబ్రవరిలో మయన్మార్‌లో సైన్యం తిరగబడి ఆంగ్‌సాన్ సూకీ ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని కూల్చివేసింది. ఆమెతో సహా వందలమంది నాయకులను జైళ్ళల్లో పెట్టింది. వేలాదిమంది యువకులు వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు చేస్తే నిర్దాక్షిణ్యంగా వారిని అణచివేసింది. దీంతో వేలమంది మరణించారు. ఇక అప్పటినుండీ లక్షల మంది ప్రజలు ఇళ్ళు ఖాళీచేసి వెళ్ళిపోయారు. అనేకమంది నిరాశ్రయులయ్యారు. దేశంలో పౌర బృందాలు, తెగల బృందాలు సైన్యంపై అంతర్యుద్ధం ప్రారంభించాయి. ఇప్పటికీ ఈ అంతర్యుద్ధం కొనసాగుతోంది. ఈ పరిస్థితుల మధ్య సైన్యం తన అధికారం స్థిరీకరించుకునేందుకు ఈ ఏడాది చివరిలో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది.

## లెకార్ను అంతిమ యత్నాలు ఫలిస్తాయా?

### బడ్జెట్ ప్రకటించాలని ఫ్రాన్స్ ప్రతిపక్షం డిమాండ్



**పారిస్:** ప్రధానమంత్రి పదవి నుండి వైదొలగిన లెకార్ను ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఇచ్చిన అవకాశంతో చివరి ప్రయత్నాలు చేస్తున్నారు. కొత్త కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ఆశాభావంతో తుదిపోరు చేస్తున్నారు. బుధవారం రాత్రి పొద్దుపోయాక ఆయన దేశంలో సమస్య పరిష్కారంపై మేక్రాన్‌కు ఒక తుది నివేదిక సమర్పిస్తారు. ఈలోపు ఆయన కూటమి పార్టీల నాయకులతో, ప్రతిపక్షాల నాయకులతో సంప్రదింపులు చేస్తున్నారు. డిసెంబరు 31 లోపు కొత్త బడ్జెట్‌ను ఇవ్వాలని ప్రతిపక్షాలు గట్టిగా కోరుతుండగా, దేశ అత్యున్నత చట్టసభను మేక్రాన్ రద్దుచేస్తారన్న ఊహాగానాలు మెల్లిగా వెనక్కు వెళ్ళాయి. జాతీయ చట్టసభను రద్దుచేసే అవకాశాలు సన్నగిల్లాయని లెకార్ను కూడా చెప్పారు. యూరప్‌లో బలమైన ఆర్థిక వ్యవస్థగా ఉన్న ఫ్రాన్స్ క్రమంగా కొన్నేళ్ళుగా బలహీనపడుతూ వచ్చింది. ముఖ్యంగా మేక్రాన్ దేశాధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టినప్పటినుండీ ఫ్రాన్స్ ఆర్థిక వ్యవస్థ పతనావస్థలో కొనసాగుతున్నది. వామపక్షాలు సహా దేశంలో ప్రతిపక్షాలు, కూటమి నేతలు చెప్పినా వినకుండా గత ఏడాది జులైలో దేశ చట్టసభకు మేక్రాన్ ఎన్నికలు నిర్వహించడమే పెద్ద సమస్యగా మారింది. 2027 వరకూ మేక్రాన్ అధికారంలో కొనసాగేందుకు అవకాశం ఉన్నప్పటికీ తన అధికారానికి తిరుగులేకుండా ఉండాలని ఆయన అనేక వ్యూహాలు చేస్తున్నారు. వామపక్షాలను దూరంగా పెట్టారు. అప్పటి నుండీ ఆయనకు కష్టాలు మొదలయ్యాయి. నలుగురు ప్రధానమంత్రులు రాజీనామాలు సమర్పించారు. 577 మంది సభ్యులున్న దిగువసభలో వామపక్ష సంఘటన 182 అత్యధిక స్థానాలతో మేక్రాన్ పార్టీకి సవాలు విసురుతున్నది. మరోవైపు దేశంలో ప్రజలు ఆర్థిక సమస్యలు పరిష్కరించాలని ఇటీవలే వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేశారు. ఆర్థిక సంక్షోభ పరిష్కారమే మేక్రాన్ ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది.

## భారీ పేలుడు (మొదటి పేజీ తరువాయి)

స్పష్టంగా తెలియకపోయినా, భద్రతా నియ మాలు పాటించకపోవడమే ఈ ఘటనకు కారణమై ఉండవచ్చని అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. అధికారుల నిర్లక్ష్యమే ఈ విషాదానికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా, సమాచారం అందుకున్న వెంటనే మండపేట, రామచంద్రపురం, అనపర్తి ప్రాంతాల నుంచి అగ్నిమాపక శకటాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశాయి. మండపేట రూరల్ సీఐ దొర రాజు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై ప్రభుత్వం విచారణకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. మృతుల్లో బాణసంచా తయారీ కేంద్రం యజమాని కూడా ఉన్నట్టు తెలుస్తోంది. రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఈ విషాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదు కుంటుందని, గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తామని భరోసా ఇచ్చారు. కొమరిపాలెం గ్రామం శోకసంద్రంగా మారింది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు... ప్రమాద ఘటనపై విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయ పడ్డ వారికి ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అలాగే మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాం డ్ చేశారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.



**సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి :** బాణసంచా పేలుడు ఘటనపై సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అధి కారులతో ఆయన మాట్లాడారు. ప్రమా దంలో పలువురు చనిపోవడం పై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలు, ప్రస్తుత పరిస్థితి, సహాయక చర్యలు, వైద్య సాయంపై వివరాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. ఘటనాస్థలికి వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొనాలని ఆదేశించారు. మరోవైపు ఈ ఘటనపై హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ, అగ్ని మాపక శాఖ అధికారులతో ఆమె మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని మంత్రి తెలిపారు.

## విడుదల చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

నిరాహార దీక్షలతో శాంతియుతంగా గత నాలుగేళ్లుగా వాంగ్‌చుక్ పోరాడుతున్నారని కార్మిక సంఘాల ఐక్యవేదిక గుర్తుచేసింది. రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో చేర్చి సంపూర్ణ రాష్ట్ర హోదా కల్పించడం, హిమాలయాల పర్యావరణాన్ని పరిరక్షించడం, స్థానికుల హక్కులను కాపాడటం కోసం అహింసా మార్గంలో సాగుతున్న వాంగ్‌చుక్ సహా లేహ్‌లదాఖ్ ప్రజల పోరాటాన్ని అణచివేస్తున్నారని పేర్కొంది. బిజెపి తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలు కోసమే వారు పోరాడుతున్నారని, వాంగ్‌చుక్ సహా ఇతరులను తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని ఐక్యవేదిక డిమాండ్ చేసింది.

## స్వచ్ఛమైన నీరు (మొదటి పేజీ తరువాయి)

అమెరికాకు చెందిన ఒమర్ ఎం. యాఘీలను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్టు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ బుధవారం ప్రకటించింది. 'మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్' (ఎంఓఎఫ్)గా పిలిచే ప్రత్యేకమైన అణు నిర్మాణాలను అభివద్ధి చేసినందుకు గాను వారికి ఈ గౌరవం దక్కింది. ఈ శాస్త్రవేత్తలు లోహ అయాన్లను (మూలస్తంభాలుగా), పొడవైన కర్బన అణువులతో (సంధానకర్తలుగా) కలిపి సూక్ష్మస్థాయిలో ఖాళీలతో కూడిన స్ఫటికాలను రూపొందించారు. ఈ ఖాళీలు వాయువులు, ఇతర రసాయనాలను నిల్వ చేయడానికి లేదా రసాయనిక చర్యలు జరపడానికి గదుల్లా పనిచేస్తాయి. వీటిని ఉపయోగించి పర్యావరణంలోని విషవాయువులను నిల్వ చేయడం, నీటిలోని హానికర రసాయనాలను వేరుచేయడం, ఫార్మా వ్యర్థాలను విచ్ఛిన్నం చేయడం వంటి ఎన్నో క్లిష్టమైన సమస్యలకు పరిష్కారాలు కనుగొనవచ్చు. ఈ రంగంలో 1989లో రిచర్డ్ రాబ్సన్ తొలి అడుగులు వేయగా, ఆ తర్వాత సుసుము కిటగావా, ఒమర్ యాఘీ తమ పరిశోధనలతో దీనిని మరింత ముందుకు తీసుకెళ్లారు. కిటగావా ఈ నిర్మాణాల్లోకి వాయువులు స్వేచ్ఛగా ప్రవహిస్తాయని నిరూపించగా, యాఘీ అత్యంత స్థిరమైన ఎంఓఎఫ్ లను సష్టించి, వాటిని మనకు కావాల్సిన విధంగా మార్చుకునే పద్ధతిని ఆవిష్కరించారు. వీరి కషి ఫలితంగా ఇప్పటివరకు పదివేల రకాలకు పైగా ఎంఓఎఫ్‌లు రూపుదిద్దుకున్నాయి.

## స్థానిక నోటిఫికేషన్ నేడే!

(మొదటి పేజీ తరువాయి)

నవంబరు 11న ముగుస్తుంది. రెండు విడతల్లో జరిగే ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలకు 9న మూడు విడతల్లో జరిగే సర్పంచి, వార్డు స్థానాల ఎన్నికలకు 17న నోటిఫికేషన్ విడుదల చేస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ప్రకటించిన విషయం తెలిసిందే.

**కోర్టు స్టేతో అక్కడ ఎన్నికలకు బ్రేక్**

వివిధ కారణాలతో న్యాయస్థానాలు స్టే విధించిన కారణంగా 14 ఎంపిటిసి, 27 సర్పంచి, 246 వార్డు స్థానాలకు ఎన్నికలను నిలిపివేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. ఇందులో ములుగు జిల్లా మంగపేట మండలంలోని 14 ఎంపిటిసి, 25 సర్పంచి, 230 వార్డులుండగా, కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని రెండు సర్పంచి, 16 వార్డు స్థానాలకూ ఎన్నికలు నిర్వహించడం లేదని పేర్కొంది.

**ముగ్గురు పిల్లలుంటే అనర్హులే..**

గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లలుంటే అనర్హత వేటు నిబంధన ఈ ఎన్నికల్లోనూ అమలు కానుంది. దీన్ని సడలించేందుకు పంచాయతీరాజ్ శాఖ ప్రతిపాదనలు సమర్పించింది. జనాభా రేటుపై శాస్త్రీయ సమాచారం లేదనే కారణంతో ప్రభుత్వం తొలుత తిరస్కరించింది. ఆ తర్వాత ఇటీవల పునరాలోచన చేసినా, శాసనసభలో చట్టాన్ని సవరించాల్సి ఉన్నందున సమయాభావం కారణంగా జరపలేదు. దీంతో ముగ్గురు పిల్లలున్నవారు ఈ ఎన్నికల్లో పోటీకి అనర్హులని అధికారులు ప్రకటించారు.

**ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల షెడ్యూల్**

మొదటి విడత ఎంపిటిసి (2,963), జెడ్‌పిటిసి (292) ఎన్నికలు
నామినేషన్ల స్వీకరణ ప్రారంభం : అక్టోబరు 9
చివరి తేదీ : అక్టోబరు 11
పరిశీలన : అక్టోబరు 12
ఉపసంహరణ : అక్టోబరు 15

రెండో విడత ఎంపిటిసి (2,786) జెడ్‌పిటిసి (273) ఎన్నికలు
నామినేషన్‌ల స్వీకరణ ప్రారంభం : అక్టోబరు 13
చివరి తేదీ : అక్టోబరు 15
పరిశీలన : అక్టోబరు 16
ఉపసంహరణ : అక్టోబరు 19

ఓటర్ల వివరాలిలా..
రాష్ట్రంలో మొత్తం ఓటర్లు: 1,67,03,168
పురుషులు : 81,65,894
మహిళలు : 85,36,770 ఇతరులు : 504.

## రష్యా తరపున యుద్ధంచేస్తూ ఉక్రేన్‌కు లొంగిన యువకుడు

**కీవ్:** రష్యా తరపున యుద్ధంలో పాల్గొన్న భారత యువకుడు ఒకరు ఉక్రేన్‌కు లొంగిపోయారు. ఇతడిని గుజరాతీయుడుగా గుర్తించినట్లు, తమదేశంపై రష్యా తరపున యుద్ధం చేస్తుండగా లొంగిపోయినట్లు ఉక్రేన్ మీడియా బుధవారం ప్రకటించింది. గుజరాత్ మోర్బీ ప్రాంతానికి చెందిన యువకుణ్ణి మాజోతి సాహిల్ మహ్మద్ హుస్సేన్‌గా గుర్తించినట్లు తెలిపింది. ఈ యువకుడు రష్యా విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసంకోసం వెళ్ళి జైలుపాలై ఉక్రేన్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న యుద్ధంలో సైనికుడిగా చేరినట్లు 'కీవ్ ఇండిపెండెంట్' పేర్కొంది. ఉక్రేన్ సైన్యంలో 63వ బ్రిగేడ్ అతడిని మూడురోజుల యుద్ధం తర్వాత పట్టుకుంది. దీనికి సంబంధించి ఉక్రేన్ మెకనైజ్డ్ బ్రిగేడ్ వీడియోలో ఆ గుజరాతీ యువకుడు కనిపించాడు.ఎక్స్ వేదికగా ఈ వీడియో విడుదలైంది. మాదకద్రవ్యాల కేసుకు సంబంధించిన ఆరోపణలపై రష్యా తనకు ఏడు సంవత్సరాలు జైలుశిక్ష విధించిందని ఆ వీడియోలో యువకుడు చెప్పాడు. జైలుశిక్ష అనుభవిస్తున్న సమయంలో తదుపరి శిక్ష లేకుండా చేయడానికి వీలుగా సైన్యంలో చేరే కాంట్రాక్టుపై సంతకం చేసేందుకు తనకు అవకాశం ఇచ్చారని చెప్పాడు. "జైలులో ఉండటం నాకు ఇష్టంలేదు, అందుకే స్పెషల్ మిలిటరీ ఆపరేషన్ (ఉక్రేన్‌పై పూర్తిస్థాయి యుద్ధం)లో చేరాను, అక్కడి నుండి బయట పడాలనుకున్నాను'' అని చెప్పాడు. తనకు రష్యా సైన్యం 16 రోజులు శిక్షణ ఇచ్చిందని, అక్టోబరు ఒకటో తేదీన యుద్ధంలో చేరానని, మూడురోజులపాటు ఉక్రేన్‌పై యుద్ధం చేశాననీ, ఈలోపు తన కమాండర్‌తో విభేదాలు రావడంతో ఉక్రేన్ దళాలకు లొంగిపోయాననీ చెప్పాడు. "ఉక్రేన్ తవ్విన కందకాలకు రెండు మూడు కి.మీ సమీపానికి నేను చేరుకున్నాను, ఉక్రేన్ దళాలు కనిపించగానే నేను నా తుపాకిని నేలమీదపెట్టి లొంగిపోయాను, నాకు యుద్ధం చేయడం ఇష్టం లేదు, నాకు సహాయం కావాలి అని ఉక్రేన్ దళాలకు చెప్పాను'' అని యువకుడు వీడియోలో చెప్పాడు. దీనిపై భారత విదేశీమంత్రిత్వశాఖ స్పందించి ఆ యువకుడికి సంబంధించిన వివరాలను, నిజానిజాలను పరిశీలన చేయడం ప్రారంభించినప్పటికీ ఈ విషయాన్ని భారత్ ఇంకా ధృవీకరించలేదు. "ఉక్రేన్ ప్రభుత్వం నుండి అధికారికంగా మాకు ఎలాంటి సమాచారం అందలేదు, ఐనాగానీ ఈ విషయాన్ని మేం పరిశీలిస్తున్నాం'' అని భారత విదేశీమంత్రిత్వశాఖ ప్రకటనలో తెలియజేసింది. దాదాపు 12 మంది భారతీయులు తప్పుతోవపట్టి యుద్ధంలో మరణించినట్లు గడచిన జనవరిలో విదేశాంగశాఖ ప్రకటించింది.

## జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్

**హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు పార్టీ అభ్యర్థిని కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించింది. వి.నవీన్ యాదవ్ పేరును ఎఐసిసి బుధవారం రాత్రి అధికారికంగా ప్రకటించింది. నవీన్ అభ్యర్థిత్వానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదం తెలిపారని పార్టీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 11న జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉపఎన్నిక జరగనుంది. గత ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి తరపున పోటీ చేసి గెలిచిన మాగంటి గోపీనాథ్ (62) మృతితో ఈ ఎన్నిక అనివార్యమైంది. నవీన్ యాదవ్ ఆ ఎన్నికల్లో ఎంఐఎం తరపున పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరి, తాజాగా టికెట్ దక్కించుకున్నారు.

## దగ్గు మందుపై నిషేధం (మొదటి పేజీ తరువాయి)

నిర్వహించగా, ఇందులో డయిథైలీన్ గ్లైకాల్ కలుషితం ఉన్నదని అధికారులు గుర్తించారు. ఇటీవల మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో కోల్డ్రిఫ్ అనే దగ్గు సిరప్ వాడడం వల్ల పలువురు చిన్నారులు మృత్యువాత పడినట్టు ఆరోపణలు రావడంతో దీనిపై ప్రభుత్వం దర్యాప్తు జరుగుతోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అప్రమత్తమై, ఇప్పటికే కోల్డ్ రిఫ్‌ను పూర్తిగా నిషేధించింది. కోల్డ్‌రిఫ్ దగ్గు మందు తీసుకున్న కారణంగా మధ్యప్రదేశ్‌లో పదుల సంఖ్యలో చిన్నారులు మృతి చెందడంతో ఔషధ నియంత్రణ శాఖ అప్రమత్తమైంది. కాగా విచ్చలవిడిగా దగ్గు మందులను వాడితే కిడ్నీలు, కాలేయంపై ప్రభావం చూపుతాయని, శ్వాస సంబంధిత సమస్యలు, నిద్రలేమికి దారి తీసే అవకాశాలు కూడా ఉన్నాయని చెబుతున్నారు. రిలీఫ్,రెస్‌పిఫ్రెష్ రెండు దగ్గు ఉత్పత్తులను ఉన్నట్టు తెలిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 18005996969(ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటలు) ద్వారా సమాచారం ఇవ్వాలని డ్రగ్స్ కంట్రోల్ జనరల్ డైరక్టర్ షానవాజ్ ఖాసీ తెలిపారు.

## 12న 6 జిల్లాల్లో 'పల్స్ పోలియో వ్యాక్సినేషన్' స్పెషల్ డ్రైవ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో 'పల్స్ పోలియో వ్యాక్సినేషన్ ప్రత్యేక డ్రైవ్‌ను' ఈ నెల 12 నుంచి నిర్వహించనున్నారు. గత 3 సంవత్సరాలుగా బంగ్లాదేశ్, పాకిస్తాన్ తదితర దేశాల్లో పోలియో కేసులు నమోదవుతున్నాయి. దీంతో ఆయా దేశాల నుంచి భారతదేశానికి రాకపోకలు జరుగుతున్న జిల్లాల్లో పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కేంద్ర ఆరోగ్య శాఖ నిర్ణయించింది.

ఇందులో భాగంగానే దేశవ్యాప్తంగా 290 జిల్లాలను ఎంపిక చేయ గా, ఇందులో తెలంగాణ రాష్ట్రం నుంచి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, హన్మకొండ జిల్లాలు ఉన్నాయి. ఈ జిల్లాలతో పాటు వరంగల్ జిల్లా పరిధిలోని పట్టణ ప్రాంతంలోనూ వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించింది. రాష్ట్రంలోని ఆరు జిల్లాల పరిధిలో 05 సంవత్సరాల వయసు పిల్లలు 17,56, 789 మంది ఉన్నట్టు అధికారులు అంచనా వేశారు. వీరందరికీ ఈ నెల 12న స్పెషల్ డ్రైవ్ పోలియో వ్యాక్సిన్ వేయనున్నారు. అప్పుడే పుట్టిన శిశువుల నుంచి ఐదు సంవత్సరాల వయసు ఉన్న పిల్లలందరికీ వ్యాక్సిన్లు వేయించాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

## కొనసాగుతున్న ఉత్కంఠ (మొదటి పేజీ తరువాయి)

అసంతృప్తిని వ్యక్తం చేసింది. బిసి రిజర్వేషన్లు సీరియస్ అంశమని, తమ సహనాన్ని పరీక్షించొద్దని హితవు చెప్పింది. తర్వాత పిటిషనర్ల తరపున సీనియర్ లాయర్లు కె. వివేక్‌రెడ్డి, బి.మయూర్‌రెడ్డి, జె ప్రభాకర్ ఇతరులు వాదనలు ప్రారంభించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్నారు. బిసిలకు 25 నుంచి 42 శాతానికి పెంపు చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. డెడికేటెడ్ కమిషన్ చేసిన సిఫార్సులకు అనుగుణంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చట్ట వ్యతిరేకమన్నారు. అశాస్త్రీయ గణాంకాలతో 50 శాతం దాటిని రిజర్వేషన్ల నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరారు. రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీం కోర్టు మూడు వేర్వేరు కీలక కేసుల్లో వెలువరించిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సుప్రీం కోర్టు చెప్పిందన్నారు. ఇందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం చట్టం కూడా చేసిందన్నారు. దీనిని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సవరణ చేయడంతో ఈ వివాదం వచ్చిందన్నారు. షెడ్యూల్ ప్రాంతాల్లోని ఎస్టీలకు మేలు జరిగేలా రిజర్వేషన్లు 50 శాతానికి పెంచొచ్చునని సుప్రీం కోర్టు చెప్పిందన్నారు. ఈ మేరకు కృష్ణమూర్తి అండ్ అథర్స్ వర్సెస్ ఇండియా కేసులో తీర్పు చెప్పిందన్నారు. మరాఠా రిజర్వేషన్ల అంశంలోనూ 50 శాతం దాటిని రిజర్వేషన్లను సుప్రీం కోర్టు కొట్టేసిందన్నారు. రాష్ట్రంలో ఎస్టీలు మాత్రమే ఉన్న ప్రాంతాలు లేవని, సుప్రీం కోర్టు తీర్పుల ప్రకారం రాష్ట్రంలో రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్నారు. 42 శాతానికి రిజర్వేషన్ల పెంపు వల్ల మొత్తం రిజర్వేషన్లు 67 శాతానికి పెరుగుతాయని, ఇది రాజ్యాంగ వ్యతిరేకమని చెప్పారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లుకు గవర్నర్ ఆమోదం చెప్పలేదని, చట్టం కాకుండా ప్రభుత్వం జీవో 9 జారీ చేసిందని చెప్పారు. రిజర్వేషన్ల పెంపు, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పంచాయతీ రాజ్ శాఖ రూపొంచిన చట్ట నిబంధనలనే ఉల్లంఘిస్తూ జిఒ ఇచ్చిందన్నారు. పంచాయతీరాజ్ శాఖ జారీ చేసిన జిఒ 41ని కొట్టివేయాలని కోరారు. ఇప్పుడు ఏకంగా 67 శాతానికి పెంచడం చెల్లదన్నారు. ఇప్పుడున్న చట్ట నిబంధల ప్రకారం సుప్రీంకోర్టు తీర్పుల మేరకు పంచాతీయ ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఇందిరా సాహ్నీ కృష్ణమూర్తి, వికాశ్‌కిషన్ గవాయ్ కేసుల్లో సుప్రీం కోర్టు తీర్పులు శిరోధార్యమన్నారు. బిసి రిజర్వేషన్లను ఎబిసిడిలుగా వర్గీకరించాలంటూ దాఖలైన పిటిషనర్ లాయర్ వాదిస్తూ, అనంతరామన్ కమిషన్ నివేదికను ప్రభుత్వం విస్మరించిందన్నారు. మునురు కాపు, ముదిరాజ్, యాదవ, గౌడ్లకే స్థానిక సంస్థల్లో రాజకీయ అధికారం లభిస్తోందన్నారు. పేదలుగా ఉన్న బిసిలు అలాగే ఉంటున్నారని చెప్పారు. ప్రభుత్వం తరపున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. తొలుగ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ, రాష్ట్ర శానసనసభ బిల్లును ఆమోదించి గవర్నర్‌కు గత మార్చిలో పంపితే ఇప్పటి వరకు ఆమోదం చెప్పలేదన్నారు. ప్రజలు ఎన్నుకున్న సిఎం ప్రజల కోసం ముఖ్యంగా వెనుకబడిన ప్రజల కోసం పని చేస్తున్నారని, ఈ క్రమంలోనే స్థానిక ఎన్నికలల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పనకు జీవో వెలువడిందని చెప్పారు. గవర్నర్ తన అధికారాలను వినియోగించి బిల్లుకు ఆమోదం చెప్పడమో లేదో బిల్లును ప్రభుత్వానికి తిరిగి పంపడమో చేయాలని, ఏమీ చేయకుండా పెట్టుకుని ఉంటే ప్రభుత్వం తన పని తాను చేసుకుని వెళుతుందన్నారు. ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీ అని, గవర్నర్ నియామకం ద్వారా అధికారంలో ఉంటారని చెప్పారు. బిసి జనాభా పెరిగిన నేపథ్యంలో వారికి న్యాయం చేయాలనే కోణంలోనే ప్రభుత్వం ఐఏఎస్ అధికారి నేతృత్వంలో డెడికేటెడ్ కమిషన్‌ను నియమించిందని చెప్పారు. ఇంటింటికీ కమిషన్ సర్వే చేసి జనంలో ఉన్న పరిస్థితులను బేరీజు వేసి శాస్త్రీయంగా నివేదిక ఇచ్చిందన్నారు. బిసి జనాభా 56 శాతానికిపైగా ఉందని, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కమిషన్ సిఫార్సు చేసిందన్నారు. ఈ వ్యవహారాలన్నింటిపైన అసెంబ్లీలో సమగ్రంగా చర్చించాక అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో బిల్లును ఏకగ్రీవంగా ఆమోదం లభించిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జీవో 9ని, స్థానిక సంస్థల్లో బీసీలకు 25 శాతం నుంచి 42 శాతానికి రిజర్వేషన్లను పెంపు చేయడాన్ని అడ్డుకునేందుకు దాఖలైన పిటిషన్లలో స్టే ఆదేశాలు జారీ చేయాల్సిన అవసరం లేదన్నారు. కౌంటర్లు దాఖలు చేశాక సమగ్ర విచారణ పూర్తి చేశాక కోర్టు తగిన ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. బిసిలకు స్థానిక సంస్థల పదవుల్లో రిజర్వేషన్లు పెరిగితే పాలనాపరంగానే కాకుండా విద్య, ఉద్యోగ, ఆర్థిక ప్రయోజనాలు కూడా అందిపుచ్చుకుంటారని చెప్పారు. సాయంత్రం 4.50 గంటలప్పుడు ఎజి సుదర్శన్‌రెడ్డి కల్పించుకుని విచారణను రేపటికి వాయిదా వేయాలని కోరారు. దీంతో పిటిషనర్ తరపు న్యాయవాదులు కల్పించుకుని గురువారం ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. దీనిపై తిరిగి ఏజీ కల్పించుకుని, ఇప్పటికే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినట్లుందని, ఎన్నికల షెడ్యూల్ ఇది వరకే వెలువడిందని చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడ్డాక కోర్టుల జోక్యానికి ఆస్కారం లేదని, ఈ మేరకు సుప్రీం కోర్టు తీర్పులు కూడా ఉన్నాయని చెప్పారు. మళ్లీ పిటిషనర్ల న్యాయవాదులు జోక్యం చేసుకుని, ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే నేపథ్యంలో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులను జారీ చేయకుండానే హైకోర్టు విచారణను వాయిదా వేసింది. బిసి రిజర్వేషన్లపై ఏర్పాటు చేసిన వన్‌మ్యాన్ కమిటీ ఇచ్చిన నివేదికపై గెజిట్ ప్రచురించారా. బిల్లును గవర్నర్ ఆమోదించనప్పుడు దానిని ఆమోదించినట్లుగా పరిగణించారా, పరిగణిస్తే నోటిఫికేషన్ ఇచ్చారా, రాష్ట్రంలో బిసిల జనాభా ఒక్కో చోట ఒక్కోలా ఉంటుంది కదా.. అంతటా ఒకేలా 42 శాతం రిజర్వేషన్లు ఎలా ఇస్తారు.. వంటి ప్రశ్నలు ప్రభుత్వానికి వేసింది. ఇరుపక్షాల వాదనల అనంతరం ధర్మాసనం విచారణను గురువారం మధ్యాహ్నానికి వాయిదా వేసింది.



# జనరల్

STATE & REGIONAL NEWS

## రాష్ట్రంలో రెండురోజులు భారీ వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రెండురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు. దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు తెలంగాణ, రాయలసీమ, ఇంటీరియర్ తమిళనాడు మీదుగా సగటు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తు వరకు ద్రోణి కొనసాగుతుందని చెప్పారు. ఒడిశా ఉత్తర తీర ప్రాంతం నుంచి తెలంగాణ వరకు ఇంటీరియర్ ఒడిశా, దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా సగటు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతుందన్నారు. నైరుతి బంగాళాఖాతం తమిళనాడు తీరంలోని ఉపరితల ఆవర్తనం నుంచి కోస్తా కర్నాటక వరకు తమిళనాడు, రాయలసీమ, దక్షిణ ఇంటీరియర్ కర్నాటక మీదుగా సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతుందన్నారు. గురువారం కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు.

# వ్యవసాయ రంగాన్ని గాడిలో పెట్టాలి

### రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో గత పదేండ్లుగా వ్యవసాయ రంగం గాడి తప్పిందని.. గాడి తప్పిన వ్యవసాయ రంగాన్ని సియం రేవంత్ రెడ్డి గాడిలో పెడ్తున్నారని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. వ్యవసాయ రంగం బలోపేతం చేయడానికి రైతు కమిషన్ అన్ని అంశాలపై ఫోకస్ పెట్టిందని ఆయన అన్నారు. అందులో భాగంగానే కమిషన్ కార్యాలయంలో బుధవారం వ్యవసాయ, ఉద్యానవన, ఫారెస్ట్, నాబార్డు, వ్యవసాయ శాస్త్రవేతలతో సమావేశం నిర్వహించినట్లుగా తెలిపారు. ప్రధానంగా ఈ సమావేశంలో రైతులు కోతుల బెడద వల్ల ఎదుర్కొంటున్న సమస్యలు, నివారణ చర్యలు, సోలార్ ఫెన్సింగ్‌తోపాటు సాయిల్ టెస్ట్.. ఆవశ్యకతపై సుధీర్ఘంగా చర్చించినట్లు వివరించారు. కోతుల బెడద, నివారణ కోసం చర్యలు చేపట్టాలని, అడవుల్లో కోతులకు సరైన ఆహారం దొరకడం లేదని, ఫలితంగా కోతులు గ్రామాల్లోకి, పంట పొలాల పైకి వస్తున్నట్లు పేర్కొన్నారు. కోతుల బెడద నివారణ కోసం ఇతర రాష్ట్రాల్లో అవలంబిస్తున్న విధానాలపై అధికారులతో చర్చించారు. పంట పొలాల చుట్టూ సోలార్ ఫెన్సింగ్ చేయాలంటే రైతులపై ఆర్థిక భారం పడ్తుందని.. అలా కాకుండా ఇతర నివారణ చర్యలపై ఫోకస్ పెట్టాలన్నారు. రాష్ట్రంలో యూరియా వినియోగం విపరీతంగా పెరిగిందని, భూ పరిక్షలు చేసిన తర్వాతనే పంటలు సాగుచేసేలా అధికారులు చర్చలు చేపట్టాలని సూచించారు. అధిక మోతాదుల్లో యూరియా వాడకం వల్ల గాలి, నీరు, వాతావరణం కలుషితం అవుతున్నాయని తెలిపారు. ఇక భారతీయ వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు రూపొందించిన సాయిల్ టెస్టింగ్ కిట్ డెమోను ఈ సమావేశంలో ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు ప్రదర్శించారు. ఐఐఆర్ఆర్ రూపొందించిన సాయిల్ టెస్ట్ కిట్‌ను రైతు కమిషన్ కొనుగోలు చేసి.. వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి గోపికి అందజేసింది. భూ సార పరీక్షా పరికరాలు రైతులకు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టాలని కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. వ్యవసాయ రంగానికి కేంద్రం నుండి వచ్చే నిధులు, నాబార్డు నిధుల వినియోగం సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. అదేవిధంగా జర్మనీ ప్రతినిధులు ఏసీఆర్ఏటీ సంస్థ వరి,పత్తి సాగులో ఏఐ టెక్నాలజీ వినియోగంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రస్తుతం వేములవాడ నియోజక వర్గంలో మూడు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఏఐ టెక్నాలజీ ఇంప్లిమెంటేషన్ చేస్తున్నట్లు జర్మనీ సంస్థ ప్రతినిధులు వివరించారు. ఈ సమావేశంలో రైతు కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి, భవానీరెడ్డి, గడుగు గంగాధర్, చెవిటి వెంకన్నయాదవ్, రాములు నాయక్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి, హార్టికల్చర్ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, శ్రీ కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటీ విసి రాజిరెడ్డి, అటవీ శాఖ పీసీసీఎఫ్ ఎలుసింగ్ మేరు, నాబార్డు ఏజీఎం చంద్రశేఖర్, ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు బ్రజేంద్ర, మానస, వ్యవసాయ శాఖ జేడీఏ సుచరిత, కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్, వ్యవసాయ శాస్త్రవేత్త రామాంజనేయులు, జర్మనీ ఏసీఆర్ఏటీ సంస్థ ప్రతినిధులు రఘు చలిగంటి, సెబాస్టియన్ బోస్ తోపాటు వ్యవసాయ శాఖ అధికారులు హారి వెంకట ప్రసాద్, మహేష్, రజిత, శ్రావణి, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.



సంస్మరణ సభలో వక్తలు

# అంతరాలులేని సమాజం కోరుకున్న వ్యక్తి సురవరం

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి, అమరజీవి అగ్రనాయకులు మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ కొల్లాపూర్‌లోని మహబూబ్ ఫంక్షన్‌హాలులో బుధవారం సుధాకర్‌రెడ్డి బంధుమిత్రులు కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసభకు మద్దిరెడ్డి అధ్యక్షత వహించగా సిపిఐజాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఎక్సైజ్, సాంస్కృతిక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో చాలామంది నాయకులు ఆదర్శాలు చెబుతారని కాని వాటిని ఆచరించరని, సురవరం సుధాకర్‌రెడ్డి చెప్పిన ప్రతి ఆదర్శాన్ని అమలు చేసి చూపిన నిజమైన ప్రజానాయకుడు అని వారు కొనియాడారు. సుధాకర్‌రెడ్డి జీవితకాలమంతా అంతరాలులేని సమసమాజస్థాపనయే లక్ష్యంగా పనిచేశారని కులం, మతం, ప్రాంతం, డబ్బు హోదా పలుకుబడి ఈ అంతరాలతో ప్రజలు నేడు ఎవరికివారు అంతరాలు గీసుకొని వర్గాలుగా విడిపోయి జీవిస్తున్నారని అన్నారు. సురవరం సుధాకర్‌రెడ్డి అంతరాలులేని సమాజంకోసమే తన జీవితం మొత్తాన్ని కమ్యూనిస్టు పార్టీ కోసం దారబోశారని అన్నారు. నేటితరపు నాయకులందరికి సుధాకర్‌రెడ్డి ఎంతో ఆదర్శమని, ఆకలితో అలమటించే పాలమూరు జిల్లాలో అంబలికేంద్రాలను పెట్టి ఆకలియాత్ర నిర్వహించిన మహామనిషి అన్నారు. 18 సంవత్సరాల యువతీ యువకులకు ఓటుహక్కు కావాలని మొట్టమొదటిసారి దేశవ్యాప్తంగా నినదించి 23 సంవత్సరాలనుండి 18 సంవత్సరాలకే ఓటుహక్కు వచ్చేలా ఉద్యమం చేసి సాధించిన ఘనత ఆయనది అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా,కాంగ్రెస్‌పార్టీ నాయకులు పగిడాల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్, బిజెపి నియోజకవర్గ ఇంచార్జ్ సుధాకర్‌రావు, కందాల రామకృష్ణ, తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెనర్సింహ్మా, జిల్లా కార్యవర్గసభ్యులు యేసయ్య, ఆర్.ఇంద్ర, వరదారెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి శివుడు, తప్పెట కిరణ్, కిరణ్‌కుమార్, వెంకటస్వామి, యూసుఫ్, నిరంజన్‌నాయుడు, జంగం శివుడు, సుధాకర్‌రెడ్డి కుటుంబసభ్యులు అభిమానులు, నాయకులు పాల్గొన్నారు.

# సమసిన మంత్రుల వివాదం



### అడ్లూరిపై పొన్నం వ్యాఖ్యల వివాదం
### ఇరువురినీ ఇంటికి పిలిపించుకున్న మహేశ్ గౌడ్ .. పొన్నం క్షమాపణ చెప్పడంతో సమసిన వివాదం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్‌ల మధ్య నెలకొన్న వివాదం సమసిపోయింది. అడ్లూరి లక్ష్మణ్‌కు పొన్నం ప్రభాకర్ క్షమాపణ చెప్పి వివాదానికి ముగింపు పలికారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై పార్టీ నిర్వహించిన సమావేశంలో పొన్నం ప్రభాకర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై అడ్లూరి లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేయడం, దీనికి పొన్నం ప్రభాకర్ సోషల్ మీడియా వేదికగా వివరణ ఇవ్వడం విదితమే. ఈ వివాదం కాస్తా ముదురుతుండడంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. మంత్రులు ఇద్దరిని తన నివాసానికి ఆహ్వానించి ఇరువురి మధ్య సయోధ్య కుదిర్చారు. బుధవారం ఉదయం మహేశ్ గౌడ్ నివాసంలో భేటీ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు పొన్నం ప్రభాకర్ క్షమాపణలు చెప్పారు. ఈ సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కవ్వంపల్లి సత్యనారాయణ, స్పోర్ట్స్ చైర్మన్ శివసేన రెడ్డి, నాయకులు సంపత్ కుమార్, అనిల్, వినయ్ కుమార్ పాల్గొన్నారు.

**మంత్రుల మధ్య జరిగిన సంఘటన కుటుంబ సమస్య : మహేశ్ కుమార్ గౌడ్**

టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ చేశారన్న వ్యాఖ్యల పట్ల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నొచ్చుకోవడంతో యావత్ సమాజం కొంత బాధపడిందన్నారు. మంత్రుల మధ్య జరిగిన సంఘటన కుటుంబ సమస్యగా వెల్లడించారు. జరిగిన సంఘటన పట్ల చింతిస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్ క్షమాపణలు చెప్పారన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కష్టపడి పైకొచ్చిన నేతలని తెలిపారు. ఈ సమస్య ఇంతటితో సమసిపోవాలని యావత్ మాదిగ సామాజికవర్గానికి మహేశ్ కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఎక్కడ మాట్లాడినా కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రులకు ఆయన విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల పార్టీ అని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ఆశయాన్ని ఆకాంక్షలను కాంగ్రెస్ పార్టీ ముందుకు తీసుకెళ్తుందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సహాయంతో కుల సర్వే పారదర్శకంగా నిర్వహించామని చెప్పారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మూడు చట్టాలు తీసుకొచ్చామని అన్నారు.

**అడ్లూరి మనస్తాపం చెందారు.. అందుకే క్షమాపణలు చెబుతున్నా : పొన్నం ప్రభాకర్**

ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 'నేను ఆ వ్యాఖ్యలు చేయకపోయినా, ప్రస్తుతం జరుగుతున్న ప్రచారంతో మంత్రి అడ్లూరి మనస్తాపం చెందారు. అందుకే ఆయనకు క్షమాపణలు చెబుతున్నాను. అడ్లూరికి, నాకు పార్టీ సంక్షేమం తప్ప మరో ఉద్దేశం లేదు' అని అన్నారు. నేను ఆ ఒరవడిలో పెరగలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ నాకు ఆ సంస్కృతి నేర్పలేదని, సామాజిక న్యాయానికి పోరాడే సందర్భంలో వ్యక్తిగత అంశాలు పక్కన ఉంచి, కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయంలో బలహీనవర్గాల బిడ్డగా ఈరోజు రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ నాయకత్వంలో రాహుల్ గాంధీ సూచన మేరకు 42 శాతం రిజర్వేషన్లకు పోరాటం జరుగుతుందన్నారు. లక్ష్మణ్‌కి వ్యక్తిగతంగా క్షమాపణలు చెప్పుతున్నా, కరీంనగర్‌లో మాదిగ సామాజిక వర్గం మేమంతా కలిసి పెరిగామని తెలిపారు. ఆ అపోహ ఉండవద్దని విజ్ఞప్తి చేస్తున్నా అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

**పార్టీ లైన్ దాటను : లక్ష్మణ్**

పొన్నం క్షమాపణ కోరడంతో ఈ సమస్య ఇంతటితో సమసిపోయిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. పొన్నం ప్రభాకర్‌ను గౌరవిస్తా, కానీ ఆయన వాఖ్యల పట్ల మాదిగ జాతి బాధపడిందన్నారు. అట్టడుగు సామాజిక వర్గాలకు కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. జెండా మోసిన తనకు మంత్రిగా అవకాశం ఇచ్చారని, పార్టీ లైన్ దాటే వ్యక్తిని కానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు.

## మద్యం షాప్‌ల కోసం 1581 దరఖాస్తులు

### ఇంకా పది రోజుల గడువు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ తెలంగాణలో కొత్త మద్యం షాపులకు పిలిచిన దరఖాస్తుల ఆహ్వానంలో భాగంగా ఈ నెల 7వ తేదీ నాటికి 1581 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ తెలిపారు. మద్యం షాపులకు దరఖాస్తులు రోజు రోజు పెరుగుతూ వస్తున్నాయన్నారు. గత రెండేళ్ల క్రితం పిలిచిన మద్యం షాపులకు దరఖాస్తులకు కంటే ఈసారి మద్యం షాపుల కోసం దరఖాస్తులు ఎక్కువ వచ్చే అవకాశాలు ఉన్నాయని అంచనాలు వేస్తున్నామని అన్నారు. తెలంగాణలోని 2620 మద్యం దుకాణాలకు 1581 దరఖాస్తులు ఈ నెల 7 వరకు వచ్చాయన్నారు. ఓపెన్ క్యాటగిరిలో 1834 మద్యం దుకాణాలకు 992 దరఖాస్తులు, గౌడ్‌లకు కేటాయించిన 393 దుకాణాలకు 223 దరఖాస్తులు ఎస్‌సిలకు కేటాయించిన 262 మద్యం దుకాణాలకు 55, ఎస్‌టి లకు కేటాయించిన 131 షాపులకు 13 మొత్తంగా 2620 మద్యం షాపులకు 1581 దరఖాస్తులు వచ్చాయన్నారు. చివరి మూడు రోజులు భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశాలు ఉండడంతో తగిన ఏర్పాట్లను చేస్తున్నారు. అబ్కారీ భవన్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్ దరఖాస్తులు వేయడానికి వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, అనుమానాలను నివృత్తి చేయడానికి హెల్ప్ డెస్క్‌లు కూడా ఏర్పాటు చేశారు.

# గ్రామీణ డిజిటల్ కనెక్టివిటీలో 'తెలంగాణ' రోల్ మోడల్



### 'టి- ఫైబర్' గ్రామాల పైలెట్ ప్రాజెక్టు దేశానికే ఆదర్శం
### మంత్రి శ్రీధర్ బాబును అభినందించిన కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రామీణ ప్రాంతాలకు డిజిటల్ కనెక్టివిటీని అందించడంలో 'తెలంగాణ' ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా మారిందని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య ఎం.సింధియా కితాబునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'టిఫైబర్' గ్రామాల పైలెట్ ప్రాజెక్టు దేశానికి ఆదర్శంగా నిలిచిందని ప్రశంసించారు. ఆయన అధ్యక్షతన బుధవారం ఢిల్లీ లో నిర్వహించిన 'స్టేట్ గవర్నమెంట్ ఐటీ మినిస్టర్స్ అండ్ ఐటీ సెక్రటరీస్ రౌండ్ టేబ్ సదస్సులో వినూత్న విధానాలతో డిజిటల్ సమ్మిళత్వానికి 'తెలంగాణ' బాటలు వేస్తుందంటూ రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖమంత్రి శ్రీధర్ బాబును ప్రత్యేకంగా అభినందించారు. 'లాస్ట్‌మైల్ ఫైబర్ కనెక్టివిటీ' గ్రామీణ సమూహాలను ఎలా మార్చగలదో తెలంగాణ చేసి చూపించిందని కొనియాడారు. 'టీ ఫైబర్' నమూనాను దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు ఇతర రాష్ట్రాలకు కూడా సహకారం అందించాలని కోరారు. ఈ పైలెట్ ప్రాజెక్టును ఇతర ప్రాంతాలకు విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. 'డిజిటల్ సమానత్వం సమ్మిళిత వృద్ధికి పునాది. గ్రామీణ–పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న డిజిటల్ అంతరాన్ని తగ్గించాలన్నదే మా ప్రభుత్వ సంకల్పం. అందుకు అనుగుణంగానే పకడ్బందీ ప్రణాళికలను రూపొందించి చిత్తశుద్ధితో అమలు చేస్తున్నాం. వినూత్న విధానాలతో ముందుకెళ్తున్నాం. భావితరాల కోసం పటిష్ఠమైన డిజిటల్ మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్నాం' అని రాష్ట్ర ప్రభుత్వం తరపున రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. 'డిజిటల్ ఫలాలు మారుమూల ప్రాంతాల్లో ఉన్న చివరి వ్యక్తి వరకూ చేరాలన్నదే మా లక్ష్యం. టీఫైబర్ ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఇంటికి, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, వాణిజ్య సంస్థలకు తక్కువ ఖర్చుతో హై స్పీడ్ కనెక్టివిటీని అందించేందుకు కృషి చేస్తున్నాం. డిజిటల్ ఇండియా, భారత్ నెట్ లక్ష్యాలకు అనుగుణంగా ఫైబర్ టు ది హోమ్ నెట్‌వర్క్ ద్వారా ఈ గవర్నెన్స్, విద్య, ఆరోగ్య సంరక్షణ, డిజిటల్ వ్యవస్థాపకత తదితర సేవలను ప్రజల ముంగిటకే సమర్థవంతంగా చేర్చుతు న్నాం' అని చెప్పారు. 'భారత్ నెట్' అమలులో వేగం పెంచాలని, రైట్ ఆఫ్ వే సవాళ్లను పరిష్కరించాలని, దేశ, రాష్ట్రాల డిజిటల్ ఆస్తులను పరిరక్షించేందుకు సైబర్ భద్రత ఫ్రేమ్‌వర్క్‌లను బలోపేతం చేయాలని ఈ సందర్భంగా ఆయన కేంద్రాన్ని కోరారు. ఈ అంశాల్లో రాజకీయాలకు అతీతంగా కేంద్రంతో కలిసి పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ సమావేశంలో టిఫైబర్ ఎండీ వేణు ప్రసాద్, ఇతర రాష్ట్ర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయండి

### సిఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో తక్షణమే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలిపారు. మొక్కజొన్నకు కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2400లతో పాటు రూ.330ల బోనస్ లభించే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు బుధవారం బహిరంగ లేఖ రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 7లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారని, పంటకోతకు వచ్చి మక్కలను మార్కెట్‌లోకి తరలిస్తున్నారని, దాదాపు అన్ని మార్కెట్ యార్డులు మొక్కజొన్న నిల్వలతో నిండిపోయాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతుల శ్రమను దళారులు దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటాకు రూ.2400 మద్దతు ధరతో పాటు రూ.330 బోనస్‌ను రైతులకు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అడ్డికి పావు సేరు చొప్పున రైతులు అమ్ముకునే దుస్థితి ఏర్పడిందని, క్వింటా మక్కలను రూ.1600కే రైతుల వద్ద నుంచి ప్రైవేట్ వ్యాపారులు కొంటున్నారని ఆ లేఖలో హరీశ్‌రావు పేర్కొన్నారు.

## మత్తు మందుచల్లి ఇంట్లో దొంగతనం

### వృద్ధుడు మృతి, వృద్ధురాలి పరిస్థితి విషమం



**ప్రజాపక్షం/గంగాధర :** గంగాధర మండలం గర్శకుర్తి గ్రామంలో దారుణ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సంతానం లేక ఒంటరిగా జీవిస్తున్న వృద్ధ దంపతులపై గుర్తు తెలియని వ్యక్తులు మత్తుమందు చల్లి ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో వృద్ధుడు మృతి చెందగా వృద్ధురాలి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గర్శకుర్తి గ్రామానికి చెందిన గజ్జల శంకరయ్య (75), భార్య లక్ష్మి దంపతులపై మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వారిపై మత్తు మందు చల్లగా దంపతులు అపస్మారకస్థితిలో పడిపోవడంతో దుండగులు ఇంట్లో చోరీకి పాల్పడ్డారని, లక్ష్మి మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడు మాయం అయినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఇద్దరూ ఒంటరిగా నివసించడమే కాకుండా వారి ఇల్లు గ్రామానికి కొంచెం దూరంగా ఉండడం దుండగులకు అనుకూలంగా మారిందని గ్రామస్తులు చెబుతున్నారు. దంపతులు ఉదయం 11 గంటల నుంచే అపస్మారక స్థితిలో ఉండగా సాయంత్రం 6 గంటల సమయంలో స్థానికులు గమనించి పోలీసులకు, 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా వారిని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ సంఘటనపై గంగాధర ఎస్సై వంశీకృష్ణ మాట్లాడుతూ ఘటనాస్థలాన్ని సందర్శించి గ్రామస్తులు, వైద్యుల ద్వారా వివరాలు సేకరించామన్నారు. సంఘటనలో వృద్ధుడు గజ్జల శంకరయ్య బుధవారం మృతి చెందగా భార్య లక్ష్మి పరిస్థితి విషమంగా ఉందన్నారు. అనుమానాస్పద కేసుగా నమోదు చేసి పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
కుత్బుల్లాపూర్ సర్కిల్-25

NIT No. 20/DB/EE/Quthbullapur Circle/GHMC/2025-26, తేది: 08.10.2025

పని పేరు: సిసి రోడ్ విస్తరణ, అంచనా విలువ : రూ.4.75లక్షలు, ప్రారంభ తేది & సమయం : 09.10.2025న మ.1.00గం.ల నుండి, బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం : 16.10.2025న మ.1.00గం.ల వరకు. టెండర్ ఆహ్వానించు అధికారి వివరాలు మరియు మొబైల్ నెం.: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9701365503, హెడ్ డ్రాఫ్ట్స్‌మన్ సెల్ నెం. 7337557259. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కుత్బుల్లాపూర్ సర్కిల్-25, జిహెచ్ఎంసి

DIPR R.O. No. : 8909-PP/CL/ADVT/1/2025-26, Date: 08-10-2025


# నేడు 'తెలంగాణ సమాచార హక్కు చట్టం' 20వ వారోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'తెలంగాణ సమాచార హక్కు చట్టం' 20వ వారోత్సవ వేడుకలు గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరగనున్నాయి. ఈ సందర్భంగా 'ఆర్‌టిఐ 2025' విజేతలకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ బహుమతులను అందజేయనున్నారు. గడిచిన 30 నెలలుగా నిర్వీర్యమైన 'సమాచార కమిషన్'కు ఇటీవల నూతనంగా నియమితులైన సమాచార హక్కు కమిషనర్లు నూతన ఉత్తేజాన్ని నింపారు. గడిచిన 11 సంవత్సరాల నుండి పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు కమిషనర్లు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. నూతన కమిషన్ బాధ్యతలు స్వీకరించి నాలుగు నెలల కాలంలోనే వీలైనన్ని కేసులను విచారించి. వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగానే ముందుగా తక్కువ కేసులు ఉన్న శాఖలపైన దృష్టి పెట్టి, ఇప్పటి వరకు 12 శాఖలను ప్రక్షాళన చేపట్టారు. ఇందులో పశుసంపద, బిసి సంక్షేమ, పౌర సరఫరాలశాఖ, గృహ నిర్మాణ, పరిశ్రమలు, ఐటి, కార్మిక ఉపాధి కల్పన, ప్లానింగ్, సాంఘీక సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ, యువజన, దేవాదాయ శాఖలు ఉన్నాయి. కాగా నూతనంగా నియమితులైన కమిషనర్లకు వారం రోజుల పాటు హైదరాబాద్‌లోని ఎంసిహెచ్ఆర్‌డిలో శిక్షణ ఇచ్చారు. ఢిల్లీలో జరిగిన నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ కమిషనర్స్ ద్వారా నిర్వహించిన వర్క్‌షాపులో కూడా వారు పాల్గొన్నారు. ఆ తర్వాత సమాచార హక్కు చట్టాన్ని మరింత పగడ్బందీగా అమలు చేసేందుకు తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ జిల్లా, ప్రభుత్వ శాఖల వారీగా నోడల్ ఆఫీసర్లను నియమించింది. 'పబ్లిక్ ఇన్‌ఫర్మేషన్ ఆఫీసర్ (పిఐఒ), ఆర్‌టిఐ కేసులను పరిష్కరించడంలో,అప్పిలేట్ అథారిటీ, అసిస్టెంట్ పబ్లిక్ ఇన్‌ఫర్మేషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన,అలాగే ఉత్తమ ఉద్యోగికి' 'తెలంగాణ సమాచార హక్కు చట్టం' 20వ వారోత్సవ వేడకల సందర్భంగా అవార్డులను అందజేయనున్నారు.

**సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాలు**

సమాచార హక్కు చట్టంపైన ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు కమిషన్ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం ప్రాధాన్యతను ప్రజలకు వివరించింది.అవగాహన లేకపోవడం, లేదా ఆ జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయడం లేదని గుర్తించి, జిల్లాలో పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లు (పిఐఒ)లతో కలిసి అవగహన సదస్సులు నిర్వహించింది. అలాగే ఆయా జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు విచారించింది. ఇప్పటి వరకు జనగామ, కామారెడ్డి, మెదక్, నిర్మల్, వనపర్తి, వరంగల్, జోగులాంబ గద్వాల్, వికారాబాద్, సిద్దిపేట, మహబూబాబాద్ తదితర జిల్లాలలో అవగాహనా సదస్సులను నిర్వహించారు.


**SHRIRAM Finance — వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | AP36TA 9652 | Vikram Challa | TATA ACE | 2012 |
| 2 | TS22D 0916 | Vihaya Gaja | DIZER TOUR DIESEL 5 SEATER | 2014 |
| 3 | TS36T 5437 | Itikala Bhagyamma | DIZER TOUR DIESEL 5 SEATER | 2019 |
| 4 | TS08EE 0888 | Raju Togaru | INNOVA CRYSTA 2.4 V DIESEL 7 SEATER | 2017 |

AUCTION DATE : 11-10-2025

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED
H.No :4-316,4-317,4-318, Ground Floor, Opp : Fire Station, Parkal, Warangal District Cell : 9666726222, 9989766426

## టిఆర్‌టిఎఫ్ మాద్గులపల్లి మండల శాఖ ఎన్నిక

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టిఆర్‌టిఎఫ్)మాద్గులపల్లి మండల శాఖ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా యన్.కరుణాకర్,కొమరాజు జగన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నిమ్మనగోటి జనార్దన్, తరాల పరమేష్ యాదవ్ తెలిపారు. బుధవారం జిల్లా కార్యాలయంలో జరిగిన మండల శాఖ సమావేశంలో వారికి నియామకపత్రం అందజేసి వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై ఉమ్మడి రాష్ట్రంలో పోరాటాలు చేసి ఎన్నో జీవోలు సాధించిన ఘనత కలిగిన సంఘం అని, ప్రభుత్వ గుర్తింపు పొందిన , సివిల్ సర్వీస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ లో శాశ్వత సభ్యత్వం కలిగి సమాజ శ్రేయస్సు, విద్యాప్రగతి, ఉపాధ్యాయుల సంక్షేమం లక్ష్యాలుగా పనిచేస్తున్నదని అన్నారు. డిసెంబర్ నెలలో హైదరాబాద్ లో జరుగనున్న 80 వసంతాల విద్యాసదస్సులో జిల్లా నుండి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. 80 వసంతాల విద్యాసదస్సు కరపత్రాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. జిల్లా గౌరవ సలహాదారులు తంతెనపల్లి సైదులు, జిల్లా గౌరవాధ్యక్షులు సంధ్యాల మోహన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు దొడ్డేని సాయిబాబు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

## స.హ చట్టంతో పారదర్శకత పెంపు

సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె నరసింహ

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : సమాచార హక్కు చట్టం ద్వారా పాలనలో పారదర్శకత, బాధ్యత పెరుగుతుందని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 5 నుండి 12 వరకు నిర్వహిస్తున్న సమాచార హక్కు చట్టం వారోత్సవాలలో భాగంగా జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా సంబంధిత పోలీసులు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సమాచార హక్కు చట్టం కింద ప్రజలు కోరిన సమాచారాన్ని ఇవ్వాల్సిన బాధ్యత పౌర సమాచార అధికారులు, పబ్లిక్ అథారిటిలపై ఉందన్నారు. తప్పుడు సమాచారం ఇవ్వవద్దని అన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా అధికార యంత్రాంగాలలో పారదర్శకత, బాధ్యత పెరుగుతుందని తెలిపారు.





## కస్తూర్బా పాఠశాలలో సమస్యలు రావొద్దు

కస్తూర్బా గాంధీ పాఠశాలను సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ ఆకస్మిక తనిఖీ

ప్రజాపక్షం/హాలియా: బాలికలు చదువుకునే కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ అన్నారు. బుధవారం హాలియాలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో పాఠశాలలో నెలకొన్న అన్ని సమస్యలను పాఠశాల ప్రత్యేక అధికారి హైమావతిని అడిగి తెలుసుకున్నారు. ప్రధాన సమస్యలను సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చిన ఆమె వాటిని పరిష్కరించేలా తక్షణం చూస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు. బాలికల పాఠశాలలో నెలకొన్న ఏ చిన్న సమస్య అయినా తమ దృష్టికి తీసుకురావాలని తద్వారా దానికి వెంటనే పరిష్కారం దొరుకుతుందని అధికారులకు సూచించారు. అనంతరం పాఠశాల మొత్తం తిరిగి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ మాట్లాడుతూ బాలికలు లక్ష్యంతో చదువుకొని తల్లిదండ్రులు మీపై ఉంచిన నమ్మకాన్ని వొమ్ము చేయకుండా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన చెప్పారు. సబ్ కలెక్టర్ తాసిల్దార్ రఘు, మండల విద్యాధికారి గుండా కృష్ణమూర్తి, ఎస్ ఓ హైమావతి తదితరులు ఉన్నారు.

## తల్లి గర్భంలోనే పసికందు మృతి

వైద్యుల నిర్లక్ష్యమే అంటూ ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన




ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ల నిర్లక్ష్యంతో నిండు గర్భిణి కడుపులోనే పసికందు కన్నుమూసిందని మృతురాలి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ బుధవారం ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుర్రంపోడు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి డెలివరీ కోసం వైద్యులు నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించడం జరిగిందని తెలిపారు. వెంటనే నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావడం జరిగిందని గర్భిణీస్త్రీ కి పొద్దుగాల నుంచే నొప్పులు వస్తున్నా ఇంకా టైం ఉంది అంటూ వైద్యులు నిర్లక్ష్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యులను ప్రాధేయపడ్డా పట్టించుకోలేదని తల్లి కన్నీళ్లను అర్థం చేసుకోని ఆసుపత్రి డాక్టర్ల ఆలస్యం కారణంగా తల్లి గర్భంలోనే పసికందు మృతి చెందిందని తల్లి పరిస్థితి కూడా విషమంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇది వైద్యం కాదు, వైద్యుల హత్య అంటూ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. బంధువుల ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టడంతో సమాచారం అందుకున్న టూ టౌన్ పోలీసులు ఆసుపత్రికి చేరుకొని దర్యాప్తు చేపడుతున్నారు.

## 2625 కేజీల నల్లబెల్లం, 200 కేజీల పటిక పట్టివేత

నిషేధిత పదార్థాలు రవాణా చేస్తే కఠిన చర్యలు : ఎస్ఐ



ప్రజాపక్షం/డిండి: నిషేధిత నల్ల బెల్లం, పటిక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలుంటాయని డిండి ఎస్ఐ బాలకృష్ణ అన్నారు. బుధవారం ఉదయం మండలంలోని చెరుకుపల్లి గ్రామ సమీపంలో డిండి పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో మహేంద్ర బొలేరో వాహనం టిజి 07 యూ 6853 డ్రైవర్ అనుమానస్పదంగా వాహనాన్ని నడుపుతుండగా వాహనాన్ని పోలీసులు ఆపి తనిఖీ నిర్వహించగా వాహనంలో సుమారు 75బస్తాలలో 2625 కేజీల నల్ల బెల్లం, 5 బస్తాలలో 200 కేజీల పటిక ను పోలీసులు గుర్తించి వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా ప్రభుత్వం నిషేదించినటువంటి సారా తయారు చేయడం కోసం నల్ల బెల్లంను, పటికను అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలపడంతో అక్రమంగా నల్లబెల్లం, పటికను తరలిస్తున్న కేతావత్ రవి, రమావత్ రమేష్, గద్దె వెంకటేష్‌లపై కేసు నమోదు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

## కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన



ప్రజా పక్షం/నల్లగొండ : పత్తి కొనుగోలులో రైతులు ఇబ్బందులు పడకుండా కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.పత్తి కొనుగోలుకై కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొత్తగా ఏర్పాటు చేసిన కపాస్ కిసాన్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించే నిమిత్తం బుధవారం నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల వ్యవసాయ,మార్కెటింగ్ శాఖ అధికారులకు ఉద్దేశించి ఉదయాదిత్య భవన్ లో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.గత సంవత్సరం రైతులు పత్తి ని అమ్మేందుకు ఆన్ లైన్ లో తప్పు బుకింగ్ చేసుకోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఈ సంవత్సరం అలాంటి సమస్యలు రాకుం డా పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. రైతులందరూ ఒకేసారి జిన్నింగ్ మిల్లులకు పత్తిని తీసుకు రాకుండా నిర్ణీత షెడ్యూల్ ను రూపొందించాలని, ఇందుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారుల సహకారం తీసుకోవాలన్నారు. అన్ని విషయాలను ఎప్పటికప్పుడు రైతులకు చేరవేసినట్లయితే రైతులు ఎలాంటి ఇబ్బంది లేకుండా పత్తి అమ్ముకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్,మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఛాయాదేవి,జిల్లాల వ్యవసాయ,మార్కెటింగ్ శాఖ అధికారులు ఉన్నారు.

# చివరిగింజ వరకూ ధాన్యం సేకరణ

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చివరి గింజ వరకు ధాన్యం సేకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలను ఆదేశించారు. ఖరీఫ్ (వానాకాలం) 2025/26 సీజన్‌కి సంబంధించి ధాన్యం కొనుగోలుపై బుధవారం ఆయన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో ఐకెపి, పిఏసిఎస్, ఎఫ్‌పిఓ, మెప్మా శాఖలకు చెందిన కొనుగోలు కేంద్రాల ఇంచార్జీలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో ఐకెపి ద్వారా 158, పిఏసిఎస్ ద్వారా 122, ఎఫ్‌పిఓ ద్వారా 15, మెప్మా ద్వారా 13 మొత్తం 308 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని కొనుగోలు కేంద్రాలను వారం రోజుల్లో ప్రారంభించాలని ఇంకా ఎక్కడైనా అవసరం ఉంటే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలు లోతట్టు ప్రాంతంలో ఉండకుండా ఎత్తైన ప్రదేశాలలో ఏర్పాటు చేసుకోవాలని ప్రతి కేంద్రంలో వెయింగ్ మిషన్, విద్యుత్, త్రాగునీరు, ఫ్లెక్సీపై నిర్వాహకుల పేరు, ఫోన్ నంబర్, టార్పాలిన్ పట్టాలు, పాడి క్లీనర్లు, డ్రైయర్లు, ట్యాబ్ లాంటి మౌళిక వసతులు కల్పించాలని తెలిపారు. ఐకెపి, పిఏసిఎస్, మార్కెటింగ్, మెప్మా శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు చేసి విజయవంతం చేయాలని, కలెక్టరేట్‌లో కంట్రోల్ మానిటరింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసి రైతుల నుండి ఫిర్యాదు అందగానే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ కె సీతారామారావు మాట్లాడుతూ రైతులకు, మిల్లర్ల ధర కంటే ఎక్కువ మద్ధతు ధర కల్పిస్తుందని గ్రేడ్ ఏ ధాన్యం రకానికి రూ.2,389, కామన్ రకానికి చెందిన ధాన్యానికి రూ.2,369, మద్ధతు ధర ఇస్తుందని అలాగే సన్న రకం వడ్లకు మద్ధతు ధరకు అదనంగా రూ.500 బోనస్ కల్పిస్తుంది కాబట్టి రైతులు నష్టపోకుండా అన్ని ఏర్పాట్లను కొనుగోలు కేంద్రాలలో ఏర్పాటు చేయాలని ఆకస్మిక వర్షాలు కురుస్తున్నందున ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్ పట్టాలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఏ పిడి అప్పారావు, డిఎస్‌ఓ మోహన్‌బాబు, డిఎం రాము, డిసిఓ పద్మ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ హనుమంతరెడ్డి, రవాణా అధికారి జయప్రకాష్ రెడ్డి, ఐకెపి, పిఏసిఎస్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామ పాలన అధికారులు రెవెన్యూ వ్యవస్థను పటిష్ట పరచాలి

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



ప్రజాపక్షం/యాదాద్రి : గ్రామ స్థాయిలో గ్రామ పాలన అధికారులు రెవిన్యూ వ్యవస్థను పటిష్టపరచాలని, నిజాయితీగా, నిబద్ధతతో పారదర్శకంగా పనిచేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో కొత్తగా నియామకం పొందిన గ్రామ పాలన అధికారుల శిక్షణ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీపై నమ్మకంతో పరిపాలన అధికారులుగా తిరిగి పోస్టింగ్ ఇవ్వడం జరిగిందని అన్నారు. గ్రామ పరిపాలన అధికారులు విధుల్లో చేరడం వలన రెవెన్యూ వ్యవస్థకు పునర్జీవం వచ్చిందని అన్నారు. రెవెన్యూ వ్యవస్థలో ఉన్న అన్ని సర్వీసులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిజాయితీగా పారదర్శకంగా పనిచేయాలన్నారు. అన్ని సర్వీసులు ప్రజలకు అందించేవి రెవిన్యూ శాఖ మాత్రమే అన్నారు. ప్రస్తుతం రెవెన్యూ వ్యవస్థలో ఉన్న చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. భూభారతి చట్టం కొత్తగా వచ్చినందున క్షుణ్ణంగా చదివి చట్టంపై అవగాహన కలిగి ఉండాలని, అంచలంచెలుగా న్యాయం జరగాలన్నారు. మనిషి పుట్టినప్పటి నుండి చనిపోయే వరకు సర్టిఫికెట్లను జారీ చేయవలసిన బాధ్యత మీపై ఉందన్నారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ గ్రామ పరిపాలన అధికారులు తమ విధులు బాధ్యతతో ఉండి పనిచేయాలన్నారు. గ్రామ రెవిన్యూ రికార్డులు, లెక్కలను సక్రమంగా సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ భూములు, ఇతర ఆస్తులను అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఎలా ఎదుర్కోవాలో అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామ పాలన అధికారులు గ్రామాలలో కుల, ఆదాయ, నివాస, జన్మస్థల ధ్రువపత్రాలు జారీ చేసే విషయంలో జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారులు, కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, సురేష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృత్తిక, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జగన్మోహన్ ప్రసాద్, గ్రామ పాలన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యత గల ధాన్యాన్ని తీసుకురండి



ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రజాపక్షం/నల్లగొండ(తిప్పర్తి) : ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందేందుకు నాణ్యత ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి రైతులతో కోరారు.బుధవారం ఆమె తిప్పర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.అనంతరం రైతులనుద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో లాగే ఈ సంవత్సరం ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు రైతులు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. తిప్పర్తి ధాన్యం కొనుగోలు కేంద్రానికి గత సంవత్సరం 75000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొన్న చరిత్ర ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకొని రైతులు నాణ్యతతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తేవాలని, దాన్యంలో తేమ ఎక్కువగా లేకుండా , 17 మించకుండా తీసుకురావాలని, చెత్త,చెదారం, తాలు వంటి వాటితో తీసుకురావొద్దని, ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావాలని, ధాన్యం అమ్మిన రైతులకు 72 గంటల్లో చెల్లింపులు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు 2 డ్రయ్యర్లను ఏర్పాటు చేయగా, ఒకటి తిప్పర్తిలో మరొకటి మిర్యాలగూడలో ఏర్పాటు చేయడం జరిగిందని ,రైతులు అధికారుల సూచనలు, సలహాలు పాటించి మద్దతు ధర పొందేలా చూడాలని అన్నారు. డ్రయ్యర్స్ పై రైతులకు అవగాహన కల్పించాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆమె ఆదేశించారు.కర్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్,జిల్లా సహకార అధికారి పత్యా నాయక్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను తెలియజేశారు.ఆర్‌డిఓ వై .అశోక్ రెడ్డి ,డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశం, మార్కెటింగ్ ఎడి ఛాయాదేవి ఉన్నారు.

## సిజెఐపై దాడి అమానుషం

ప్రజాపక్షం/మోటకొండూర్ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పై ధర్మాసనం ముందు న్యాయవాది రాకేష్ కిషోర్ బూట్ విసిరి దాడికి పాల్పడడం అత్యంత హేయమైన చర్య అని అమానుషం అని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ అన్నారు. ఆయన బుధవారం మోటకొండూరు ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గవాయ్ పై దాడి భారత న్యాయ వ్యవస్థను దెబ్బ తీయడం సరైన పద్ధతి కాదని ప్రజాస్వామ్యంను దెబ్బ తీయడమే అన్నారు. రాజ్యాంగ మౌలిక లక్ష్యాలకు విఘాతం కలిగించడం, న్యాయమూర్తులపైన దాడి చేయడం ఏచట్టంలో ఉందని, సుప్రీంకోర్టు న్యాయమూర్తులకే రక్షణ లేకపోతే సామాన్య మానవులకు రక్షణ ఏలా ఉంటుందని ప్రశ్నించారు. న్యాయవాది రాకేష్ కిషోర్ న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌కు బేషరతుగా క్షమాపణ చేప్పాలని సత్యనారాయణ డిమాండ్ చేశారు. రాకేష్ కిషోర్ పై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఎన్నికల నిర్వహణకు సిద్ధం

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మొదటి విడత జడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ రాష్ట్ర ఎన్నికల కమీషనర్‌కు తెలిపారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల కమీషనర్ రాణి కుమిదిని హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు, ఎన్నికల అధికారులతో గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మొదటి విడత జడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లాకు సంబంధించి మొదటి విడతన ఈనెల 9న 11 జడ్‌పిటిసిలు, 112 ఎంపిటిసిలకు సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఇందుకు సంబంధించి ఆర్‌ఓ, ఏఆర్‌ఓలకు శిక్షణ ఇవ్వడం జరిగిందని, పునఃచ్ఛరణ శిక్షణ కూడా పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. నామినేషన్ల ప్రక్రియకు తాము సిద్ధంగా ఉన్నామని, ఎఫ్‌ఎస్‌టి, ఎస్‌ఎస్‌టి బృందాలను నియమించడం జరిగిందని, ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఎన్నికలకు సంబంధించిన రిపోర్టులను ఎప్పటికప్పుడు పంపించడం జరుగుతుందని చెప్పారు. అలాగే నామినేషన్ల స్వీకరణ సందర్భంగా పూర్తి సంసిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కె సీతారామారావు, జడ్‌పి సిఇఓ అప్పారావు, డిపిఓ యాదగిరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఈనెల15లోపు రిజిస్ట్రేషన్

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : వరల్డ్ స్కిల్ కాంపిటీషన్ లో పాల్గొనుటకు ఈనెల15 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ప్రపంచ స్కిల్ కాంపిటీషన్‌లో పాల్గొని యువత తమ నైపుణ్యాని అంతర్జాతీయ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నైపుణ్యం కలిగిన నిరాక్షరాసులు కూడా ఇందులో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, దీనికి 6 నుండి 24సంవత్సరాల వయస్సుల వారు అర్హులని ఈ పోటీలను రాష్ట్రంలో నవంబర్ 2025 లో జోనల్ స్థాయిలో, డిసెంబర్ 2025 లో రాష్ట్రస్థాయి, జనవరి2025 లో ప్రాంతీయ స్థాయి, ఫిబ్రవరి 2025 లో జాతీయ స్థాయి, పోటీలు నిర్వహిస్తారని ఈ అవకాశాన్ని యువత వినియోగించుకోని అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి నంద పద్మ తెలిపారు.

## అడ్డంకులను అవకాశాలుగా మార్చుకోవాలి




ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : విద్యార్థులు తమ జీవితంలో ఎదురైన అడ్డంకులను, సవాళ్లను నూతన అవకాశాలుగా మార్చుకోవాలని విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వర రావు పేర్కొన్నారు. అలా చేసినప్పుడు తమ లక్ష్యాలను సాధించి, జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరగలరని చెప్పారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దేశ్ముఖిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో బుధవారం ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులందరూ తమ పిల్లలను బాగా ప్రోత్సహించినట్లైతే వారు ఆరోగ్యంగా, మానసికంగా, సర్వతోముఖంగా అభివృద్ధి చెందుతారని తెలియజేశారు. విద్యార్థులు కెరీర్లో రాణించడానికి ఆత్మ విశ్వాసం, నమ్మకం, క్రమ శిక్షణ, శ్రద్ధతో తమ చదువులను కొనసాగించాలని ఆయన సూచించారు. తమ యూనివర్సిటీలో ఎన్‌ఈపీ2020ను అనుసరిస్తామని చెప్పారు.ఆయా విభాగాల డీన్లు, డైరెక్టర్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రత, శాంతిభద్రతల రక్షణలో పని చేస్తున్నాం

సూర్యాపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్‌పి కె నరసింహ

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : పోలీసు స్టేషన్ల వార్షిక తనిఖీల్లో భాగంగా సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె నరసింహ బుధవారం 2వ పట్టణ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ముందుగా పోలీసు సిబ్బంది గౌరవ వందనంతో ఎస్‌పికి స్వాగతం తెలిపి పోలీస్ పరేడ్ నిర్వహించారు. పోలీసు స్టేషన్ ప్రాంగణంలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. సిబ్బంది కవాతును, యూనిఫామ్, క్రమశిక్షణ, పోలీసు పరికరాలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకొని విధుల నిర్వహణపై సూచనలు అందించారు. అనంతరం ప్రజలకు అందించే సేవలు, నేరాల నమోదు, పెండింగ్ కేసులు, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ మోసాల తీరు, కేసుల దర్యాప్తు, ప్రకృతి వైపరిత్యాల సమయంలో పోలీసు పని, కేసుల పురోగతి, సిసి కెమెరాల ఏర్పాటు, మహిళల భద్రతకు తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతి భద్రతల రక్షణలో పటిష్టంగా పని చేస్తున్నాం, రౌడీషీటర్లపై నిఘా ఉంచి ప్రతిరోజు వారి కదలికలను తెలుసుకోవడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటున్నట్లు తెలిపారు. ఇతరులపై భౌతి కదాడులకు, దౌర్జన్యాలకు పాల్పడితే అలాంటి వారిపై రౌడీ షీట్స్ నమోదు చేసి పిడి యాక్ట్ పెట్టి జైలుకు పంపడం జరుగుతుందని హెచ్చరించారు. విధుల పట్ల ప్రతి పోలీసు బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో పనిచేస్తున్నారని అన్నారు. పోలీస్ సిబ్బంది ప్రేరణ కలిగిస్తూ, నైతిక విలువలతో కూడిన సేవను ప్రజలకు అందించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదుపై వేగంగా స్పందించడానికి బ్లూకోల్ట్, పెట్రోకార్, డయల్ 100 సిబ్బంది సామర్థ్యంతో పనిచేస్తున్నారన్నారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తూ షీ టీం బృందాలు జిల్లా కేంద్రంలో నిత్యం నిఘాలో ఉన్నాయని చెప్పారు. ఆకతాయి పనులకు పాల్పడుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేయడం కౌన్సిలింగ్ చేయడం చేస్తున్నామన్నారు. రోడ్డు భద్రత చర్యల అదృష్ట నూతన ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని, జిల్లా కేంద్రంలో వాహనాల రద్దీ ప్రజల అవసరాలకు అనుగుణంగా ట్రాఫిక్‌ను పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఎక్కువగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయడానికి నేను సైతం కార్యక్రమం ద్వారా కమ్యూనిటి కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. డిఎస్‌పి ప్రసన్నకుమార్, సిఐ వెంకటయ్య, ఎస్ఐ శివతేజ, మహేందర్‌నాథ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ హరిబాబు, ఆర్‌ఎస్ఐ అశోక్, ఏఎస్ఐ అంజన్‌రెడ్డి, సిసి సందీప్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.





# బాలిక హత్య కేసులో నిందితులు అరెస్ట్

బలహీనంగా ఉన్న బాలికను శారీరకంగా కలవడంతో చనిపోయిందని డిఎస్‌పి వెల్లడి




ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: పట్టణంలోని టుటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని షంషు నగర్‌లో మైనర్ బాలికపై జరిగిన అత్యాచారంతో కూడిన నేర పూరిత హత్య పోక్సో చట్టం కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేయడం జరిగిందని నల్లగొండ డిఎస్‌పి కె. శివరాం రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ1 నేరస్తుడు నల్లగొండ మండలం జికె అన్నారం గ్రామానికి చెందిన గడ్డం కృష్ణ, గత 3 నెలల క్రితం మైనర్ బాలిక గ్రామములో ట్రాక్టర్ డ్రైవరుగా పనిచేయుటకు వెళ్ళి ఆమెతో పరిచయము పెంచుకొని మాయమాటలు చెప్పి, ప్రేమ పేరుతో దగ్గరై, ఇన్స్టాగ్రామ్ ద్వార చాట్ చేసేవాడని తెలిపారు.ఈనెల 7న మైనర్ బాలిక తన గ్రామం నుండి కాలేజీకి ఊరి నుండి ఆటోలో వచ్చిన బాలికను నిందితుడు బైక్ పై వచ్చి, తన బైక్ పై ఎక్కించుకొని వెళ్ళితే ఎవరైనా చూస్తారని తన స్నేహితుడైన ఏ 2 నేరస్తుడు బచ్చలకూరి మధు సహకారముతో కిరాయి రూమ్ దగ్గరకు వెళ్లాడని తెలిపారు. ఏ 1బలహీనంగా ఉన్న మైనర్ బాలికను బలవంతముగా, శారీరకముగా కలవడంతో ఆ సమయములో బాలికకు తీవ్ర రక్త స్రావము అయి ఒక్కసారిగా అపస్మారక స్థితిలోకి వెళ్ళి చనిపోయిందని తనకు తెలిసిన వ్యక్తి కి సమాచారం ఇవ్వగా, అతను పోలీసులకు తెలియపరచడని తరువాత పోలీసు స్టేషన్‌లో తనకు తాను చేసిన నేరం ఒప్పుకొని లొంగిపోయినాడని తెలిపారు. తరువాత ఏ 2 ను కూడ అదుపులోకి తీసుకొని పూర్తి విచారణ చేసి వారి వాహనములు, సెల్ ఫోన్ లు స్వాధీన పర్చుకోని ఇట్టి కేసులో శవ పరీక్ష ను టీమ్ ఆఫ్ డాక్టర్ లచే చేయించి సాకేతిక పరిజ్ఞానం, డాక్టర్‌ల ఒపీనియన్ మేరకు పై ఇద్దరు నేరస్తులను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరచడం జరిగిందని తెలిపారు. టు టౌన్ సిఐ ఎస్. రాఘవ రావు,వన్ టౌన్ సిఐ ఏ. రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ ఎస్ఐ వై. సైదులు సిబ్బందిని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అభినందించారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## సిజెఐపై దాడి హేయం: ఎఐటియుసి

**న్యూఢిల్లీ :** భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ)పై సుప్రీం కోర్టు న్యాయవాది దాడి చేయడం దారుణమని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఇటువంటి హేయమైన చర్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కేవలం సస్పెండ్ చేస్తే సరిపోదని, శాశ్వతంగా డీబార్ చేయాలని డిమాండ్ చేశారు. విషపూరిత, దుర్మార్గమైన చర్య దేశ పరువును మంటగలిపిందని ఆందోళన వ్యక్తంచేశారు. రాజ్యాంగ విలువపై దాడి చేసే అనేక ప్రమాకరమైన ధోరణులకు... హిందూత్వ సిద్ధాంతాలాధారిత మోదీ పాలనలో సామాజికలౌకిక నిర్మాణానికి తూట్లు పొడుస్తుండటానికి ఈ ఘటన అద్దం పట్టిందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, చట్టబద్ధ పాలన మూలాలపైనే నేరుగా దాడి చేయడంతో ఇది సమానమని అమర్‌జిత్ కౌర్ వెల్లడించారు. రాజ్యాంగాన్ని, ప్రతి పౌరుని హక్కులను పరిరక్షించే న్యాయాలయమే సుప్రీం కోర్టు అని వర్ణించారు. సీజేఐ దాడి చేయడమంటే న్యాయ వ్యవస్థపై, న్యాయ పవిత్రతపై దాడి చేయడంతో సమానమన్నారు. దాడి చేసిన న్యాయవాదిని ఉపేక్షించబోరని, సంస్థాగత వైఫల్యంపై తగినవిధంగా చర్యలు తీసుకుంటారని ఎఐటియుసి భావిస్తోందని ప్రకటనలో కౌర్ పేర్కొన్నారు.

## బిహార్‌లో 14వేలకు పైగా శతాధిక ఓటర్లు



**పాట్నా :** బిహార్‌లో 100 ఏళ్లు పైబడిన వారు దాదాపు 14,000 మంది ఓటర్లు ఉన్నారు. ఈ మేరకు ఎన్నికల సంఘం గణాంకాల ద్వారా వెల్లడియింది. అయితే, అత్యంత సీనియర్ సిటిజన్స్ కేటగిరీలో 85 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న ఓటర్ల సంఖ్య ఓటర్ల జాబితా సవరణ తర్వాత గణనీయంగా తగ్గింది. జనవరి 1 నాటికి 85 ఏళ్లు పైబడిన ఓటర్లు 16,07,527 మంది ఉన్నారు. ఈ సంఖ్య ఎస్ఐఆర్ తర్వాత 4,03,985కి పడిపోయింది. అదే విధంగా ఓటర్ల జాబితా సవరణ అనంతరం జనవరి 1 నాటికి మహిళా ఓటర్ల సంఖ్య కూడా 3.72 కోట్ల నుండి 3.49 కోట్లకు తగ్గింది. పురుష ఓటర్ల సంఖ్య 4.07 కోట్ల నుండి 3.92 కోట్లకు తగ్గింది. థర్డ్ జెండర్ కేటగిరీకి చెందిన ఓటర్ల సంఖ్య 2,104 నుండి 1,725కి తగ్గింది. 243 మంది సభ్యులున్న బిహార్ అసెంబ్లీకి ఎన్నికలు నవంబర్ 6, 11 తేదీలలో రెండు దశల్లో జరగనున్నాయి. జిల్లా వారీగా వయస్సు లేదా మరణం కారణంగా తొలగించబడిన ఓటర్ల వివరాలను ఇసి వెల్లడించలేదు. సవరణ ప్రక్రియ ప్రారంభానికి ముందు బిహార్‌లో 7.89 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఈ ప్రక్రియలో 65 లక్షల మంది పేర్లు తొలగించారు. ఆగస్టు 1న ప్రచురించబడిన ముసాయిదా జాబితాలో 7.24 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. తదనంతరం ఫారం 6 దరఖాస్తుల ద్వారా 3.66 లక్షల మంది అనర్హులైన ఓటర్లను తొలగించి 21.53 లక్షల మంది కొత్త ఓటర్లను చేర్చారు. దీంతో తుది సంఖ్య 7.43 కోట్లకు చేరుకుంది.

## దగ్గు సిరప్... తాగిన మరో ఐదుగురి పరిస్థితి విషమం



**భోపాల్ :** మధ్యప్రదేశ్‌లో విషపూరితమైన కోల్డ్రిఫ్ దగ్గు సిరప్ తాగి కనీసం 20 మంది పిల్లలు మరణించిన విషయం తెలిసిందే. అయితే నాగ్‌పూర్‌లో చికిత్స పొందుతున్న మరో ఐదుగురు పిల్లల పరిస్థితి విషమంగా ఉందని అధికారులు నిర్ధారించారు. బాధితుల్లో ఎక్కువ మంది చింద్వారా జిల్లాకు చెందినవారు ఉండగా, ఇద్దరు బేతుల్, ఒకరు పంధుర్నాకు చెందినవారు ఉన్నారు. తమిళనాడులోని కాంచీపురంలో ఉన్న శ్రేసన్ ఫార్మాస్యూటికల్స్ సంస్థ తయారు చేసిన సిరప్ తీసుకున్న తర్వాత పిల్లలకు మూత్రపిండాలు విఫలమైనట్లు సమాచారం. నాగ్‌పూర్‌లో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఐదుగురు పిల్లలలో ఇద్దరు ఎయిమ్స్‌లో, ఇద్దరు ప్రభుత్వ ఆసుపత్రిలో, ఒకరు ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారని ఉప ముఖ్యమంత్రి, ఆరోగ్య మంత్రి రాజేంద్ర శుక్లా తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ప్రాణాలను కాపాడుకోవడానికి తమ వంతు ప్రయత్నం చేస్తునారని అన్నారు. నాగ్‌పూర్ పర్యటన సందర్భంగా బాధిత పిల్లల కుటుంబాలను శుక్లా కలిశారు. కలుషితమైన సిరప్‌ను ఉత్పత్తి చేసిన కంపెనీ యజమానిని అరెస్టు చేయడానికి చింద్వారా నుండి ఒక పోలీసు బృందం కాంచీపురం చేరుకుంది. మధ్యప్రదేశ్ పోలీసులు కూడా ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసి తయారీదారుపై కేసు నమోదు చేశారు. సిరప్‌ను సూచించిన డాక్టర్ ప్రవీణ్ సోనిని అరెస్టు చేశారు. అయితే ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ దిలీప్ భానుశాలి సోనిని సమర్థించారు. ఫార్మాస్యూటికల్ కంపెనీ, నియంత్రణ అధికారుల వ్యవస్థాగత లోపాలు కూడా ఈ విషాదానికి దోహదపడ్డాయని వాదించారు. వాస్తవ దోషులపై తక్షణ చర్య తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు, పరువు నష్టం జరిగిన వైద్యుడికి తగిన పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ, 'దేశంలో ఔషధ నియంత్రణ వ్యవస్థ అసమర్థత ఈ దురదృష్టకర ఘటనను తప్పుగా నిర్వహించడం పట్ల తాము ఆందోళన చెందుతున్నామని ఐఎంఎ తెలిపింది.

## విభేదాలు పరిష్కరించుకోకుంటే చర్యలు : కేంద్రం హెచ్చరిక

న్యూఢిల్లీ : దేశంలోని అతిపెద్ద వ్యాపార సామ్రాజ్యమైన టాటా గ్రూప్‌లో నెలకొన్న అంతర్గత విభేదాలపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. టాటా ట్రస్ట్‌లో నలుగురు ట్రస్టీలు ''సూపర్ బోర్డు''గా వ్యవహరిస్తూ గ్రూప్ స్థిరత్వానికి భంగం కలిగిస్తున్నారన్న వార్తల నేపథ్యంలో, కేంద్రం నేరుగా రంగంలోకి దిగింది. ఎలాంటి పరిస్థితుల్లోనైనా గ్రూప్‌లో స్థిరత్వాన్ని పునరుద్ధరించాలని, అవసరమైతే అందుకు బాధ్యులైన ట్రస్టీలను తొలగించడానికి కూడా వెనుకాడొద్దని టాటా యాజమాన్యానికి సూచించింది. ఈ మేరకు కేంద్ర హెంమంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్... టాటా ట్రస్టుల చైర్మన్ నోయెల్ టాటా, వైస్ చైర్మన్ వేణు శ్రీనివాసన్, టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్‌తో పాటు ట్రస్టీ డారియస్ ఖంబటాతో దాదాపు గంటసేపు సమావేశమయ్యారు. ట్రస్ట్‌లోని అంతర్గత కుమ్ములాటలు హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్ కార్యకలాపాలపై ప్రభావం చూపకూడదని స్పష్టం చేశారు. టాటా గ్రూప్ పరిమాణం, ఆర్థిక వ్యవస్థలో దానికున్న ప్రాధాన్యత దష్ట్యా, ట్రస్ట్‌కు ప్రజా బాధ్యత ఉందని ఈ సందర్భంగా మంత్రులు గుర్తుచేశారు. గతేడాది అక్టోబర్ 9న రతన్ టాటా మరణించిన నాటి నుంచి ట్రస్ట్‌లో విభేదాలు తలెత్తినట్లు సమాచారం. ముఖ్యంగా నలుగురు ట్రస్టీలు డారియస్ ఖంబటా, జహంగీర్ హెచ్‌సీ జహంగీర్, ప్రమిత్ ఝవేరి, మెహ్లీ మిస్త్రీ ఒక వర్గంగా ఏర్పడి చైర్మన్ నోయెల్ టాటా అధికారాన్ని ప్రశ్నిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. టాటా సన్స్ బోర్డు సమావేశ మినిట్స్‌ను సమీక్షించడం, స్వతంత్ర డైరెక్టర్ల నియామకాలను ఆమోదించడం వంటి చర్యలతో వీరు కార్పొరేట్ పాలనా ప్రమాణాలను ఉల్లంఘిస్తున్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

## జుబీన్ గర్గ్ మృతి కేసులో కీలక పరిణామం
### గాయకుడి బంధువు అరెస్టు

**గుహవటి :** అసోంకు చెందిన ప్రముఖ గాయకుడు జుబీన్ గర్గ్ మృతి కేసులో ఆయన బంధువు, అసోం పోలీస్ సర్వీస్ అధికారి సందీపన్ గర్గ్‌ను అరెస్టు చేశారు. జుబీన్ గార్గ్ ఇటీవల సింగపూర్‌లో ప్రమాదవశాత్తు మృతి చెందగా, ఆయన మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ కేసు కీలక మలుపు తిరిగింది. జుబీన్ గర్గ్ మృతి చెందిన సమయంలో సందీపన్ ఆయనతోనే ఉన్నారు. ఈ మృతిపై క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్టుమెంట్ వరుస విచారణలు జరిపిన అనంతరం సందీపన్‌ను అదుపులోకి తీసుకుంది. జుబీన్ గర్గ్ ఇద్దరు వ్యక్తిగత సిబ్బంది బ్యాంకు ఖాతాలను అధికారులు పరిశీలించగా, వారి ఖాతాల్లో దాదాపు రూ. 1 కోటి లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. గర్గ్ మరణంలో వారి ప్రమేయం ఉందా అనే కోణంలో విచారణ చేస్తున్నారు. నార్త్ ఈస్ట్ ఇండియా ఫెస్ట్ కోసం జుబీన్ గత నెలలో సింగపూర్ వెళ్లారు. సెప్టెంబర్ 19న యాట్ పార్టీలో భాగంగా ఈతకు వెళ్లి ప్రాణాలు కోల్పోయాడు. జుబీన్ సింగపూర్ వెళ్లినప్పుడు సందీపన్ ఆయన వెంటే ఉన్నారని, యాట్ పార్టీలో కూడా పాల్గొన్నారని, జుబీన్ మృతి తర్వాత ఆయనకు సంబంధించిన కొన్ని వస్తువులను కూడా స్వదేశానికి తీసుకువచ్చాడని పోలీసులు వెల్లడించారు. సందీపన్‌ను ఐదు రోజుల పాటు విచారించిన అనంతరం అదుపులోకి తీసుకున్నట్లు అసోం సిఐడి స్పెషల్ డిజిపి మున్నా గుప్తా తెలిపారు. సందీపన్ అసోం పోలీసు విభాగంలో డిఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటి వరకు ఐదుగురిని అరెస్టు చేశారు. జుబీన్‌కు సమీపంలో గోస్వామి ఈత కొడుతుండగా, మహంత వీడియో తీశాడు.


## ప్రపంచంలోనే అతిపెద్ద దేశీయ విమానయాన మార్కెట్‌లో...
# భారత్‌కు 3వ స్థానం

### ప్రధానమంత్రి మోదీ వెల్లడి
### నవీ ముంబయిలో అంతర్జాతీయ విమానాశ్రయం, ముంబయి మెట్రో ఆక్వాలైన్ మొదటి దశ ప్రారంభం



**నవీ ముంబయి :** ముంబయి నగరంలో కేంద్ర ప్రభుత్వం తోడ్పాటుతో నేడు అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఆయన బుధవారం దేశ ఆర్థిక రాజధాని నవీ ముంబయిలో అంతర్జాతీయ విమానాశ్రయం, ముంబయి మెట్రో యొక్క ఆక్వాలైన్ మొదటి దశను ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ప్రసంగిస్తూ తామర పువ్వు ఆకారంలో ఉన్న నవీముంబయి అంతర్జాతీయ విమానాశ్రయం వీక్షిత్ భారత్‌ను ప్రతిబింబిస్తుందని మోదీ పేర్కొన్నారు. 'ఈ విమానాశ్రయం శివాజీ మహారాజ్ భూమిపై ఉంది. ఇది ఒక సామూహిక సంస్కృతి, శ్రేయస్సు. ఈ విమానాశ్రయం కారణంగా రైతులు, మత్స్యకారులు ఇప్పుడు మార్కెట్లను పొందవచ్చు' అని ప్రధాని మోదీ అన్నారు. 2014లో తాను పదవీ బాధ్యతలు స్వీకరించినప్పుడు దేశంలో కేవలం 74విమానాశ్రయాలు మాత్రమే ఉండేవని, కానీ నేడు ఆ సంఖ్య 160కి పైగానే చేరిందన్నారు. ప్రపంచంలోనే భారతదేశానికి మూడవ అతిపెద్ద దేశీయ విమానయాన మార్కెట్‌గా గొప్ప స్థానం దక్కిందని కొత్త విమానాల ఆర్డర్‌లతో, మరికొందరు పైలట్లకు అవకాశాలు, క్యాబిన్ క్రూ, గ్రౌండ్ వర్కర్లు, మరమ్మతుల నిర్వహణకు మరిన్ని అవకాశాలు పెరిగాయని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. 'ముంబయి వన్ యాప్ లాంచ్' కారణంగా కొత్త అంతర్జాతీయ విమానాశ్రయం, భూగర్భ మెట్రో కారిడార్‌తో ముంబయి మహానగరం ఆసియాలోనే అతిపెద్ద కనెక్టివిటీ హబ్‌గా మారుతుందన్నారు. స్థానిక రాజకీయ ప్రముఖుడు, రైతు కార్మికుల పార్టీ (పిడబ్ల్యుపి) నాయకుడు దివంగత డి.బి.పాటిల్ చేసిన కృషిని ఈ సందర్భంగా ప్రధాని మోదీ గుర్తుచేసుకున్నారు. ఆయన రైతుల సంక్షేమం కోసం కృషిచేశారు. నవీ ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టనున్నారు. డి.బి.పాటిల్ 'సమాజానికి ఒక ప్రేరణ' అని ప్రధానమంత్రి మోదీ అభివర్ణించారు. అనంతరం ఉగ్రవాదం విషయంలో కాంగ్రెస్ అనుసరిస్తున్న వైఖరిని ప్రధానమంత్రి మోదీ తూర్పారబట్టారు. పాకిస్థాన్‌తో సంబంధం కలిగి ఉన్న 26/11 ముంబయి ఉగ్రదాడుల తర్వాత కాంగ్రెస్ పార్టీని ఎవరు నిరోధించారో దేశానికి చెప్పాలని ప్రధానమంత్రి మోదీ గట్టిగా నిలదీశారు. ఉగ్రవాదంపై పోరాటాన్ని కాంగ్రెస్ పార్టీనే బలహీనపరుస్తోందని ప్రధాని ఆరోపించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వం (200414) ఉగ్రవాదంపై పోరాటాన్ని బలహీనపరిచిన కారణంగా దేశం భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వచ్చిందని మండిపడ్డారు. 2008లో ముంబయి ఉగ్రదాడుల తర్వాత ఒక దేశం భారతదేశం చర్యలను నిరోధించిందని అప్పుడు కేంద్ర హోం మంత్రిగా ఉన్నటువంటి కాంగ్రెస్ ముఖ్య నాయకుడు ఒకరు చెప్పారని ఈ విషయమై కాంగ్రెస్ పార్టీ తప్పకుండా స్పష్టంచేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నవీముంబయిలో భారీ బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగించారు. 2008లో ఉగ్రవాదులు ముంబయిని లక్ష్యంగా చేసుకుని నిర్వహించిన తీవ్రమైన ఉగ్రదాడుల కారణంగా శక్తివంతంగా ఉన్న ముంబయి మహానగర భవిష్యత్తు దుర్బలంగా మారిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నొక్కిచెప్పారు. అప్పుడు కేంద్ర మంత్రిగా ఉన్న కాంగ్రెస్ ముఖ్యనాయకుడు మాట్లాడుతూ ఉగ్రవాదులు పాకిస్థాన్‌పై దాడి చేసినందుకు యుపిఎ ప్రభుత్వం ఒత్తిడికి గురైందన్నారు. మన రక్షణ దళాలు ఈ దాడిని తిప్పికొట్టేందుకు మన దేశ ప్రజల ఆలోచనకు అనుగుణంగా మన రక్షణ దళాలు పొరుగుదేశమైన పాకిస్థాన్‌పై ప్రతీకార దాడి చేయాల్సి ఉన్నదని, అయితే ఆ విషయమై భారతప్రభుత్వం ఏ మాత్రం స్పందించలేదని గుర్తుచేస్తూ, ఆనాటి కేంద్ర హోం మంత్రి చిదంబరం వ్యాఖ్యలను ప్రధాని మోదీ పరోక్షంగా ప్రస్తావించారు. 2008 నవంబరులో పాకిస్థాన్ నుంచి భారీగా ఆయుధాలు ధరించి వచ్చిన సాయుధ ఉగ్రవాదులు ముంబయిలో మూడు రోజులపాటు మారణహోమం సృష్టించారు. అమెరికా జాతీయులు సహా 166మంది వారి దాడుల ఘటనలో చనిపోగా,300మందికి పైగా గాయపడ్డారు. మోదీ కాంగ్రెస్ పార్టీపై మరింత పదునైన విమర్శనాస్త్రాలు సంధించారు. యుపిఎ ప్రభుత్వ హయాం నాటి పరిస్థితి నేడు భారతదేశంలో లేదని, దేశంలోకి చొరబడి ఉగ్రదాడులకు పాల్పడ్డ శతృవులకు భారతదేశం గట్టిగా తిరుగు సమాధానం ఇచ్చిందని మోదీ గుర్తుచేశారు. జాతీయ భద్రత విషయంలో తమ ప్రభుత్వం ఎలాంటి రాజీపడబోదని మోదీ అన్నారు.

## మోదీ పాలనలో దళితులకు గౌరవం లేదు : ఖర్గే



**బెంగళూరు :** ఉన్నతస్థానాల్లో ఉండే లేదా సాధారణ దళిత పౌరులకు ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ పరిపాలనలో ఎలాంటి గౌరవం లేదని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై ఒక న్యాయవాది తన కాలి బూటు విసిరేందుకు విఫలయత్నం చేశారు. అవమానకరంగా ప్రవర్తించిన ఇటీవలి ఆ సంఘటనను ప్రస్తావిస్తూ ఖర్గే పైవిధంగా స్పందించారు. ఉత్తరప్రదేశ్ రాయ్‌బరేలీజిల్లాలో వాల్మీకి వర్గానికి చెందిన ఒక వ్యక్తిపై దొంగ అని ముద్రవేసి విచారణలేకుండా గ్రామస్థులు చిత్రవధ చేసిన ఘటనను కూడా ఖర్గే ఖండించారు. ఆ రాష్ట్రంలో దిగజారిపోతున్న శాంతి భద్రతల పరిస్థితికి ఇది ఒక తార్కాణమని విమర్శించారు. జస్టిస్.బి.ఆర్.గవాయ్‌పై కాలి బూటు విసిరి దాడికి యత్నించి మనుస్మృతి,సనాతన ధర్మం పేరుతో సమాజంలో శాంతికి విఘాతం కలిగిస్తూ ప్రజల ప్రాథమిక హక్కులను లాక్కోవాలని కోరుకునే అలాంటి వ్యక్తులను కఠినంగా శిక్షించాలని ఖర్గే డిమాండ్ చేశారు. దీనిని తాను రాజకీయంగా ఉపయోగించుకోవాలని కోరుకోవడంలేదని, సమాజంలో ఈ విధమైన ఆలోచనాదృక్పథం ఉన్న వ్యక్తులను కొన్ని సంస్థలే సృష్టిస్తున్నాయని, ఆ విధమైన మతోన్మాద సిద్ధాంతాలను వ్యాప్తిచేస్తున్నాయని పరోక్షంగా ఆర్ఎస్ఎస్ మత సంస్థలను విమర్శించారు. ఇలాంటి వారు మనుషులను మనుషులుగా చూడటంలేదనీ, మహిళల హక్కులకు లాక్కుంటున్నారని, స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ళు గడచిన తర్వాత కూడా ఈ ఆలోచనావిధానంలో మార్పు రాలేదని అన్నారు. మనుస్మృతి పేరుతో ప్రజల ప్రాథమిక హక్కులను లాక్కోవాలని కోరుకునేవారిని కఠినంగా శిక్షించాలన్నారు. ''న్యాయవాదినని చెప్పుకుంటున్న ఒకవ్యక్తి మతం పేరుతో భారత ప్రధాన న్యాయమూర్తిపై కాలి బూటు విసిరే ప్రయత్నం చేశాడు. వ్యక్తిగతంగాను, పార్టీ తరపునా కూడా నేను ఈ ఘటనను తీవ్రంగా ఖండించాను, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ (కాంగ్రెస్ నాయకులు) కూడా ఈ ఘటనను ఖండించారు. కొంచెం ఆలస్యంగానైనాగానీ ప్రధానమంత్రి కూడా స్పందించి ఖండించారు'' అని ఖర్గే చెప్పారు. బెంగళూరులో బుధవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, మతంపేరుతో సుప్రీంకోర్టు గదిలో భారత ప్రధాన న్యాయమూర్తిని అవమానించేందుకు ప్రయత్నం చేసిన ఆ వ్యక్తిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి, ఎంతో హృదయభారంతో నేను ఈ విషయం చెబుతున్నా, మత ప్రాతిపదికపై జరిగిన ఈ ఘటన తర్వాత న్యాయవాదులు, ప్రభుత్వాలు, రాజకీయ పార్టీల నుండి భారీస్థాయిలో ప్రతిఘటన, ప్రతిస్పందన వ్యక్తం కాలేదు, కానీ కొన్ని ప్రగతిశీల రాష్ట్రాల నుండి మాత్రమే ఈ ఘటనను ఖండిస్తూ ప్రతిస్పందనలు వచ్చాయి, సానుకూల ఆలోచనాదృక్పథంగల న్యాయవాదులు, రాజకీయపార్టీల నాయకులు మాత్రమే సుప్రీంకోర్టులో జరిగిన ఈ ఘటనను ఖండించారు'' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో బాహాటంగా జరిగిన ఈ ఘటనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పెద్దస్థాయిలో ప్రతిఘటన రాలేదన్నారు. ఒక వృద్ధుడైన న్యాయవాది కోర్టు గదిలో భారత ప్రధాన న్యాయమూర్తిపై కాలి బూటు విసిరే ప్రయత్నంచేసిన ఇదొక అసాధారణమైన, దిగ్భ్రాంతి కలిగించే విషయం గడచిన సోమవారం జరిగింది. ఆ తర్వాత ఆ న్యాయవాదిని పోలీసులు తీసుకుపోతున్నప్పుడు ''సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించేదిలేదు....అంటూ పెద్దపెద్దగా కేకలు పెట్టారు.

## ఐదేళ్లలో 146 రోజులు భేటీ
### 78 బిల్లులను ఆమోదించిన 17వ బిహార్ అసెంబ్లీ



**న్యూఢిల్లీ :** పదవీ కాలం ముగిసే ప్రస్తుత బిహార్ శాసనసభ మొత్తం 146 రోజులు సమావేశమైంది. ఇది దాని ఐదేళ్ల పదవీకాలంలో అత్యల్పమని శాసనసభ మేధావి బృందం తెలిపింది. ఈ 17వ అసెంబ్లీ సంవత్సరానికి సగటున 29 రోజులు సమావేశమైంది. సభ సమావేశమైన రోజులలో సగటున మూడు గంటలు కార్యకలాపాలు నిర్వహించింది. 2024లో అన్ని రాష్ట్రాలలో అసెంబ్లీలు సమావేశమైన రోజులలో సగటున ఐదు గంటలు సమావేశమయ్యాయని పిఆర్ఎస్ శాసనసభ విశ్లేషణ చేసింది. కాగా, బిహార్‌లో నవంబర్ 6, 11 తేదీలలో రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 14న ఫలితాలు వెల్లడి కానున్నాయి. అయితే 17వ అసెంబ్లీ 78 బిల్లులను ఆమోదించింది. అన్ని బిల్లులను కూడా వాటిని ప్రవేశపెట్టిన రోజే ఆమోదించారు. తదుపరి చర్చ కోసం ఏ బిల్లును ఏ కమిటీకీ సూచించలేదు. ఈ కాలంలో ఆమోదించబడిన బిల్లులలో ఎక్కువ భాగం విద్య, ఆర్థికం, పన్నులు, పరిపాలనకు సంబంధించినవే ఉన్నాయి. ఈ బిల్లులలో కొన్ని బిహార్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (అన్యాయమైన మార్గాల నివారణ) బిల్లు, 2024, బిహార్ కంట్రోల్ ఆఫ్ క్రైమ్స్ బిల్లు, 2024, ప్లాట్‌ఫామ్ బేస్డ్ గిగ్ వర్కర్స్ (రిజిస్ట్రేషన్, భద్రత, సంక్షేమం) బిల్లు, 2025 ఉన్నాయి. 2023లో ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థలలో రిజర్వేషన్లను పెంచడానికి అసెంబ్లీ రెండు బిల్లులను ఆమోదించింది. అయితే, వీటిని జూన్ 2024లో పాట్నా హైకోర్టు కొట్టివేసింది. వార్షిక బడ్జెట్‌పై సాధారణ చర్చలు కాకుండా, శాసనసభ్యులు పదవీకాలంలో ప్రధాన మంత్రిత్వ శాఖల ఖర్చులను కూడా చర్చించారు. 2020 నుండి ఐదు సంవత్సరాలలో, సగటున తొమ్మిది రోజుల పాటు మంత్రిత్వ శాఖ ఖర్చులను అసెంబ్లీ చర్చించిందని అది తెలిపింది.

## జాతీయ చైతన్యంలో వైమానిక చర్యకు..
# ఆపరేషన్ సిందూర్ సరైన స్థానాన్ని పునరుద్ధరించింది

### ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ వెల్లడి
### హిండన్ ఎయిర్‌బేస్‌లో నిర్వహించిన '93వ ఎయిర్‌ఫోర్స్ డే' కార్యక్రమంలో కీలక ప్రసంగం



**హిండన్ (యుపి) :** ఆపరేషన్ సిందూర్ సమయంలో శత్రు లక్ష్యాలపై భారత వైమానిక దళం (ఐఎఎఫ్) జరిపిన 'ధైర్యం'తో కూడిన 'ఖచ్చితమైన' దాడులు జాతీయ స్పృహలో దాడిచేసే వైమానిక చర్యకు సరైన స్థానాన్ని పునరుద్ధరించాయని వాయుసేన అధిపతి ఎ.పి.సింగ్ అన్నారు. కొన్ని రోజుల్లోనే సైనిక ఫలితాలను రూపొందించడంలో వాయుశక్తిని ఎలా సమర్థవంతంగా ఉపయోగించవచ్చో తన దళం ప్రపంచానికి నిరూపించిందని సింగ్ తెలిపారు. బుధవారం 93వ వైమానికదళ దినోత్సవం సందర్భంగా ఘజియాబాద్‌లోని హిండన్ ఎయిర్ బేస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన వైమానిక సైనికులను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. భారత వైమానికి దళం అక్టోబరు 8, 1932న అధికారికంగా స్థాపించబడింది. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రశంసిస్తూనే, భవిష్యత్తు భద్రతా సవాళ్లకు సిద్ధంగా ఉండాలని వైమానిక యోధులకు పిలుపునిచ్చారు. భారత వైమానిక దళం ప్రణాళిక వినూత్నంగా, ఆచరణాత్మకంగా, అనుకూలతతో ఉండాలన్నారు. దాని శిక్షణ 'మనం పోరాడినట్లుగా శిక్షణ ఇవ్వండి' అనే సూత్రంపై ఆధారపడి ఉండాలని ఎ.పి.సింగ్ నొక్కిచెప్పారు. 'ఆపరేషన్ సిందూర్‌లో మా పనితీరు మాకు వృత్తిపరమైన గర్వాన్ని నింపుతోంది. సైనిక ఫలితాన్ని రూపొందించడంలో వైమానిక శక్తిని ఎలా సమర్థవంతంగా ఉయోగించవచ్చో కొన్ని రోజుల్లోనే ప్రపంచానికి నిరూపించాం' అని సింగ్ పేర్కొన్నారు. ఖచ్చితమైన ప్రణాళిక క్రమశిక్షణతో కూడిన శిక్షణ, దృఢ నిశ్చయంతో కూడిన అమలు ద్వారా ఏమి సాధించవచ్చో ఆపరేషన్ సిందూర్‌ను ఒకప్రకాశవంతమైనఉదాహరణగా వాయుసేనఅధిపతిఎ.పి.సింగ్‌సోదాహరణంగా అభివర్ణించారు.'మాబలమైనవాయురక్షణని ర్మాణం,దీర్ఘశ్రేణి ఉపరితలం నుంచి గగనతల క్షిపణుల వ్యవస్థల దాడి ఉపయోగం ప్రత్యర్థి యొక్క ఆపరేషన్ సామర్థ్యాన్ని పరిమితం చేసిందని, అంతేకాకుండా మా వైమానిక ఆస్తుల భద్రతను కూడా నిర్ధారించింది' అని ఎయిర్ చీఫ్ మార్షల్ చెప్పారు. స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేయబడిన, సమీకృత ఆయుధాదల అత్యుత్తమ పనితీరు, శతృభూభాగంపై ఖచ్చితమైన, విధ్వంసకర దాడులను అందించడం, స్వదేశీ సామర్థ్యంపైన మన విశ్వాసాన్ని రుజువు చేస్తుందని సింగ్ వివరించారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ దాడికి ప్రతిస్పందనగా భారత దేశం మే 7న ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించింది. పాకిస్థాన్ నియంత్రణలో ఉన్న భూభాగాలలోని అనేక ఉగ్రవాద మౌలిక సదుపాయాలను నాశనం చేయడానికి భారత వైమానిక దళం వైమానిక శక్తిని ఉపయోగించింది. ఈదాడులు నాలుగురోజుల పాటు తీవ్ర ఘర్షణలకు దారితీసింది. మే 10న సైనిక చర్య నిలిపివేయడంతో ఇరుదేశాల తీవ్ర ఘర్షణలు ముగింపునకు వచ్చి ఒక అవగాహనకు వచ్చాయి. భారత వైమానిక దళం కార్యచరణ ప్రణాళికలలో కొత్త వ్యవస్థలు, ఆయుధాలు, ఐఎఎఫ్‌కు సంబంధించిన ఆపరేషన్ ప్రణాళికల సామగ్రి భారత్ గణనీయ విజయానికి ప్రాముఖ్యతను ఇచ్చిందని ఆయన ఈ సందర్భంగా వివరించారు.వైమానిక యోధులలో జవాబుదారీతనం, రక్షణ మరియు భద్రత యొక్క పెరిగిన సంస్కృతి ఉందని నేను గమనించగలను. ఇదాఇ మన తగ్గిన సంఘటనలు, ప్రమాదాలలో ప్రత్యక్షంగా ప్రతిబింబిస్తున్నది అని ఎయిర్ చీఫ్ మార్షల్ సింగ్ తెలిపారు.ఎలాంటి ఆకస్మిక పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి ఐఎఎఫ్ సిద్ధంగా ఉండాల్సిన ఆవశ్యకతను వాయుసేన అధిపతి వైమానిక యోధులకు వివరించారు.

## చిన్న, మధ్యతరహా సంస్థలకు రూ.5 కోట్ల వరకు రుణం
### ఎస్‌బిఐ చైర్మన్ చల్లా

**ముంబై:** భారత్‌లోని డిజిటలీకరణ ఫైనాన్షియల్ సెక్టార్ రూపురేఖలనే మార్చివేసిందని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి అన్నారు. దీనివల్ల చిన్న, మధ్యతరహా సంస్థలకు కొన్ని క్షణాల్లోనే రుణం అందుతోందన్నారు. డిజిటల్ వ్యవస్థల కారణంగా కేవలం 2526 నిమిషాల్లో ఎస్ఎంఈలకు రూ.5 కోట్ల వరకు రుణానికి ఆమోదం లభిస్తోందని పేర్కొన్నారు. ఇది గర్వించదగ్గ విషయం అని చెప్పారు. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2025 ఈవెంట్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. డిజిటలీకరణ వల్ల ఇన్సూరెన్స్ వంటి ఆర్థిక ఉత్పత్తుల వినియోగం పెరిగిందని శ్రీనివాసులు శెట్టి పేర్కొన్నారు. యూపీఐ ద్వారా జారీ చేసే రుణాలకు సంబంధించి బ్యాంకులు తమ కలెక్షన్ సామర్థ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఒక్క ఎస్‌బీఐ ద్వారా 15 కోట్ల జన్ ధన్ జీరో బ్యాలెన్స్ ఖాతాలు తెరిచినట్లు చెప్పారు. ఈ ఖాతాలు 56 శాతం మహిళలవే అని పేర్కొన్నారు.

## కరూర్ తొక్కిసలాట ఘటనపై
# సుప్రీంకోర్టుకు విజయ్



**చెన్నై:** టివికె పార్టీ అధినేత విజయ్ బుధవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కరూర్ తొక్కిసలాట ఘటనపై సిట్ దర్యాప్తునకు మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును ఆయన సవాల్ చేశారు. తన పార్టీకి వ్యతిరేకంగా సిట్ పక్షపాత వైఖరిని అవలంబిస్తోందని ఆరోపించారు. కరూర్ తొక్కిసలాట ఘటనపై దర్యాప్తునకు సీనియర్ ఐపిఎస్ అధికారి అస్రాగార్గ్ అధ్వర్యంలో సిట్ ఏర్పాటైంది. పోలీసుల దర్యాప్తు, అధికారుల పాత్రపై తాము ఇదివరకే ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ.. రాష్ట్ర పోలీసు అధికారులతోనే మద్రాస్ హైకోర్టు సిట్‌ను ఏర్పాటుచేసిందని టివికె తన పిటిషన్‌లో పేర్కొంది. తమ పార్టీపై సిట్ పక్షపాతంతో వ్యవహరిస్తోందని విజయ్ ఆరోపించారు. టీవీకే అధ్యక్షుడు విజయ్ కు నాయకత్వ లక్షణాల్లేవని, ఘటన జరిగిన వెంటనే ఆ పార్టీ నేతలందరూ పారిపోయారని వ్యాఖ్యానించిన మద్రాసు హైకోర్టు... కరూర్ ఘటనపై ఆ పార్టీ తీరును తీవ్రంగా ఖండించిన సంగతి తెలిసిందే. తొక్కిసలాట తర్వాత అన్ని పార్టీలూ సహాయక చర్యలు చేపడితే, నిర్వాహకులు వెళ్లిపోయారని తప్పుపట్టిన సంగతి తెలిసిందే. ఈవిషయాన్ని టివికె పార్టీ తన పిటిషన్‌లో ప్రస్తావించింది. ఆ వ్యాఖ్యలు ఇప్పటికే దర్యాప్తును ప్రభావితం చేశాయని పేర్కొంది. తన ర్యాలీలో ఇబ్బందులు సృష్టించేందుకు ముందస్తు కుట్రలను తోసిపుచ్చలేమని పేర్కొంది. టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీ తీవ్ర విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలను కలిసేందుకు తనకు అనుమతివ్వాలంటూ డిజిపికి విజయ్ మెయిల్ పంపారు. విషాదంలో ఉన్న బాధిత కుటుంబాలను స్వయంగా కలిసి పరామర్శించాలని కోరుకుంటున్నట్లు అందులో పేర్కొన్నారు. దీనికి ముందు ఆయన బాధిత కుటుంబాలతో వీడియో కాల్‌లో మాట్లాడారు. త్వరలోనే వారివద్దకు వస్తానని హామీ ఇచ్చారు. కాగా, తొక్కిసలాటలో మృతి చెందిన 13 ఏళ్ల బాలుడి తండ్రి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని కోరారు.

## గ్యాస్ సిలిండర్ల ట్రక్కులు ఢీ...
# భారీ పేలుడు

**జైపూర్ :** రాజస్థాన్‌లో జైపూర్‌అజ్మేర్ జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి రాత్రి ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లను తీసుకెళుతున్న ట్రక్కు మరో ట్రక్కు ఢీకొంది. దీంతో గ్యాస్ సిలిండర్లు పేలి ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. ఈ ఘటనతో సమీపంలోని వాహనాలు సైతం దెబ్బతిన్నాయి. కొన్ని కిలోమీటర్ల మేర పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని సహాయ చర్యలు చేపట్టారు. రహదారిపై భారీ ట్రాఫిక్ జామ్ అయింది. ఈ ఘటనపై రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ ఆదేశాలతో డిప్యూటీ సీఎం ప్రేమ్‌చంద్ బైర్వా ఘటనాస్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. రెండు ట్రక్కుల డ్రైవర్లు, క్లీనర్లు కనిపించడం లేదని ఆయన పేర్కొన్నారు. వారి జాడ కోసం పోలీసులు వెతుకుతున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు.

ప్రజాపక్షం
గురువారం, 09 అక్టోబరు

## ఐదు దశాబ్దాల వెట్టి చాకిరీ!

ఐదు దశాబ్దాలుగా వెట్టిచాకిరీ చేస్తున్న అంగన్వాడీల సమస్యలు ఎవరికీ పట్టడం లేదు. డిమాండ్లను పరిష్కరించాలన్న చిత్తశుద్ధి ఎవరిలోనూ లేదు. దేశ రాజధాని న్యూఢిల్లీ నుంచి, అంగన్‌వాడీ సమాఖ్య సదస్సు వేదికగా వేలాది మంది 'వలంటీర్లు' వెలిబుచ్చిన అభిప్రాయాలు.. పంచుకున్న సమస్యలు కూడా అరణ్య రోదనలే అవుతాయన్నది చేదు నిజం. అంగన్వాడీ సేవలది 50 ఏళ్ల ప్రయాణం.. వారిది గుర్తింపు కోసం అర్ధ శతాబ్దం పోరాటం. దేశవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ (ఐసిడిఎస్)లో అంగన్వాడీలు, హెల్పర్ల సేవలు మొదలై యాభై ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఢిల్లీలో జరిగిన సమావేశం మరోసారి భారతదేశంలోని అంగన్వాడీ సిబ్బంది స్థితిగతులపై దృష్టిని సారించింది. సుదీర్ఘ ప్రయాణం పూర్తి చేసుకున్న ఆనందం కంటే, ఈ నిలకడలేని కొలువులు ఇంకెంతకాలమనే ఆవేదనే అక్కడ అందరిలోనే కనిపించింది. డిమాండ్లను తీర్చాలన్న నినాదాలతో ఆ ప్రాంతం ప్రతిధ్వనించింది. దేశంలో శిశు మరణాల రేటు, పోషకాహార లోపాలు, తల్లి ఆరోగ్య పరిస్థితులు తీవ్రంగా ఉన్న పరిస్థితుల్లో, 1975లో మహిళా శిశు అభివృద్ధి లక్ష్యంగా ప్రారంభమైన ఈ పథకం, తన సుదీర్ఘ ప్రయాణంలో అత్యంత విలువైన సేవలు అందిస్తున్నది. లక్షలాది మంది చిన్నారులు, గర్భిణులకు పోషకాహారం, టీకాలు, ప్రాథమిక విద్య తదితర సేవల్లో కీలక భూమిక పోషిస్తున్నది. కానీ, ఈ అత్యుత్తమ సేవల వెనుక అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల శ్రమకు గుర్తింపు లేదు. దేశ వ్యాప్తంగా దాదాపు 14 లక్షలకుపైగా ఉన్న అంగన్వాడీ సిబ్బందిలో అత్యధిక శాతం మంది గ్రామీణ మహిళలు. వారి కష్టమే ఈ పథకాన్ని నడిపిస్తున్న చోదక శక్తి. అయినప్పటికీ వారి జీతభత్యాలు, పని పరిస్థితులు మాత్రం నిరాశాజనకం. వర్కర్లకు సగటున 10 నుంచి 12 వేల రూపాయలు, హెల్పర్లకు దాదాపుగా అందులో సగం మాత్రమే చెల్లిస్తున్నారు. చాలా రాష్ట్రాల్లో ఈ చెల్లింపులు తరచు ఆలస్యమవుతున్నాయి. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్న అంగన్వాడీల దశాబ్దాల డిమాండ్ పాలకుల చెవికి ఎక్కడం లేదు. వారిది కేవలం వేతన సమస్య కాదని.. గుర్తింపు, భద్రత, గౌరవం మేళవించిన పోరాటంలో భాగమని గ్రహించడం లేదు. 'వలంటీర్' అనే ముద్రవేసి, జీతాలు, వేతనాల బంధాలను తెంపేసుకుంటున్న ప్రభుత్వాలు, పనిభారాన్ని మాత్రం పూర్తిగా వారి భుజాలపై వేస్తున్నాయి. గ్రామీణ ఆరోగ్యం మెరుగుపడిందని గొప్పగా ప్రకటించుకుంటున్నాయి. తమ ఘనతగా ప్రచారం చేసుకుంటున్నాయి. అంగన్వాడీ సమస్యల పరిష్కారం కోసం నిరసనలు, ఉద్యమాలు మొదలైన ప్రతిసారీ కమిటీలు, అధ్యయనాల పేరుతో 'కాలయాపన' నాటకం. బాధితులకు ఒరిగింది ఏమీ లేదు. వారి ఆశలు నెరవేరింది లేదు. ఐసిడిఎస్ అనేది సామాజిక సేవ అంటూ ప్రభుత్వాల పలాయనవాదం. కాబట్టి, అంగన్వాడీలంతా స్వచ్ఛంద కార్యకర్తలని, ఉద్యోగులుగా గుర్తించే అవకాశం లేదంటూ వితండవాదన. అదే నిజమైతే, వారిపై ప్రభుత్వాల పెత్తనం ఏమిటి? వారిపై విపరీతమైన భారం మోపడం ఎందుకు? కొత్త డిజిటల్ యాప్‌లు.. డేటా అప్‌డేట్‌లు.. ఆరోగ్య సర్వేలు... అంటూ ఒత్తిళ్లు ఎందుకు? వాస్తవానికి, ఐసిడిఎస్ పథకం కారణంగా దేశంలో శిశు మరణాల రేటు గణనీయంగా తగ్గింది. పోషకాహార లోపాలు తగ్గుముఖం పట్టాయి. పల్లెల్లో మహిళా విద్య, ఆరోగ్య అవగాహన పెరిగింది. ఈ మార్పులకు ప్రధాన కారణం అంగన్వాడీ వ్యవస్థే అని అందరికీ తెలుసు. కానీ, ఈ వ్యవస్థను నడిపే మహిళలను గౌరవించడం, వారి సమస్యలు తీర్చడం మాత్రం తెలియదు. అంగన్వాడీ వర్కర్లకు కనీసం ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగ హోదా ఇవ్వాలన్న డిమాండ్ సమంజసం. వారి వేతనం కేంద్ర, రాష్ట్ర నిధుల ద్వారా సురక్షితంగా ఉండేలా వ్యవస్థ రూపకల్పన జరగాలన్న సూచన ఆనుసరణీయం. అర్ధ శతాబ్దానికిపైగా 'వలంటీర్లు' పేరుతో మోసగించడం గర్హనీయం... వారి సేవలను అవమానించడం. గౌరవం, భద్రత లేని ఈ కొలువు ఎంత కాలం చేయాలన్న అంగన్వాడీల ప్రశ్నకు ప్రభుత్వాలు సమాధానం ఇచ్చి తీరాలి. సామాజిక అభివృద్ధికి పునాదులు వేయాలన్న ఒక ఆలోచనను తమ విశిష్ట సేవలతో గొప్ప వ్యవస్థగా తీర్చిదిద్దిన అంగన్వాడీలకు న్యాయం జరగాలి. వారి సమస్యలపై ప్రభుత్వాలు మౌనం వీడకపోవడం... కష్టాలను చూడకుండా కళ్లు మూసుకోవడం ఇంకెంతోకాలం సాగదు. అర్ధ శతాబ్దం పాటు అట్టడుగు స్థాయిలో పనిచేసిన మహిళల వేదన, గౌరవ పోరాటాలు ఆగవు. వారికి ఉద్యోగ హోదా ఇవ్వనప్పుడు, సేవా దశాబ్దాలు... అర్ధ శతాబ్దాలు జరుపుకోవడంలో అర్థం ఉండదు. వారిది నేడు జీవన్మరణ సమస్య. అందుకే, కనీస గౌరవం కోసం.. ఉద్యోగ భద్రత కోసం పోరాటం సన్నాహాలు. అంగన్వాడీలు విధులు బహిష్కరించి, ఉద్యమబాట పట్టకముందే ప్రభుత్వాలు మేల్కోవాలి. వారి సేవలు గుర్తించాలి. న్యాయమైన డిమాండ్లు తీర్చాలి.

# గాజాపై ట్రంప్ 20 అంశాల శాంతి మంత్రం

*గాజాలో యుద్ధం పరిసమాప్తి, శాంతిస్థాపన, రెండు సంవత్సరాలుగా సాగుతున్న ఇజ్రాయెల్ విధ్వంసకాండలో సర్వనాశనమైన గాజా ప్రాంతం పునరాభివృద్ధి, టెర్రరిజానికి తావులేకుండా ఇరుగుపొరుగు దేశాల మధ్య శాంతియుత సహజీవనం నెలకొల్పటం ధ్యేయ- మంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ జె.ట్రంప్ తమ పశ్చిమ మిత్రులతో, అరబ్ మిత్రులతో చర్చించి ప్రక- టించిన సెప్టెంబర్ 27న 20 అంశాల కార్యక్రమం ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తి రేపింది. ప్రపంచ రాజధానుల్లో పాలస్తీనియన్‌లపట్ల సంఘీభావ ప్రదర్శన పెరుగుతూ ఉండటం, మూడు – నాలుగు జి.7 దేశాలు సహ దాదాపు 150 దేశాలు పాలస్తీనా అథారిటీని గుర్తించిన నేపథ్యంలో ట్రంప్ ఈ చొరవ తీసుకున్నారు. నోబెల్ శాంతి బహుమతి పొందేందుకు ఆయన తాపత్రయం సైతం తొందరపెట్టి ఉండవచ్చు. ట్రంప్ ప్రతిపాదనల్లోని తొలిభాగం – శాశ్వత కాల్పుల విరమణ, బందీలు–ఖైదీల విడుదలపై ప్రస్తుతం కైరో (ఈజిప్టు)లో చర్చలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ ప్రాముఖ్యత గల ట్రంప్ 20 ప్రతిపాదనల పథకాన్ని ఇక్కడ ఇస్తున్నాం. – సం॥)*






1. గాజా డీరాడికలైజ్ చేయబడుతుంది; టెర్రర్‌కు స్థానంలేని మండలం అవుతుంది. అది తన పొరుగు దేశాలకు ముప్పు కలిగించజాలదు.
2. మీదు మిక్కిలి బాధలనుభవించిన గాజా ప్రజల మేలుకోసం గాజా తిరిగి అభివృద్ధి చేయబడుతుంది.
3. ఈ ప్రతిపాదనను ఇరుపక్షాలు అంగీకరించినట్లయితే యుద్ధం వెంటనే ముగుస్తుంది. బందీల విడుదలకు అనువైన పరిస్థితులు కల్పించేందుకు ఇజ్రాయెల్ సైన్యాలు అంగీకారం కుదిరిన రేఖ వద్దకు ఉపసంహరించుకుంటాయి. ఈ సమయంలో, గగనతలం నుంచి బాంబుదాడులు, ఫిరంగుల ప్రేలుళ్లు సహా మిలటరీ ఆపరేషన్స్ అన్నీ నిలుపు చేయబడతాయి. దశల వారీ సంపూర్ణ ఉపసంహరణ పూర్తిఅయ్యేందుకు నిర్దేశితమైన షరతులు పాటించేవరకు పోరాట మార్గాలు స్తంభించి ఉంటాయి.
4. ఈ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ బహిరంగంగా ఆమోదించిన 72 గంటల లోపు బందీలందరూ – సజీవులు, మృతులు – తిరిగి పంపబడతారు.
5. బందీలందరి విడుదల పూర్తయినాక, 2023 అక్టోబర్ 7 తర్వాత ఇజ్రాయెల్ జీవిత ఖైదు విధించిన 250మంది ఖైదీలు, నిర్బంధించిన 1700మంది గాజన్‌లను – ఈ సందర్భంగా డిటైన్ చేయబడిన మహిళలు, బాలలు సహా – ఇజ్రాయెల్ విడుదల చేస్తుంది. విడుదల చేసే ప్రతిఒక్క ఇజ్రాయెలీ బందీ అవశేషాలకు, చనిపోయిన 15మంది గాజన్‌ల అవశేషాలను ఇజ్రాయెల్ విడుదల చేస్తుంది.
6. బందీలందరూ తిరిగి వచ్చాక, శాంతియుత సహజీవనానికి, తమ ఆయుధాలు విసర్జించేందుకు అంగీకరించిన హమస్ సభ్యులకు క్షమాదానం ప్రకటించబడుతుంది. గాజా విడిచి వెళ్లదలుచుకున్న హమస్ సభ్యులకు వారిని స్వీకరించే దేశాలకు వెళ్లటానికి సురక్షిత ప్రయాణం ఏర్పాటు చేయబడుతుంది.
7. ఈ ఒప్పందాన్ని అంగీకరించిన మీదట, గాజా స్ట్రిప్‌కు సంపూర్ణ సహాయం వెంటనే పంపబడుతుంది. మానవతా సహాయానికి సంబంధించి 2025 జనవరి 19 ఒప్పందంలో చేర్చబడిన మేరకు కనీస సహాయ పరిమాణాలు ఉంటాయి. పునరావాస మౌలిక వసతులు (నీరు, విద్యుచ్ఛక్తి, పారిశుద్ధ్యం), ఆసుపత్రులు, బేకరీల పునరుద్ధరణ, శిథిలాలు తొలగింపునకు, రహదారులు ప్రయాణ యోగ్యం చేసేందుకు అవసరమైన యంత్ర సామాగ్రి పంపటం ఆ మానవతా సహాయంలో ఉంటాయి.
8. గాజా స్ట్రిప్‌లోకి సహాయం ప్రవేశం, పంపిణీ రెండుపక్షాల జోక్యం లేకుండా ఐక్యరాజ్యసమితి, దాని ఏజన్సీల ద్వారా, రెడ్ క్రెసెంట్ ద్వారా జరుగుతుంది. వైరిపక్షాల్లో దేనితోనూ ఏవిధంగానూ సంబంధంలేని ఇతర అంతర్జాతీయ సంస్థలు కూడా అనుమతించబడతాయి. ఇరువైపులా రఫా క్రాసింగ్ తెరవటం కూడా 2025 జనవరి 19 ఒప్పందం కింద అమలుచేసే ఏర్పాట్ల ప్రకారం జరుగుతుంది.
9. గాజాలో తాత్కాలిక పరివర్తనా కాల పరిపాలన టెక్నోక్రాటిక్, రాజకీయ రహిత పాలస్తీనియన్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతుంది. ఈ కమిటీలో అర్హులైన పాలస్తీనియన్ లు, అంతర్జాతీయ నిపుణులు ఉంటారు. ''బోర్డు ఆఫ్ పీస్'' అని పిలిచే ఒక కొత్త అంతర్జాతీయ సంస్థ పరిశీలన, పర్యవేక్షణ కింద ఆ కమిటీ పనిచేస్తుంది. ఆ బోర్డుకు అధ్యక్షుడు డోనాల్డ్ జె.ట్రంప్ చైర్మన్‌గా ఉంటారు. ఆ బోర్డులో బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ సహా ఇతర సభ్యులు, రాజ్యాధినేతలు ఉంటారు. పాలస్తీనా అథారిటీ తన సంస్కరణ కార్యక్రమం పూర్తి చేసేవరకు – అది ఎప్పటికి పూర్తి అయితే అప్పటి వరకు – ఈ సంస్థ గాజా పునరాభివృద్ధి నమూనాను నిర్దేశిస్తుంది, నిధుల సమీకరణ, వ్యయాలను నిర్వహిస్తుంది.
10. మధ్య ప్రాచ్యంలో ఆధునిక అద్భుత నగరాలుగా వర్ధిల్లుతున్న నగరాల నిర్మాణానికి సహాయపడిన నిపుణుల బృందాన్ని సమావేశపరిచి, గాజా పునర్నిర్మాణ ప్రణాళిక రూపకల్పన వారికి అప్పగించబడుతుంది. సదాలోచన పరులైన అంతర్జాతీయ బృందాలు లోతైన ఆలోచనతోకూడిన పలు పెట్టుబడి ప్రతిపాదనలు, అద్భుతమైన అభివృద్ధి ఆలోచనలు రూపొందిస్తున్నాయి. ఈ పెట్టుబడులు ఆకర్షించేందుకు, వాటికి దోహదం చేసేందుకు వీలుగా భద్రత, పరిపాలన చట్రాలు రూపొందించబడతాయి. ఈ పథకాలు ఉపాధులు, అవకాశాలు కల్పిస్తాయి. భవిష్యత్ గాజాకు ఆశారేఖలవుతాయి.
11. ఒక ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటు చేయబడుతుంది. అందులో పాల్గొనే దేశాలతో చర్చలు జరిపి అంగీకారయోగ్యమైన టారిఫ్, యాక్సెస్ రేట్లు నిర్ణయించబడతాయి.
12. గాజా వదిలి వెళ్లిపోవాల్సిందిగా ఎవరిపైనా ఒత్తిడి ఉండదు. వెళ్లదలుచుకున్నవారు వెళ్లవచ్చు, వారికి తిరిగివచ్చే స్వేచ్ఛ ఉంటుంది. ఇక్కడే ఉండండి, గాజా పునర్నిర్మాణానికి తోడ్పడండి అని ప్రజలు ప్రోత్సహించబడతారు.
13. గాజా పరిపాలనలో ప్రత్యక్షంగా, పరోక్షంగా లేదా ఏ రూపంలోనైనా పాత్రను కోరబోమని హమస్, ఇతర గ్రూపులు అంగీకరించాలి. అన్ని మిలటరీ, టెర్రర్, సైనిక దాడి మౌలిక వసతులన్నీ – సొరంగాలు, ఆయుధ తయారీ వసతులు సహా – ధ్వంసం చేయబడతాయి. స్వతంత్ర మానిటర్ల పర్యవేక్షణ కింద గాజా నిస్సైనికీకరణ ఒక క్రమంలో జరుగుతుంది. నూతన గాజా, సౌభాగ్యవంతమైన ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి, తమ ఇరుగుపొరుగుతో శాంతియుత సహజీవనానికి సంపూర్ణంగా కట్టుబడుతుంది.
14. హమస్, ఇతర గ్రూపులు తమ బాధ్యతలకు కట్టుబడి ఉంటాయని, నూతన గాజా తన ఇరుగుపొరుగుకు, తన ప్రజలకు ఎటువంటి ముప్పు కాబోదని ప్రాంతీయ భాగస్వాములు గ్యారంటీ ఇవ్వాలి.
15. గాజాలో తక్షణమే నియోగించే నిమిత్తం ఒక తాత్కాలిక అంతర్జాతీయ స్థిరీకరణ దళాన్ని (ఐఎస్ఎఫ్) అరబ్, అంతర్జాతీయ భాగస్వాములతో కలిసి అభివృద్ధి చేయటానికి అమెరికా కృషి చేస్తుంది. ఈ ఐఎస్ ఎఫ్ గాజాలో వడపోతపోసిన పాలస్తీనియన్ పోలీసు దళాలకు శిక్షణ ఇస్తుంది, తోడ్పాటు ఇస్తుంది. ఈ రంగంలో అపారమైన అనుభవం కలిగిన జోర్డాన్, ఈజిప్టులతో సంప్రదిస్తుంది. దీర్ఘకాలిక అంతర్గత భద్రతకు ఈ బలగం పరిష్కారమవుతుంది. కొత్తగా శిక్షణ పొందిన పాలస్తీనియన్ పోలీసు బలగంతోపాటు ఐఎస్ఎఫ్ సరిహద్దు ప్రాంతాల రక్షణకు ఇజ్రాయెల్, ఈజిప్టులతో కలిసి పనిచేస్తుంది. గాజాలోకి మందుగుండు సామాగ్రి ప్రవేశించకుండా నిరోధించటం, గాజా పునర్నిర్మాణం, పునరుజ్జీవంకోసం సామాగ్రి సత్వరంగా, భద్రంగా గాజాలో ప్రవేశించటం ఎంతైనా అవసరం. ఒక సంఘర్షణ రహిత మెకానిజాన్ని సంబంధిత పక్షాలు అంగీకరించటం అవసరం.
16. ఇజ్రాయెల్ గాజాను ఆక్రమించదు, తనలో కలుపుకోదు. ఐఎస్ఎఫ్ గాజాలో నియంత్రణను స్థిరపరచి, స్థిరత్వం సాధించిన తదుపరి ఇజ్రాయెల్ రక్షణ దళాలు ఐడిఎఫ్) – ఐడిఎఫ్, ఐఎస్ఎఫ్, గ్యారంటీదారులు, అమెరికా నిస్సైనికీకరణ విషయంలో అంగీకరించే ప్రమాణాలు, లక్ష్యసాధనలు, కాలావధుల ప్రాతిపదికపై – ఉపసంహరించుకుంటాయి. సురక్షితమైన గాజా ఇంకెంతమాత్రమూ ఇజ్రాయెల్, ఈజిప్టులకు, లేదా తన పౌరులకు ముప్పుకాదన్న భరోసా ఈ క్రమం ధ్యేయం. ఐడిఎఫ్ గాజానుండి పూర్తిగా ఉపసంహరించుకునేంత వరకు తాత్కాలిక పాలనా అథారిటీతో ఉండే ఒప్పందం ప్రకారం, తన ఆక్రమణలోని గాజా భూభాగాన్ని క్రమానుగతంగా (అంచెలంచెలుగా) ఐఎస్ఎఫ్‌కు అప్పగిస్తుంది. అయితే టెర్రరిజం ప్రమాదం తిరిగి తలెత్తకుండా గాజా సురక్షితం అయ్యేంతవరకు ఐడిఎఫ్ భద్రత ఉనికి కొనసాగుతుంది.
17. ఈ ప్రతిపాదన ఆమోదించటాన్ని లేదా తిరస్కరించటాన్ని హమస్ జాప్యం చేసిన పక్షంలో, సహాయం పెంపుజేసే కార్యకలాపాలు సహా పైన పేర్కొన్న పనులు టెర్రర్ రహిత ప్రాంతాల్లో కొనసాగుతాయి; ఐడిఎఫ్ నుంచి ఐఎస్ఎఫ్‌కు అప్పగించబడతాయి.
18. పాలస్తీనియన్‌లు, ఇజ్రాయెలీల మానసిక స్థితిలో, ఒండొరుల కథనాల్లో మార్పు తెచ్చే నిమిత్తం సహిష్ణుత, శాంతియుత సహజీవనం ప్రాతిపదికపై అంతర్ విశ్వాస సంభాషణ క్రమం ఏర్పాటు చేయబడుతుంది. శాంతి నుండి వనగూరే మేళ్లు వక్కాణించి చెప్పబడతాయి.
19. గాజా పునరాభివృద్ధి పురోగమిస్తుండగా, పాలస్తీనియన్ అథారిటీ సంస్కరణ కార్యక్రమం విశ్వసనీయతతో అమలు జరుగుతుండగా పాలస్తీనియన్ స్వయం నిర్ణయాధికారం, రాజ్య ప్రతిపత్తికి విశ్వసనీయమైన మార్గం అంతిమంగా ఏర్పడవచ్చు. పై రెండింటినీ పాలస్తీనియన్ ప్రజల ఆకాంక్షగా మేము గుర్తిస్తున్నాం.
20. శాంతియుతమైన, సౌభాగ్యవంతమైన సహజీవనం కోసం రాజకీయ యవనికపై ఇజ్రాయెల్, పాలస్తీనియన్‌ల మధ్య ఒక సంభాషణను అమెరికా ఏర్పాటు చేస్తుంది.

# మూఢత్వం, ఛాందసం ముసుగులో ఆధునిక మానవుడు



ఎస్.బాబు
టిజిఎస్ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు

ప్రాచీన కాలం నుండి మూఢ నమ్మకాలు బలంగా ఉన్నాయి. శాస్త్రీయంగా నిరూపణ కానివే మూఢ నమ్మకాలు. వీటిని నమ్మేవారిలో గ్రామీణులే కా దు, చదువుకున్నవారు, సంఘ శ్రేష్ఠులు కూడా ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఈ నమ్మకాలు మనిషిలో ఛాందసాన్ని, మూర్ఖత్వాన్ని పెంచుతాయి. మనిషి నియంత్రణ కోల్పోయినప్పుడు లేదా ఒత్తిడి కి లోనయినప్పుడు వీటిపై నమ్మకాలను పెంచుకుంటాడు. సమాజంలో ఆదర్శవంతులుగా ఉండాల్సిన విద్యావేత్తలు, రాజకీయ నాయకులు, మేధావులు, వ్యాపార దిగ్గజాలు అనేకమంది అతీంద్రియ శక్తులు చూపే బాబాలకు, స్వాములకు శిష్యరికం చేస్తున్నారు. మూఢ నమ్మకాలలో బాగా జనంలోకి పాతుకుపోయినది చేతబడి. దీనినే కొన్ని ప్రాంతాలలో బాణామతి, చిల్లంగి అని కూడా అంటారు. తమకు ఇష్టం లేనివారిని హింసించడానికో, చంపడానికో ఇది ప్రయోగిస్తూ ఉంటారు. జంతుబలి కూడా మరో మూఢాచారం. దైవప్రీతి కోసం ఏదో ఒక జీవాన్ని చంపే క్రతువే ఈ జంతుబలి. ఇది హిందూమతంలో గిరిజన సంప్రదాయం. హైందవ జానపదుల ఆచారంగా వస్తోంది. పురాతన వైదిక మతంలో కూడా ఈ ప్రస్తావన ఉంది. అశ్వమేధ యాగంలో గుర్రాన్ని బలిగా ఇస్తారు. అష్టాదశ పురాణాల్లో కూడా జంతుబలుల ప్రస్తావన ఉంది. అనేక దేవాలయాల్లో దేవతలకి జంతుబలులు, మత్తు పానీయాలు, చేపలను సంప్రదాయంగా సమర్పిస్తారు. గుప్త, చాళుక్య, చోళరాజులు కూడా అశ్వమేధ యాగాలు నిర్వహించినవారే. సనాతన సంప్రదాయ వాదులైన హిందువులు కొంతమంది జంతుబలి సంప్రదాయాన్ని ఇప్పటికీ పాటిస్తున్నారు. కలకత్తాలోని కాళీఘాట్ ఆలయంలో ప్రతిరోజు వందలాది జంతువులను బలి ఇస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా జాన్ పహాడ్‌లో కూడా ప్రతి శుక్రవారం కొన్ని వందల జంతువులు బలవుతుంటాయి. కోళ్ళు, మేకలు, పావురాలు, దున్నపోతులు, గుర్రాలు, ఒంటెలు బలి జంతువులుగా ఉన్నాయి. క్షుద్ర దేవతల పూజల్లో నరబలి ఇచ్చిన ఉదంతాలు కూడా ఉన్నాయి.

రాత్రిపూట గోళ్ళు కత్తిరిస్తే దురదృష్టం వస్తుందని నమ్మకం. ఇంటిపై కాకి అరిస్తే చుట్టాలు వస్తున్నారని, అరచేతులు దురద పెడితే డబ్బు వస్తుందని ప్రజలు నమ్ముతారు. నరేంద్ర దభోల్కర్ అనే రచయిత చేతబడిని నిషేధించాలని అన్నందుకు దుండగులు బైకుల మీద వెంటాడి కాల్చి చంపారు. సతీ సహగమనం ఆచారాన్ని రాజా రామ్ మోహన్ రాయ్ రద్దు చేయాలని కోరారు. 1829 లో లార్డు విలియం బెంటిక్ సతీ సహగమన ఆచారాన్ని రద్దు చేశారు. అదొక మూఢాచారమని 1987 లో భారత ప్రభుత్వం సతీ సహగమనం చేయరాదని చట్టం చేసింది. వ్యాపారాలు, వివాహాలు, శుభదినాలు, శుభఘడియలను జ్యోతిష శాస్త్రాన్ని అనుసరించి చేయటం సమాజంలో ప్రబలంగా ఉంది. హస్త సాముద్రికం, జాతకాలు, సంఖ్యా శాస్త్రం, చిలక జోస్యం, రుద్రాక్షలు ధరించటం లాంటివి కూడా ఆచరణలో ఉన్నా యి. భారతదేశంలో ''గాడ్ మేన్'' అనే పదం బాగా వ్యాప్తిలో ఉంది. వారినే బాబాలని, స్వామీజీలని, గురూజీలని పిలుస్తుంటారు. వారిలో కొందరు పాన్ ఇండియా స్థాయిలో ఉన్నారు. మరికొందరు ఇంటర్నేషనల్ లెవల్ నెట్వర్క్ కలిగి ఉన్నారు. వీరికి ప్రచార కర్తలుగా డాక్టర్లు, ఇంజనీర్లు, వ్యాపార దిగ్గజాలు, రాజకీయ నాయకులు పని చేయడం విచారకరం.

''విప్రులెల్ల జేరి వెర్రి కూతలు కూసి
సతీ పతులను కూర్చ సంబరమున
మును ముహూర్తముంచ ముండెట్లు మోసెరా
విశ్వదాభిరామ వినుర వేమ''

వధూవరుల జాతకాలు చూసి శుభదినం అనే ముహూర్తం పెట్టి చేసిన పెళ్ళిళ్ళు ఎందుకు విడాకుల దాకా పోతున్నాయి? ఎందుకు అర్థాంతరంగా చనిపోతున్నారు? అని సమాజాన్ని నిగ్గదీశారు కవి. చనిపోయిన పితరుల ఆత్మల ఆకలి తీర్చటం కోసం వారికి సద్గతి ప్రాప్తించాలని పిండాలను చేసి తర్పణాలను వదలటం మూఢాచారం. ఇక్కడ పెట్టే పిండాలు దశాబ్ద కాలం క్రితం చనిపోయిన వారికి పెడితే అవి కాకులు తింటే వారి ఆకలి తీరడం ఏమిటి? ఈ సాంఘిక మూఢత్వాన్ని యోగి వేమన తూర్పార బట్టారు. ఆయన మాటల్లో చెప్పాలంటే –

''పిండముల చేసి పితరుల తలపోసి
కాకులకు పెట్టు గాడిదలారా!
పెంట తినెడి కాకి పితరుడెట్లాయెరా
విశ్వదాభిరామ వినుర వేమ!''

సుమారు 600 ఏళ్ళ క్రితమే వేమన తన పదునైన పదజాలంతో సమాజాన్ని ప్రశ్నించిన తీరు ఆయనకున్న శాస్త్ర విజ్ఞానానికి నిదర్శనం. ఇదే విషయాన్ని చార్వాకులు, శిక్కు మత గురువైన గురు నానక్ పురోహిత వర్గాన్ని ప్రశ్నించారు. కాని వారి నుండి సమాధానం లేదు. కుజదోషం ఉన్న వ్యక్తిని చెట్టుకో, పుట్టకో, జంతువుకో, నిర్జీవ పదార్థానితోనో పెళ్ళి జరపటం వలన దోష ప్రభావం పోతుందనే మూఢత్వం చాలామంది జనాల్లో ఉంది. ఏడు మిరపకాయలతో కట్టిన నిమ్మకాయలు ఇంటిముందు వేలాడతీస్తే దుష్టశక్తులు దరిచేరవనే నమ్మకం బాగా ఉంది. వాహన పూజ చేసి నిమ్మకాయలు తొక్కిస్తుంటారు. మరి అలాంటి వాహనాలకు ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయి? మంగళవారం వాహనాలు కొనుగోలు చేయరాదని జ్యోతిష శాస్త్రం చెబుతోంది అంటారు. ఇది కూడా మూఢ నమ్మకమే. ప్రస్తుత సమాజంలో తిథి, వార, నక్షత్రాలు చూసుకుని గర్భిణీ స్త్రీలకు సహజ ప్రసవ సమయం కాకపోయినా సిజేరియన్ ఆపరేషన్ చేయించుకుని బిడ్డల్ని కంటున్నారు. దానివల్ల వారు మహర్జాతకులవుతారని, ప్రపంచ ప్రఖ్యాతి పొందుతారని వారి విశ్వాసమైనా అదీ మూఢ నమ్మకమే.

సూర్య చంద్ర గ్రహణాల సమయంలో ఆహారం వండరు, తినరు. దేవాలయాలు మూసివేయటం, దుకాణాలు మూసివేయటం, గర్భిణీ స్త్రీలు బయటకు రావద్దనడం జరుగుతోంది. హేతువాద సంస్థలు ఈ సమయాల్లో పై కార్యాలు చేసి ఏమీ కాలేదని నిరూపించిన సంఘటనలు కోకొల్లలు. ఆశారాం బాపూ తన ఆశ్రమంలో మహిళా భక్తులు, మైనర్ బాలికలను లైంగిక వేధింపులకు గురి చేసినందుకు ఆయనకు జీవిత ఖైదు పడింది. మాజీ ప్రధానమంత్రి పి.వి.నరసింహారావుకు ఆధ్యాత్మిక గురువైన చంద్రస్వామి విదేశీ మారక ద్రవ్య చట్టాన్ని ఉల్లంఘించినందుకు సుప్రీం కోర్టు ఆయనకు 9 కోట్ల జరిమానా విధించింది. స్వాములు చట్టాలను ఉల్లంఘించటమేమిటో? 1995 లో ఢిల్లీలోని గణేశ విగ్రహం పాలు తాగడం ఓ పెద్ద సంచలనం. ఆ దెబ్బతో పాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. భారతీయ శాస్త్రవేత్త దాన్ని భ్రమ అన్నారు. నేషనల్ కౌన్సిలింగ్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎన్.సిఎస్.టి) శాస్త్రవేత్తలు పాలలో ఎరుపు రంగు కలప డం ద్వారా కేశ నాళిక చర్యవల్ల ఇది సంభవిస్తుందని నిరూపించారు.

మన ప్రధానమంత్రి నరేంద్రమోడీ 2014 అక్టోబర్ లో బాంబే లోని ఓ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో మాట్లాడుతూ ''ప్రాచీన భారత దేశంలోనే ప్లాస్టిక్ సర్జరీ అభివృద్ధి చెందింది అనేందుకు ఏనుగు తల కలిగిన హిందూ దేవుడు గణేశుడే సాక్ష్యం'' అన్నారు. ఇది అశాస్త్రీయమైన వాదన. ప్రధానమంత్రి స్థాయి వ్యక్తి మూఢ నమ్మకాలను ప్రచారం చేసే విధంగా మాట్లాడటం అత్యంత బాధాకరం. పశువులైనా, పక్షులైనా, మనుషులైనా శుక్ర శోణితాలు కలిస్తేనే సంతానం లేదా గుడ్లు వస్తాయి. ఇది సైన్స్. ఇదే నిజం కూడా. కాని రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తి (మేధావి వర్గానికి చెందినవారు) ''మగ నెమలి కన్నీళ్ళను ఆడ నెమలి తాగడం వల్ల వాటి సంతానానికి జన్మనిస్తాయి'' అన్నారు.

మేధావి అయిన హైకోర్టు న్యాయమూర్తి మూఢ నమ్మకాన్ని శాస్త్ర నిబద్ధత లేకుండా మాట్లాడటం అత్యంత శోచనీయం. కాని వాస్తవంగా మగ ఆడ నెమళ్ళు సంపర్కంతోనే అవి గుడ్లు పెట్టి వాటి సంతానాన్ని అభివృద్ధి చేసుకుంటాయే తప్ప కన్నీళ్ళ ను మింగి కాదు అనేది శాస్త్ర విజ్ఞానం. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు అద్దంకిలో ఒక వేపచెట్టుకు పాలు కారుతున్నాయని ప్రచారం జరగడంతో ప్రజలు తండోప తండాలుగా ఆ చెట్టు దగ్గరకు వచ్చి పసుపు కుంకుమలతో పూజలు చేయటం మొదలుపెట్టారు. కాని ఇది మూఢ నమ్మకమని వృక్ష శాస్త్రం చెబుతోంది. పెద్ద పెద్ద చెట్లకు కొన్ని సందర్భాలలో వాటి భాగాలలో ఎక్కడో బాక్టీరియా సోకి ఇన్ఫెక్షన్ అవుతుంది. దాని వల్ల కాండ, వేరు భాగాల్లో లేటెక్స్ లాంటి చిక్కటి ద్రవం స్రవిస్తుంది. అది మహిమ కాదు. వృక్ష శాస్త్రం గురించి తెలియని వారు దీన్ని మహిమగా భావించటం వారి అజ్ఞానానికి నిదర్శనం.

ప్రజలలో శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందించటం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత. కాని ఆ ప్రభుత్వాలు ఆ బాధ్యతల నుండి తప్పించుకుని ప్రజలను మూఢాచారాల వైపు, ఛాందస భావాల వైపు నెడుతున్నాయి. రాజ్యాంగం లోని ఆర్టికల్ 51ఎ (హెచ్) కూడా అధునాతన శాస్త్ర విజ్ఞానాన్ని ప్రజలకు అందించాలని చెబుతోంది. కాని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని ఆర్టికల్ ను పక్కన పెట్టి హైస్కూల్ పిల్లల పాఠ్యాంశంలో ముద్రించబడిన డార్విన్ పరిణామ సిద్ధాంతం, పైథాగరస్ సిద్ధాంతం ఛాప్టర్ లను తొలగించింది. ఇది దేనికి నిదర్శనం? ఈ ప్రభుత్వాలు ప్రజలను ఎటువైపు తీసుకెళుతున్నాయి? ప్రతి ఒక్కరు శాస్త్ర విజ్ఞానాన్ని, అధునాతన ఆలోచనలను అందరితో పంచుకుంటే జ్ఞాన పరిధి పెరిగి ఛాందసం, మూఢత్వం కొంతైనా తగ్గి సమాజం వికసిస్తుంది. థింక్ ఓవర్ ఇట్.

# ఉత్తరమా...నీ జాడెక్కడ!

పోస్ట్...పోస్ట్ అనే శబ్దం వింటే చాలు ఏదో తెలియని ఆనందం. ఇంట్లో నుండి ఒక్క ఉదుటున మరీ పోస్ట్‌మెన్ వద్దకు పరుగులు పెట్టేవారు. ఉత్తరాలు, మనీయార్డర్లు వచ్చాయంటే చాలు... హృదయాలు ఉప్పొంగిపోయేవి. ఇంటికి ఎవర్నుంచైనా ఉత్తరం వచ్చిందంటే చాలు కుటుంబ సభ్యులంతా పోటీపడి దాన్ని అందుకునేవారు. నిరక్షరాస్యులు చదువుకున్న వారి దగ్గరికి వెళ్లి ఆ ఉత్తరాన్ని చదివించుకుని వినేవారు. అయితే ఇదంతా గతం. శాస్త్ర సాంకేతిక రంగాల్లో మానవుడు సాధించిన విశేష ప్రగతి మూలంగా అత్యాధునిక సమాచార సాధనాలు అందుబాటులోకి వచ్చాయి.

1969 వ సంవత్సరం అక్టోబర్ ఒకటో తేదీ నుండి నవంబర్ 16వ తేదీ వరకు జపాన్ రాజధాని టోక్యో నగరంలో 16వ యూనివర్సల్ పోస్టల్ యూనియన్ కాంగ్రెస్‌ను నిర్వహించారు. ఇందు లో భాగంగా కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న 150 దేశాల ప్రతినిధులందరూ యూనియన్ ఏర్పాటు దినమైన అక్టోబర్ 9వ తేదీని ప్రపంచ తపాలా దినోత్సవంగా జరుపుకోవాలని తీర్మానించారు. అంతేకాకుండా తపాలా శాఖ ద్వారా ఎప్పటికప్పుడు ప్రారంభిస్తున్న నూతన సేవలను ప్రజలకు అవగాహన కల్పించడానికి, నూతన తపాలా బిల్లలు ఆవిష్కరించడానికి ఈ రోజున ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల ప్రజలు తమ సమాచారాన్ని సౌకర్యవంతంగా పంపుకునే యంత్రాంగాన్ని సృష్టించడమే ఈ దినోత్సవం జరపడం యొక్క ప్రధాన ఉద్దేశ్యం.

మొట్టమొదట 1861లో అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో పోస్ట్ కార్డును ప్రవేశపెట్టారు. తర్వాత అనతికాలంలోనే ఇది అన్ని దేశాలకు విస్తరించింది. మన దేశంలో 1879 జులై 1న పోస్ట్ కార్డ్ ప్రవేశపెట్టారు. అప్పటి నుండి కొన్ని సంవత్సరాలు పోస్ట్ కార్డుకు జనాలకు విడదీయరాని సంబంధం ఏర్పడింది. టెక్నాలజీ రాకతో ప్రస్తుతం ఉత్తరాలకు ప్రాధాన్యం తగ్గిన మాట వాస్తవం నేటికి. విద్యా వ్యాపారరంగాల్లో అక్కడక్కడ ఉత్తరాలు కనిపిస్తున్నాయి.

సమాజంలో వస్తున్న విప్లవాత్మక మార్పులతో ప్రస్తుతం ఉత్తరాలకు ప్రాధాన్యత తగ్గినప్పటికీ ఎప్పటికప్పుడు నూతన టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ తన ఉనికిని చాటుకుంటోంది భారత తపాలా వ్యవస్థ.

పావురాల ద్వారా బట్వాడా నుండి మొదలుకొని స్పీడ్ పోస్ట్, ఈ మెయిల్ ఇలా కొత్త కొత్త విధానాలతో ముందుకు వెళ్తూ ప్రపంచంలోనే తనకంటూ ఒక ప్రత్యేకతను సంపాదించుకుంది. ప్రస్తుతం దేశంలో రైల్వే తర్వాత అంత పెద్ద వ్యవస్థ తపాలా రంగమే.తపాలా వ్యవస్థ మన ప్రభుత్వంలో సమాచార మంత్రిత్వశాఖలోనే భాగమై ఉంది. దీని నియంత్రణ 'తపాలా సర్వీస్ బోర్డు' ఆధీనంలో ఉంటుంది. ప్రస్తుతం మనదేశంలో మొత్తం 23 తపాలా సర్కిల్స్ ఉన్నాయి. ప్రతీ సర్కిల్‌కు ప్రధాన తపాలా జనరల్ అధికారి ఉంటారు. ఇవికాకుండా భారత రక్షణ వ్యవస్థ కోసం ప్రత్యేకమైన సర్కిల్ ఏర్పాటు చేయబడింది. తాజా గణాంకాల ప్రకారం.. దేశంలో 810 హెడ్ పోస్టాఫీసులు, 24,599 సబ్ పోస్టాఫీసులు, 1,31,312 బ్రాంచి పోస్టాఫీసులు, 4,44,266 పోస్టు బాక్సులు ఉన్నాయి. ప్రస్తుతం చూస్తున్న లెక్కల ప్రకారం.. 2017తో పోలిస్తే చాలా వరకూ సంఖ్య తగ్గిందనే చెప్పొచ్చు. వ్యవస్థలో చోటుచేసుకుంటున్న మార్పులు, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా తపాలా వ్యవస్థ వెనుకబడిపోతోంది. అనేక కొత్త సర్వీసులను తపాలా కార్యాలయాలతో అనుసంధానిస్తామని చెబుతున్నారు. తపాలా విభాగాన్ని అన్నివిధాలా పరిపుష్టీకరించాలని సుబ్రమణియన్ కమిటీ ఏనాడో ప్రతిపాదించింది. బ్యాంకింగ్ ఒక్కటే కాదు.. బీమా, ఇకామర్స్ సేవల విస్తరణనూ తపాలాతో ముడిపెట్టాల ని ప్రభుత్వానికి సూచించింది. ఇతర దేశాల పురోగతిని సోదాహరణంగా ఆ సంఘం తేటతెల్లం చేసింది. విస్తృత తపాలా వ్యవస్థ గల భారత్‌లో స్పీడ్‌పోస్టు కేంద్రాల సంఖ్య 200కు చేరడానికే ఎంతో కాలం పట్టింది. ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా నిధుల విడుదల, చెల్లింపు బాధ్యతల్ని చాలాకాలంపాటు తపాలాశాఖ నిర్వహించింది.

మారుతున్న కాలానికి అనుగుణంగా తపాలా శాఖ సైతం కొత్త విధానాలకు శ్రీకారం చుట్టింది. ప్రైవేటు కొరియర్లకు దీటుగా స్పీడ పోస్ట్ తో పాటు ఇతర సర్వీసులను ప్రవేశపెట్టింది. దీంతో పాటు బ్యాంకింగ్ సేవలను విస్తృత పరిచారు. పోస్టల్ శాఖ ద్వారా ఎటిఎం సేవలను అందిస్తున్నారు. మనీ ట్రాన్స్ఫర్ సదుపాయం, ఎలక్ట్రానిక్ మనీయార్డర్, ఇన్‌స్టెంట్ మనీ ట్రాన్స్ఫర్ వంటి తక్షణ డెలివరీ సదుపాయాలను కల్పిస్తున్నారు. ప్రత్యేకంగా కోర్ బ్యాంకింగ్ సేవలను సైతం విస్తృత పరుస్తున్నారు. పోస్టాఫిసుల్లో సైతం బ్యాంకుల మాదిరిగా మనీ డిపాజిట్,విత్ డ్రాయల్ సౌకర్యాలు కల్పిస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం టికెట్ల బుకింగ్‌లు, రైల్వే కౌంటర్లను, ఆధార్ సేవలు, సుకన్య సంవృద్ధి ఖాతా తదితర సౌకర్యాలను పోస్టాఫీసుల్లో ఏర్పాటు చేస్తున్నారు. పోస్టల్ శాఖ ద్వారా అనేక రకాల ఆకర్షణీయమైన భీమా సౌకర్యాలను కల్పిస్తున్నా రు.

**(అక్టోబర్ 9 ప్రపంచ తపాల దినోత్సవం)**

**సుధాకర్ ఎవి**


## పౌష్టికాహారంతోనే పిల్లల ఎదుగుదల

**ప్రజాపక్షం/బెజ్జంకి:** పౌష్టికాహారంతోనే పిల్లల ఎదుగుదలతో పాటు రోగ నిరోధక శక్తిని దోహదపడుతుందని సిడిపివో జయప్రద అన్నారు.బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వారు హాజరై పాల్గొని మాట్లాడారు పోషకాహార ప్రాముఖ్యత,గర్భవతులు,బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలను వివరించారు.అనంతరం పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు కవిత,నాగరాణి,వైద్యాధికారి నసీం మున్నీసా,సులోచన,అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



## ఇవిఎం గోదాం తనిఖీ

కలెక్టర్ బి.సత్యప్రసాద్: **ప్రజాపక్షం/జగిత్యాల:** జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ బి.సత్యప్రసాద్ స్థానిక ధరూర్ క్యాంప్ లో గల ఈవీఎంలను భద్రపరచిన గోదాములను తనిఖీ చేశారు. ప్రతినెల ఈవీఎంలను తనిఖీ చేయడం జరుగుతుందని గోదాంలోని యంత్రాల భద్రత, సీసీ కెమెరాల పనితీరు , సాంకేతికపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించారు. గోదాం వద్ద ఎలాంటి లోపాలు లేకుండా పటిష్టమైన భద్రత ఉండాలని, నిత్యం అప్రమత్తతో పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బిఎస్ లత, జగిత్యాల ఆర్డీవో మధుసూధన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కలెక్టర్ ఏవో హాకీమ్, ఎంఆర్వో రామ్మోహన్ పాల్గొన్నారు.



## ఎన్నికల నిర్వహణకు అందరు సహకరించాలి: కలెక్టర్




**ప్రజాపక్షం/సిద్దిపేట :** జిల్లాలో స్వేచ్ఛగా, నిస్పక్షపాక్షికంగా ఎన్నికల ప్రవర్తన నియమావళికి భంగం కలుగకుండ ఎంపిటిసి,జడ్పిటిసి సర్పంచ్ ఎన్నికలకు విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హైమావతి సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ హైమావతి,సిపి విజయ్‌కుమార్, ఎసిఎల్బి, ఎసి రెవెన్యూ అధికారులతో కలసి క్రిటికల్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది విధులు తదితర అంశాలపై సంబంధిత అధికారులకు దిశ నిర్ధేశం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా స్వేచ్ఛగా, నిస్పక్షికంగా ఎంపిటిసి, జడ్పిటిసి, సర్పంచ్ ఎన్నికలు జరిగేల పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వనరబుల్, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. సెక్టోరల్ అధికారులు పోలింగ్ కేంద్రాలను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసి ఇబ్బందులను గుర్తించి వాటిని నిర్దేశించిన ఫార్మెట్‌లో నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియామవళీకి అనుగుణంగా టీంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారు క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకొని క్షేత్ర స్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఎక్కడ లా అండ్ ఆర్డర్ సమస్యలను తలెత్తకుండ ఎస్‌హెచ్ఓ, తహశీల్దార్, ఎంపిడిఓ, గ్రామ స్థాయి అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులతో మండల, గ్రామ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి పకడ్బందీ నివేదికలు సిద్ధం చేయాలని,అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. క్రిటికల్, సెన్సిటివ్ హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది కొరత లేకుండ ముందుగానే సమీక్షించుకోవాలన్నారు.పోలింగ్ రోజు పోలింగ్ సామాగ్రి, వెబ్ కాస్టింగ్,మైకో అబ్జర్వర్లు, డిస్ట్రిబ్యూటర్లు రిసెప్షన్ సెంటర్ ఏర్పాటు చేయటంతో పాటు స్ట్రాంగ్ రూంలను సిద్ధం చేయాలని ఆదేశించారు.

* సిద్ధిపేట జిల్లాలో మొదటివిడుతలో 15 జడ్పిటిసి, 125 ఎంపిటిసిలు

జిల్లాలో మొదటి విడుతలో 15 జడ్పిటిసి, 125 ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ హైమావతి తెలిపారు. ఇప్పటికే ఆర్ఓ, ఎఆర్ఓలకు శిక్షణ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. గురువారం నామినేషన్ జారీ చేసి నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీగా ఏర్పాటు చేసుకొని సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈసమావేశంలో అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్, ఏసి అబ్దుల్ హామీద్, ఏసిపిలు, ఆర్డీఓలు,సిఈఓ, డిఆర్డిఓ, డిపిఓ తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు: ఎసిపి



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని కరీంనగర్ రూరల్ ఏసిపి విజయ్ కుమార్ అన్నారు. కొత్తపల్లి మండలం చింతకుంట శాంతినగర్ గ్రామంలో పోలీసులు బుధవారం కార్డెన్ అండ్ సెర్చ్ చేపట్టారు. సంఘ విద్రోహక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధృవీకరణ పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా , కొత్తగా కనబడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వివరాలు ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. మత సామరస్యతకు ప్రాధాన్యత ఇచ్చి ప్రశాంత వాతావరణంలో జీవించాలని కోరారు. అనంతరం స్వాధీనం చేసుకున్న ఒక ట్రాక్, 27 ఆటోలు, 77 ద్విచక్రవాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సిఐలు కోటేశ్వర్, నిరంజన్ రెడ్డి, ప్రదీప్, సదన్ కుమార్, సంజీవ్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది తదితరులున్నారు.

## ఎఐవైఎఫ్ నాయకుడి ఫిర్యాదుతో స్పందించిన డిపో మేనేజర్



**ప్రజాపక్షం/శంకరపట్నం:** మండలంలోని రాజాపూర్, కాచాపూర్ గ్రామాలకు టిజి ఆర్టీసీ బస్సు రాకపోవడంతో ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగంధర్, గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో వన్‌డిపో మేనేజర్ విజయ మాధురి స్పందించారు. బుధవారం సదరు బస్సు మార్గాన్ని స్వయంగా తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా వారు కేశవపట్నం బస్టాండ్ ఆవరణలో బస్సు డ్రైవర్‌ను పిలిపించి సదరు మార్గంలో బస్సు సకాలంలో నడుస్తుందో లేదో పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్రామ ప్రజలకు రవాణా ఇబ్బందులు తొలగించే విధంగా వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామస్థలు డిపో మేనేజర్ స్పందనపై సంతోషం వ్యక్తం చేశారు.

## హత్యకు పాల్పడిన నింధితులపై కేసు నమోదు

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** మండలంలోని బస్వాపూర్‌లో పరువు హత్యలో నిందితులైన ముగ్గురిపై కేసు నమోదైందని స్థానిక ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం షాహిన్ బేగం(50) ఇంటిపై దాడి చేసి హత్య చేసిన , ఘటన విధితమే. బుధవారం గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి ఎస్ఐతో కలిసి గ్రామంలో సంఘటన స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. మృతురాలి కుమారుడు అబ్బాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యకు పాల్పడిన అక్కెనపల్లి యాదవరెడ్డి, అతని భార్య నిర్మల, సోదరుడు రాంరెడ్డిపై హత్య నేరం కింద పలు సెక్షన్లలో కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు. కాగా నిందితులు పరారీలో ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/చేర్యాల:** చేర్యాల మండలంలోని ఆకునూరు, ముస్త్యాల గ్రామాలలో ఐకెపి వద్ద కేంద్రం ప్రారంభించారు.ఐకెపి సీసీలు సర్వ గళ్ళ నర్సింలు, దేవయ్యలు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించిన మద్దతు ధర వరి క్వింటాలుకు ఏ గ్రేడ్ 23 89 బి గ్రేడ్ 23 69 రూపాయలు నిర్ణయించిన ప్రకారంగా రైతులు ఐకెపి దాన్ని సెంటర్లలోనే వడ్లను అమ్మాలని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రజిత కార్యదర్శి పద్మ సిఏ సూర్య కల రైతులు, అమాలి సంఘ సభ్యులు, పాల్గొన్నారు.

# సిజెఐపై దాడి రాజ్యాంగంపై దాడీ

### నిదితుడిపై దేశద్రోహం కేసు నమోదు చేయాలి
### సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం డిమాండ్



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** భారత దేశ సర్వోన్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి పాల్పడడం హేయమైన చర్య అని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ గవాయిపై జరిగిన దాడికి నిరసనగా పెద్దపల్లి జిల్లా కేంద్రం లోని బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం దగ్గర భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్ల కార్డులతో నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం మాట్లాడుతూ భారతదేశ సర్వోన్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై జరిగిన దాడిని భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా భావిస్తున్నామని ఇంతటి దుర్మార్గమైన చర్యకు పాల్పడిన వ్యక్తిపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి, ఆర్ఎస్ఎస్, సంగ్ పరివార్ శక్తులు అధికారంలోకి వచ్చిన తర్వాత భారతదేశంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తికే భద్రత లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మతోన్మాద శక్తులు పెట్రేగిపోతున్న వేళ రాజ్యాంగం ప్రమాదంలో పడిందని రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని వారు అన్నారు. సనాతన ధర్మం అంటూ సనాతన వాదులమంటూ భారతదేశంలో అరాచకాలకు ఆర్ఎస్ఎస్ కేర్ ఆఫ్ అడ్రస్‌గా మారిందని దుయ్యబట్టారు. బిజెపి ప్రభుత్వం ప్రధానమంత్రి హోంశాఖ మంత్రి దీనిపై చర్యలు తీసుకున్నట్లయితే భారతదేశ వ్యాపితంగా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని సదానందం హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మార్కపురి సూర్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆరెపల్లి మానస్ కుమార్, రేణిగుంట్ల ప్రీతం, కల్లేపల్లి నవీన్ పార్టీ ప్రజాసంఘాల నాయకులు మాచర్ల అంజి , కల్లేపల్లి శంకర్, కల్లేపల్లి రవి, బొంకూరి ఎల్లయ్య, జోగుల రామస్వామి, సాయి ఆజాద్,తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ లో గత 24 సంవత్సరాలుగా పనిచేస్తున్న రిక్షా ర్యాగ్ పిక్కర్స్, ఇంటింటా చెత్త సేకరించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి ఎం ఏ గౌస్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతకుముందు మున్సిపల్ కార్పొరేషన్ లో 33 డివిజన్లు ఉండేవని, ఇప్పుడు అవి 60 వరకు పెరిగాయని, అప్పుడు 202 మంది కార్మికులు ఇంటింటి చెత్త సేకరణ పని చేసే వారిని, అందులో 70 మందిని ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు గుర్తించి ట్రాక్టర్ల పై పంపిస్తున్నారని, మిగతా 132 మంది ఇంటింటికి చెత్త సేకరణ పనిచేస్తున్నారని, అధికారులు వారిని ఒక్క డివిజన్ నుండి మరో డివిజన్ కు మార్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, 60 డివిజన్లో కేవలం 132 మందితోనే చెత్త సేకరణ పని చేపిస్తున్నారని,వారిపై అదనపు భారం పడి పని ఒత్తిడికి గురవుతున్నారని దీనిపై అధికారులు స్పందించి కార్మికుల సంఖ్యలు పెంచాలని తెలిపారు. అలాగే ఈ 132 మందిని కూడా ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు గుర్తించి వేతనాలు పెంచాలని, అలాగే అధికారుల వేధింపులకు గురి చేయకుండా తగిన ఆదేశాలు జారీ చేయాలని ఇన్చార్జి కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## పటిష్టమైన ప్రణాళికతో స్థానిక సంస్థ ఎన్నికల నిర్వహణ:ఎస్‌పి



**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** స్థానిక సంస్థల ఎలక్షన్‌కు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు ప్రకారం నిబంధనలు పాటిస్తు ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. జగిత్యాల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎన్నికల నియమావళి, ఎన్నికలకు సంబంధించి అధికారులు తీసుకోవాలసిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. ఎన్నికల నియమావళి ప్రవర్తనపై ప్రతి పోలీసు అధికారి అవగాహన పెంచుకొని ఎన్నికలకు సిద్దంగా ఉండాలని జిల్లాలో పోలీంగ్ కేంద్రాలు వాటిలో సమస్యత్మక పోలింగ్‌కేంద్రాలు నార్మల్ పోలింగ కేందారలలో ఎలాంటి సమస్యలు లేకుండా సంబంధిత రెవెన్యూ అధికారులతో కలిసి ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి వాటి స్థితిగతులను భౌగోళిక పరిస్థితుల గురించి తెలుపాలని సూచించారు. ఎన్ఫోర్స్మెంట్ వర్క్ ఐ దృష్టి సారించాలని తెలిపారు. గత ఎన్నికల మయంలో మోడల్ ఓడ్ ఆఫ్ కండక్ట్ కింద కేసులు నమోదు ఆయన వ్యక్తులు ,పాత కక్షలు మనసులో పెట్టుకుని నేరాలు చేసేవారిని నేరస్వభావం కలిగిన వ్యక్తులను పోలీస్ స్టేషన్‌ల వారిగా గుర్తించి బైండోవర్ చేయాలని సూచించారు. ఎన్నికల నియమావళిపై అడిషనల్ కలెక్టర్ రాజాగౌడ్ పోలీసు అధికారులకు అవగాహన కల్పించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ భాగంగా ఈనెల 21 నుంచి తేది నుండి 31 వరకు నిర్వహించే ప్లాగ్ డే కార్యక్రమాలను ప్రతి పోలీస్ స్టేషన్‌లో విధిగా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రాజాగౌడ్, డీఎస్పీలు వెంకటరమణ, వెంకటరమణ, రఘుచందర్, రాములు, ఇన్స్‌పెక్టార్‌లు, ఎస్ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

## చెరువులో మునిగిన 40 ఎకరాల వరి

### న్యాయం చేయాలని తహసీల్దార్‌కు సిపిఐ నాయకులు, రైతులు వినతి



**ప్రజాపక్షం/చేర్యాల:** చేర్యాల మండలంలోని వీరన్నపేట గ్రామంలో సిద్దిరాం భద్రయ్య అనే రైతుకు చెందిన పట్టా భూములు దాదాపు 40 ఎకరాలు వరి పంట వేసి రైతులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వర్షాకాలంలో వేసిన వరి పంట పూర్తికాకముందే వర్షాలతోపాటు పైపు లైన్, నీటి కాలువల ద్వారా గ్రామంలోని మీదు నమ్మ ఏనె చెరువు నిపండంతో పట్టా రైతులకు సంబంధించిన భూములో వేసిన వరి చేను పూర్తిగా నిండా మునిగి చేతికొచ్చిన పంట నేల పాటు కావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఈ విషయపై చేర్యాల మండల సిపిఐ నాయకులు బుధవారం తహసీల్దార్ దిలీప్ నాయక్‌ని కలిసి వినతిపత్రం అందజేసి రైతు కుటుంబాలకు నష్టపరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, మండల నాయకులు గూడెపు సుదర్శన్, సిద్దిరాం, భద్రయ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

**ఎంపీఓ విజయ్ కుమార్‌కు సిపిఐ నాయకులు సన్మానం**

చేర్యాల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కే విజయ్ కుమార్‌ను బుధవారం సిపిఐ నాయకులు శాలువాతో సత్కరించి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా చేర్యాల ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి కృ షి చేస్తున్నారని వారి సేవలను గుర్తించి మండల పంచాయతీ అధికారిగా నియమించినట్లు తెలిపారు.

## బుధవారం బోధనకు ప్రాధాన్యం: కలెక్టర్



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం బోధన కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ విద్యర్థులకు కఠినమైన అంశాలు, పాఠాలు నేర్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ బుధవారం సందర్శించారు. జడ్పిహెచ్ఎస్‌లో బుధవారం బోధనలో భాగంగా పదవ తరగతి విద్యార్థులు నేర్చుకుంటున్న అంశాలను పరిశీలించారు. ఆంగ్లపాఠం నేర్చుకుంటుండగా ప్రతి విద్యార్థితో ఆంగ్ల పాఠాన్ని చదివించారు. పాఠాలు చదవడంలో మెళకువలు నేర్పారు. అన్ని పాఠశాలల్లోని తరగతుల్లో బుధవారం బోధన పకడ్బందీగా అమలు చేయాలని విద్యాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు కఠినమైన సబ్జెక్టులను నేర్చుకునేలా అవకాశం ఉంటుందని అన్నారు. ముఖ్యంగా ఇంగ్లీష్ సమర్దవంతంగా నేర్చుకోవడానికి చక్కటి వేదిక అన్నారు. విద్యార్థులు కష్టతరమైన పాఠం పట్ల బుధవారం బోధనలో దృష్టి పెట్టాలని, శ్రద్ధ అంకితభావంతో నేర్చుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులు, వంటగది, విటమిన్ గార్డెన్ పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. బోజనం చేస్తున్న చిన్నారులతో మాట్లాడి భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లల హాజరు, నమోదు, గర్భిణీ, బాలింతల సంఖ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. పల్లె దవాఖానను సందర్శించి ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు, వైద్య పరీక్షల రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆరోగ్య మహిళ ఉచిత వైద్య సేవల పట్ల గ్రామస్తులందరికీ అవగాహన కల్పించి నూరు శాతం మందికి పరీక్షలు చేయించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ప్రోగ్రాం ఆఫీసర్ సనా, రాజేష్, రవీందర్ తదితరులున్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సకల ఏర్పాట్లు

### అదనపు కలెక్టర్ గడ్డం నగేష్
### గ్రేడ్ ఏ రకానికి రూ.2389
### కామన్ రకానికి రూ.2369



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** వరి ధాన్యం కొనుగోళ్లకు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. ఖరీఫ్ సీజన్(202526) ధాన్యం కొనుగోళ్ల సన్నాహక సమావేశం వివిధ శాఖల అధికారులు, ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా, డీసీఎం ఎస్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా షామియానా, తాగు నీరు, విద్యుత్ వసతి కల్పించాలని, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం వేసే యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ధాన్యం తూకంలో పారదర్శకంగా ఉండాలని, నిర్దేశించిన విధంగా కొనుగోళ్లు చేయాలని స్పష్టం చేశారు. రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకుని కేంద్రాలకు తరలించాలని సూచించారు. అవసరమైన గన్ని బ్యాగులు సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2389, కామన్ రకానికి రూ.2369 నిర్ణయించిదని వెల్లడించారు. ధాన్యం సేకరణలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కీలకమని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలకు కేటాయించిన రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యం తరలించాలని, ట్యాబ్ ఎంట్రీలో రైతుల భూమి సర్వే నంబర్, ఎన్ని ఎకరాల్లో సాగు చేశారు? బ్యాంక్ ఖాతా వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేసి రైతుల బ్యాంకుల ఖాతాల్లో డబ్బులు పడేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైస్ మిల్లర్లు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ ధాన్యం తరలింపు, దించుకోవడంలో ముందస్తుగా వసతులు కల్పించాలని సూచించారు.

**ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రారంభం**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 13 మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం జిల్లా లో ఈ సీజన్లో దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుందని వెల్లడించారు. ధాన్యాన్ని సేకరించేందుకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో 79, ఐకేపీ ఆధ్వర్యంలో 144, వివిధ శాఖల ఆధ్వర్యంలో 12 కేంద్రాలు, మొత్తం 231 ప్రారంభించనున్నట్లు తెలిపారు.

# ధాన్యం కొనుగోళ్లకు రంగం సిద్ధం

### జిల్లాలో 325 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
### 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

**ప్రజాపక్షం/కరీంనగర్:** వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు జిల్లా యంత్రాంగం రంగం సిద్ధం చేసింది. జిల్లా వ్యాప్తంగా 325 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రణాళికలు తయారు చేశారు. ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు కొంత ఆలస్యంగా రావడంతో నాట్లు ఆలస్యమయ్యాయి. అలాగే యూరియా కొరత రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. ఇటీవల ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలు రైతులను కంటి మీద కునుకులేకుండా చేశాయి. అడ్డంకులన్నీ దాటి పంట కోతలకు సిద్ధం కాగా జిల్లా యంత్రంగం ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేసింది. జిల్లాలో వర్షాకాలంలో 2 లక్షల 75 వేల 398 ఎకరాల్లో వరి పంటను సాగు చేయగా అందులో 1 లక్ష 57 వేల 929 ఎకరాల్లో దొడ్డు రకం కాగా 1 లక్ష 17 వేల 469 ఎకరాల్లో సన్న రకాన్ని రైతులు సాగు చేశారు. ఇందుకు గాను పంట దిగుబడి మొత్తం 5 లక్షల 97 వేల 346 మెట్రిక్ టన్నులు వస్తుందని అంచనా వేశారు. ఇందులో సన్నరకం ధాన్యం 2 లక్షల 40 వేల 72 మెట్రిక్ టన్నులు కాగా దొడ్డు రకం 3 లక్షల 57 వేల 274 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. స్థానిక అవసరాలు, సీడ్ తదితరాలు పోనూ 3 లక్షల ఒక వెయ్యి 880 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందులో 1 లక్ష 68 వేల 25 మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం, 1 లక్ష 33 వేల 855 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకు గానూ జిల్లా వ్యాప్తంగా 325 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఐకేపి 101, పీఏసీఎస్ 184, డీసీఎంఎస్ 36,హెచ్ఏసీఏ 4 మొత్తం 325 కొనుగోలు కేంద్రాల ద్వారా ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చేయనున్నారు. ధాన్యం కొనుగోళ్లకు కావలసిన సామాగ్రిని జిల్లా యంత్రాంగం అందుబాటులో ఉంచింది. 52 లక్షల 29 వేల గన్నీ సంచులు, 6948 టార్పాలీన్లు, 16 ప్యాడీ క్లీనర్లు, 498 తూకం వేసే కాంటాలతో పాటు ఇతర సామాగ్రిని అందుబాటులో ఉంచి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే కురుస్తున్న వర్షాల రిత్యా ధాన్యం కొనుగోళ్లను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. సరిపడా గన్నీ సంచులతో పాటు మరిన్నీ టార్పాలీన్లు సమకూర్చవలసిన అవసరముందని రైతులు అంటున్నారు.



**రజనీ కాంత్, జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ.**

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేశాం. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నాం. కొనుగోళ్లకు కావలసిన సామాగ్రిని సమకూర్చాం.. జిల్లాలో రాబోయే వారంలోగా కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి.

## రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఆల్ఫోర్స ఇ టెక్నో స్కూల్ విద్యార్థిని ఎంపిక




**ప్రజాపక్షం/కరీంనగర్:**ఎస్‌జిఎఫ్ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఆల్ఫోర్స్ ఈ టెక్నో స్కూల్ విద్యార్థిని ఎంపికైంది. ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ ఈ టెక్నో స్కూల్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక అభినందన సభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల పట్ల అవకాశాలు కల్పించాలని, వివిధ పోటీలలో పాల్గొనేందుకు పోత్సాహకాలు అందించడం ద్వారా వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయవచ్చని అన్నారు. క్రీడల ప్రాముఖ్యత దృష్టిలో ఉంచుకునివార్షిక ప్రణాళికలో భాగంగా వివిధ రకాల క్రీడల పోటీలు నిర్వహించడమే కాకుండా వారిని వివిధ స్థాయిలో నిర్వహింపబడేటువంటి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో జగిత్యాల జిల్లాలో నిర్వహించినటువంటి ఎస్‌జిఎఫ్ జిల్లా స్థాయితైక్వాండో పోటీలలో పాఠశాలకు చెందినటువంటి బి. సహస్ర (8వ తరగతి) అండర్ 17 విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చడమే కాకుండా త్వరలో మహబూబ్ నగర్ లో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు సైతం ప్రాతినిధ్యం ఇవ్వబోతుందని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన సందర్భంగా విజేతకు పుష్పగుచ్ఛంతో పాటు అర్హత పత్రాన్ని అందజేసి రాష్ట్ర స్థాయిలోనూ విశేషంగా రాణించి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గుండె పరీక్షల శిబిరం ఎంఎల్ఎ అభినందన

**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** గుండె సంబంధిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని జగిత్యాల ఎంఎల్ఎ డా.సంజయ్‌కుమార్ అన్నారు. స్వాయి స్వస్థ వెల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో పుట్టుకతో వచ్చే హృదయ సంబంధ వ్యాధుల నిర్ధారణ శిభిరాన్ని జగిత్యాల జిల్లా కేంద్రంలోని మాత శిశు ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎల్ఏ డాక్టర్ సంజయ్‌కుమార్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. గుండె సంబంధించి సమస్యలను 2డి కో ద్వారా పరీక్షించి చికిత్స అవసరం ఉన్న వారిని సిద్దిపేటలోని శ్రీ సత్యసాయి సాయి సంజీవని ఆసుపత్రిలో చికిత్స అందించనున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ గుండె ఆపరేషన్లు చాలా ఖర్చుతో కూడుకున్నవని పేద ప్రజలు ఆపరేషన్‌లు చేయించుకునేంత స్తోమత ఉండదని అన్నారు. ప్రజలు ఇలాంటి శిభిరాలను అవకాశాలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కొండపాక ఆసుపత్రి నిర్వహణ ప్రతినిధి శర్మ, ఐఎంఏ జగిత్యాల శాఖ అధ్యక్ష కార్యదర్శులు డా.హేమంత్, డా.శ్రీనివాస్‌రెడ్డి, రోటరి క్లబ్ పూర్వ అధ్యక్షులు సిరిసిల్ల శ్రీనివాస్, జగిత్యాల సాయి స్వస్థత వెల్‌నెస్ సెంటర్ ప్రతినిధులు కోటగిరి శ్రీనివాస్, పాల్తెపు భూమేశ్వర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వన్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిది

**ప్రజాపక్షం /కాసిపేట :** వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బి.ప్రవీణ్ నాయక్ అన్నారు. జాతీయ వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకొని వన్యప్రాణుల ఆవశ్యకత, వాటి పరిరక్షణపై బుధవారం ముత్యంపల్లి సెక్షన్ పరిధిలోని ఆశ్రమ హైస్కూల్, మల్కపల్లి విద్యార్థులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది అక్టోబర్ 2 నుంచి 8 వరకు జాతీయ వన్యప్రాణి వారాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ సంవత్సరం వారోత్సవాల ఇతివృత్తం మనిషి, వన్యప్రాణుల సహజీవనమని, మానవులు, వన్యప్రాణుల మధ్య పెరుగుతున్న సంఘర్షణలను తగ్గించి, సహజీవనం వైపు దృష్టి మళ్లించడమే లక్ష్యమని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు హరి నాయక్, శంకర్, బీట్ ఆఫీసర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## చీఫ్ జస్టిస్‌పై దాడి గర్హణీయం

ఎఐటియుసి జిల్లా కార్యదర్శి విలాస్

**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ :** సుప్రీంకోర్ట్ చీఫ్ జస్టిస్‌పై దాడి యత్నం గర్హణీయమని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి విలాస్ బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. కోర్టులో విచారణ జరుగుతున్న సందర్భంలో దాడికి పాల్పడ్డ లాయర్ రాకేష్ కిషోర్ చేసిన వ్యాఖ్యాలు తీవ్రమైనవన్నారు. చీఫ్ జస్టిస్‌పై దాడికి ప్రయత్నించడం సిగ్గుచేటైన విషయమని, ఇది రాజ్యాంగంపై మతోన్మాదుల దాడి అన్నారు. దేశంలో మతోన్మాదం ఎంతవరకు తలకెక్కిందో అన్న దానికి నిదర్శనం ఈ దాడి అన్నారు. దాని ఫలితంమే ఈదాడి అన్నారు. దుష్ట శక్తులే మతోన్మాద భావజాలం వ్యాప్తి చేస్తున్నారని అన్నారు. ఇటువంటి చర్యలు భవిష్యత్తులో జరగకుండా భద్రత కట్టుదిట్టం చేయాలన్నారు. ఇలాంటి సంఘటనను ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు ఖండించాలన్నారు.



## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

డిసిసి అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి



**ప్రజాపక్షం/గజ్వేల్ :** రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని డిసిసి అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని శ్రీగిరిపల్లి గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షులు బాలరాజ్, యూత్ ప్రెసిడెంట్ వెంకట్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో ఆ పార్టీ శ్రేణులు కాంగ్రెస్‌లో చేరగా, నర్సారెడ్డి వారికి కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుండగా, అర్హులైన ప్రతి పేదలకు ఇందిరమ్మ ఇల్లు, రూ.2 లక్షల రుణమాఫీ, సన్న బియ్యం పంపిణీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ వంటి సాహసోపేత నిర్ణయాలతో ముందుకెళ్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పార్టీ పటిష్టతకు కృషిచేసిన నేతలు చిమ్మిరెడ్డి, కుమార్‌లను ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు నరేందర్ రెడ్డి, సర్దార్ ఖాన్, సుఖేందర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

## ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్



**ప్రజాపక్షం/పిట్లం :** పిట్లం మండల కేంద్రంలోని సాయి గార్డెన్‌లో బుధవారం జుక్కల్ నియోజకవర్గస్థాయి బిఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే అధ్యక్షతన వహించగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను గురించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 22 నెలలు గడుస్తున్నా, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో వారు ఇచ్చిన హామీలు అమలు కాని పథకాలను ప్రజలకు వివరించి బిఆర్ఎస్ విజయానికి ప్రతీ కార్యకర్త పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ దఫేదర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల వేళ పటిష్ట చర్యలు

నిర్మల్ ఎస్‌పి జానకి షర్మిల




**ప్రజాపక్షం/దిలావర్పూర్ :** ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా, మండలాల్లోని గ్రామస్థాయిలో ప్రజలతో మంచి సత్సంబంధాలను ఏర్పరచుకొని, ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా తగిన కార్యచరణను రూపొందించి, అమలు చేయాలని జిల్లా ఎస్‌పి డా.జి.జానకి షర్మిల సూచించారు. బుధవారం దిలావర్‌పూర్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్‌పి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ, వాటిని పరిశుభ్రతతో ఉంచుకోవాలని సూచించారు. సిబ్బందితో మాట్లాడుతూ రానున్నది ఎన్నికల సమయం కాబట్టి పూర్తి సంసిద్ధంగా ఉండాలని, గ్రామాలను సందర్శిస్తూ విపిఓ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని, గ్రామాలలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాల పట్ల పూర్తి సమాచారం రాబట్టేలా పటిష్టమైన సమాచార వ్యవస్థను నిర్మాణం చేసుకోవాలని సూచించారు. ఎవరికి కేటాయించిన విధులు వారు సక్రమంగా నిర్వర్తించాలన్నారు.

## రాష్ట్ర స్థాయి నెట్‌బాల్‌కు ఎంపిక



**ప్రజాపక్షం/జన్నారం :** జన్నారం మండలంలోని స్లేట్ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ క్రీడా పోటీలకు మంచిర్యాల జిల్లా తరపున ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన భాను చరణ్, అరవింద్, తేజశ్విన్‌లు అక్టోబర్ 9, 10 తేదీల్లో మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని డిఎస్ఎ క్రీడా మైదానంలో జరగనున్న 7వ రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీల్లో పాల్గొననున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను స్లేట్ విద్యాసంస్థల చైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి, డైరెక్టర్ ఏనుగు రజిత రెడ్డి, ప్రిన్సిపాల్ షిరీన్ ఖాన్, వ్యాయామ ఉపాధ్యాయులు సంతోష్, నాగేష్, జ్యోష్ణతో పాటు ఉపాధ్యాయుల బృందం అభినందనలు తెలియజేశారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

డిసిపి భాస్కర్



**ప్రజాపక్షం/హాజీపూర్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంచిర్యాల డిసిపి ఎ. భాస్కర్ అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండల కేంద్రంలో పర్యటించి నామినేషన్ కేంద్రమైన ఎంపిడిఒ కార్యాలయాన్ని సందర్శించి అనంతరం హాజీపూర్ పోలీస్ స్టేషన్‌లో సమీక్ష సమాశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని అన్నారు. ఎన్నికల విధుల్లో పోలీస్ యంత్రాంగం అనుసరించాల్సిన వ్యూహాలు, అదనపు బలగాల మోహరింపుపై అధికారులకు, సిబ్బందికి స్పష్టమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఎసిపి ఆర్. ప్రకాష్, రూరల్ సిఐ ఆకుల అశోక్, హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్ పాండే, ఎంపిడిఒ బుగ్గారం శ్రీనివాస్, ఎస్ఐ ఎన్.స్వరూప్ రాజ్‌తో పాటు రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఆర్, నిమ్జ్ టిజిఐసి భూసేకరణ వేగవంతం

కలెక్టర్ పి.ప్రావీణ్య





**ప్రజాపక్షం/సంగారెడ్డి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ట్రిపుల్ ఆర్, నిమ్జ్ టిజిఐసి ప్రాజెక్టులకు భూసేకరణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ట్రిపుల్ ఆర్, నిమ్జ్ టిజిఐసి భూసేకరణ పనులపై రెవెన్యూ నేషనల్, హైవే ఆథారటీ పరిశ్రమ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆయా ప్రాజెక్టులు భూసేకరణ వేగవంతంగా చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. భూసేకరణ వేగంగా పూర్తి చేయడమే కాకుండా తక్షణమే రైతులకు ప్రయోజనం అందేలా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. భూ సేకరణకు సంబందించి రైతులకు చెల్లించాల్సిన అవార్డు, ఫైళ్లను వెంటనే ఫైనలైజ్ చేయాలని అధికారులకు ఆదేశించారు. వేరు వేరు దశల్లో ఉన్న పనులను సమగ్రంగా సమీక్షించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులు వేగవంతంగా పూర్తి చేసి రైతులకు చెల్లించాల్సిన పరిహారం సకాలంలో అందించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ చర్యల ద్వారా భూసేకరణ పనులు సమర్థవంతంగా పూర్తి అవ్వడమే కాకుండా రైతులకు తక్షణమే ప్రయోజనం కలిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, సంగారెడ్డి ఆర్‌డిఒ రాజేందర్‌తో పాటు వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

పట్టణంలోని ఐటిఐ సమీపంలో ఉన్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను కలెక్టర్ ప్రావీణ్య ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఏటీసీ సెంటర్లో కొనసాగుతున్న బోధన విధానం, విద్యార్థులకు అందిస్తున్న సాంకేతిక శిక్షణ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాధన కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. సాంకేతిక నైపుణ్యం కలిగిన వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఏటీసీలో అమలవుతున్న కోర్సులు, ఆధునాతనం, మిషనరీలు, అభివృద్ధి పనులపై వివరాలను సంబంధిత అధికారుల నుండి అడిగి తెలుసుకున్నారు. ఏటీసీ ద్వారా అందిస్తున్న శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ సూచించారు.

## రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య

**ప్రజాపక్షం/తాండూర్ :** భూభారతి రెవెన్యూ సదస్సులకు సంబంధించిన వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య అధికారులను ఆదేశించారు. బుధవారం తాండూరు మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి భూభారతి ఫైళ్లను పరిశీలించి, రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల్లో పరిష్కరించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న అర్జీల వివరాలను, క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పురోగతిని తహసీల్దార్, డిప్యూటీ తహసిల్దార్, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సాదా బైనామాల, అసైన్డ్ భూముల పట్టాల కొరకు వచ్చిన దరఖాస్తుల్లో అర్హులైన వారి జాబితాను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ తహసీల్దార్ యు. జోత్స్న, డిప్యూటీ తహసిల్దార్ కల్పన పాల్గొన్నారు.



## త్వరితగతిన భూభారతి దరఖాస్తుల పరిష్కారం





కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన భూభారతి రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం ఆయన జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్‌లోని మండలాల తహసీల్దార్లతో భూభారతి దరఖాస్తుల పరిష్కారంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామసభల్లో అందిన ప్రతి దరఖాస్తును రికార్డులతో సరిచూసి, క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు. పేరు, తండ్రి పేరు, ఇంటి పేరు, విస్తీర్ణం, విరాసత్ పట్టా మార్పిడి, డిజిటల్ సంతకం కొరకు వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. దరఖాస్తుదారులు మోకాపై సాగు చేస్తున్నారా అనే విషయాన్ని రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ధారించుకోవాలని, దరఖాస్తులను పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల వివరాలపై సమీక్షించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్‌కలెక్టర్ శ్రద్ధ శుక్లా, తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### కౌంటింగ్ కేంద్రాలకు ఏర్పాట్లు

2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రంలో రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పకడ్బందీగా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎంపిటిసి, జెడ్‌పిటిసి స్థానాల ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించి స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ గదులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలు రెండు విడతలుగా జరుగుతాయని, ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ కేంద్రాలలో పూర్తి బందోబస్తుతో భద్రపరుస్తామని తెలిపారు. కౌంటింగ్ నిర్వహణ ఏర్పాట్లలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

# రుణపంపిణీ లక్ష్యాలు సాధించాలి

జిల్లాస్థాయి బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** రుణాల పంపిణీలో నిర్దేశిత లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. పంట రుణాల పంపిణీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం జిల్లాస్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ త్రైమాసిక సమావేశం జరిగింది. ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి, వచ్చే సీజన్‌లో రైతాంగానికి అందించాల్సిన పంట రుణాలు, రైస్‌మిల్లర్లకు బ్యాంకు గ్యారెంటీ తదితర అంశాలపై ఆయా బ్యాంకుల వారిగా కలెక్టర్ సమీక్షించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై ఆరా తీశారు. ఈ సమావేశానికి పలువురు బ్యాంకర్లు గైర్హాజరు కావటం పట్ల కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. కీలక సమావేశానికి బ్యాంకర్లు రానప్పుడు సమావేశం నిర్వహించి ప్రయోజనం ఏమిటని సంబంధిత అధికారులను నిలదీశారు. గైర్హజరైన బ్యాంకర్లపై మినిట్స్ బుక్‌లో పొందుపర్చి నిబంధనలకనుగుణంగా చర్యలు తీసుకోవాలని లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్‌ను ఆదేశించారు. ఇకపై జరిగే జిల్లాస్థాయి సంప్రదింపుల కమిటీ సమావేశాలకు అన్ని బ్యాంకులకు చెందిన ప్రతినిధులు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలన్నారు. వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు గాను అర్హత కలిగిన రైస్‌మిల్లర్లకు వెంటాదివెంట బ్యాంకు గ్యారంటీలను మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించారు. కొత్త రైస్‌మిల్లర్లకు కూడా ప్రాపర్టీ మార్ట్‌గేజ్ చేసుకుని బ్యాంకు గ్యారంటీ అందించాలన్నారు. రైతు ప్రయోజనాలతో ముడిపడి ఉన్న అంశమైనందున మిల్లర్లకు బ్యాంకు గ్యారంటీ విషయంలో బ్యాంకర్లు చొరవ చూపాలన్నారు. వ్యవసాయశాఖతో పాటు డీఆర్‌డీఏ, మెప్మా, పశుసంవర్ధక, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర శాఖలతో సమన్వయం చేసుకుని ప్రభుత్వ పథకాల కింద ఎంపికైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలందించి స్వయం ఉపాధికి చేయూతనివ్వాలని హితవు పలికారు. పిఎం స్వనిధి కింద అర్హులైన వారికిరుణాలు అందించాలని స్వయం సహాయక సంఘాలకు పూర్తిస్థాయిలో లింకేజీ రుణాలు పంపిణీ చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, కరోలిన్ చింగ్తియాన్ మావి, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ సునీల్, డీఆర్‌డీఓ సాయగౌడ్, నాబార్డు డీడీఎం ప్రవీన్‌కుమార్, శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

## ఎన్నికల వార్తలపై నిఘా

కలెక్టర్ అభిలాష అభినవ్

**ప్రజాపక్షం/నిర్మల్ :** మీడియా మానిటరింగ్ సర్టిఫికేషన్ కమిటీ(ఎంసిఎంసి)ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని సమాచార శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను ప్రారంభించిన కలెక్టర్, అనంతరం అధికారులతో మాట్లాడుతూ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రతి వార్తపై నిఘా ఉంచాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించేలా వచ్చే వార్తలు లేదా ప్రచారాలు ఏవైనా గమనించిన వెంటనే వాటి వివరాలను సంబంధిత రిజిస్టర్లలో నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో మీడియా పాత్ర ఎంతో ముఖ్యమని, వాస్తవాధారిత వార్తల ప్రచారంతో ప్రజల్లో విశ్వాసం పెంపొందుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం, అపోహలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్‌డిఒ రత్న కళ్యాణి, డిపిఆర్ఒ విష్ణువర్ధన్, డిపిఒ శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజల పక్షాన కొట్లాడేది బిఆర్ఎస్సే

మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** ప్రజల పక్షాన నిలిచి కొట్లాడేది బిఆర్ఎస్ మాత్రమేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. వేల్పూర మండల కేంద్రంలోని కెసిఆర్ కాలనీలో జరిగిన బిఆర్ఎస్ వేల్పూర్ మండల కార్యకర్తల సమావేశం, కాంగ్రెస్ బాకీ కార్డు పంపిణీ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని, ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, ప్రజలకు బాకీ ఉన్న హామీలను కాంగ్రెస్ బాకీ కార్డు రూపంలో ప్రజలందరికి చేరవేయాలని కార్యకర్తలకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన నయవంచక హామీలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'కాంగ్రెస్ బాకీ కార్డు ఉద్యమం'ను నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతంగా చేపడుతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన 420 హామీలను పూర్తిగా మోసం చేసిందని, ప్రజలను మభ్యపెట్టిందని విమర్శించారు. ప్రజల పట్ల ఈ కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని వంచనను బయట పెట్టడానికి బీఆర్ఎస్ పార్టీ 'బాకీ కార్డు' రూపంలో ప్రజల్లోకి తీసుకవస్తోందన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనేక అడ్డగోలు హామీలిచ్చి ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకుని గద్దె నెక్కిందన్నారు. మేము అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే హామీలన్ని అమలు చేస్తామని ఎన్నికల్లో ప్రతివేదికలో చెప్పారు. ప్రజలను నమ్మించటానికి మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ కార్డులను పంచి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 22 నెలలు కావస్తున్నా కానీ ఏ ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో సక్రమంగా అమలు చేయలేదన్నారు. పథకాల అమలు తక్కువ,, ప్రచారం ఎక్కువ అన్న తీరున కాంగ్రెస్ పాలన సాగుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపికి ఓటు వేస్తే ఆ ఓట్లు మురిగిపోతాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బిజెపి రెండు కలిసి పని చేస్తున్నాయని ఆరోపించారు. బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈ రెండెళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ పథకాలు ద్వారా ప్రజలకు ఎంత బాకీ పడిందో తెలిసేలా కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రజలకు పంచుతామని ఎమ్మెల్యే అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రజలకు కాంగ్రెస్ చేస్తున్న మోసాన్ని వివరిస్తూ అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

## కలసికట్టుగా విజయం సాధిద్దాం

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

**ప్రజాపక్షం/కొండాపూర్ :** కార్యకర్తలు, నాయకులంతా కలిసికట్టుగా ఉండి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధిద్దామని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతాప్రభాకర్ అన్నారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ శివలీల జగదీశ్వర్ బిఆర్ఎస్‌లో చేరారు. మండల పరిధిలోని మల్లేపల్లి రాజా, మాజీ సర్పంచ్ శివలీల జగదీశ్వర్ కాంగ్రెస్ పార్టీనీ వీడి బిఆర్ఎస్‌లోకి బుధవారం చేరారు. ఈసందర్భంగా శివలీల జగదీష్‌లకు ఎమ్మెల్యే చింతాప్రభాకర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ సర్పంచ్‌తో పాటు మల్లేపల్లి మజీ వార్డు మెంబర్లు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శివలీలా జగదీష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లి తప్పు చేశామని, తిరిగి బిఆర్ఎస్‌లోకి రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ రాబోయే ఎంపిటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ నాయకులు కార్యకర్తలు కలహాలను పక్కన పెట్టి పార్టీ టికెట్టు ఎవరికి ఇచ్చిన కలసికట్టుగా ఐక్యమత్యంతో పనిచేసి అన్ని స్థానాలను గెలిపించుకోవాలన్నారు. ఈ రెండెళ్లలో కాంగ్రెస్ ప్రభు త్వం వివిధ పథకాలు ద్వారా ప్రజలకు ఎంత బాకీ పడిందో తెలిసేలా కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రజలకు పంచుతామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విఠల్, గోవర్ధన్ రెడ్డి, కాసాల బుచ్చిరెడ్డి, మాణిక్యం, మల్లాగౌడ్, ముకీమ్, డాక్టర్ శ్రీహరి, పాండురంగం మల్లేశం శ్రీధర్‌రెడ్డి, నగేష్, ముదిరాజ్, రుక్మొద్దీన్, సంతోష్‌రెడ్డి, కృష్ణమూర్తి రాం దాస్ , రామాగౌడ్, ప్రేమనందం పాల్గొన్నారు.



# క్రీడ

## టెస్టు ర్యాంకింగ్స్..
### సిరాజ్, జడేజాకు కెరీర్‌లో అత్యుత్తమ రేటింగ్ పాయింట్లు

భారత క్రికెటర్లు మహ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తమ కెరీర్‌లో అత్యుత్తమ టెస్టు రేటింగ్ పాయింట్లు అందుకున్నారు. వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టులో అదరగొట్టిన వీరిద్దరూ బుధవారం ఐసీసీ ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో గణనీయంగా స్థానాలను మెరుగుపర్చుకున్నారు. విండీస్‌తో మొదటి టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఏడు వికెట్లు పడగొట్టిన సిరాజ్ (718 పాయింట్లు) మూడు స్థానాలు ఎగబాకి 12వ స్థానానికి చేరుకున్నాడు. ఈ హైదరబాదీ పేసర్‌కు టెస్టు కెరీర్‌లో అత్యుత్తమ రేటింగ్ పాయింట్లు ఇవే. జస్‌ప్రీత్ బుమ్రా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ ఏడు స్థానాలు ఎగబాకి 21 ర్యాంకులో నిలిచాడు.



సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా (644 పాయింట్లు) బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో కెరీర్‌లో ఉత్తమ రేటింగ్ పాయింట్లు అందుకున్నాడు. జడ్డూ ఆరు స్థానాలు మెరుగై 25వ స్థానానికి ఎగబాకాడు. విండీస్‌పై జడేజా తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ (104*) చేసిన సంగతి తెలిసిందే. ఇదే మ్యాచ్‌లో శతకం (100) బాదిన కేఎల్ రాహుల్ నాలుగు స్థానాలు జంప్ అయి 35 స్థానానికి చేరుకున్నాడు. ఈ విభాగంలో ఇంగ్లాండ ఆటగాడు జో రూట్ నంబర్ వన్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా.. యశస్వి జైస్వాల్ రెండు స్థానాలు దిగజారి ఏడో ర్యాంక్‌కు పడిపోగా.. రిషభ్ పంత్, శుభ్‌మన్ గిల్ వరుసగా 8, 13 స్థానాల్లో ఉన్నారు. ఆల్‌రౌండర్ల విభాగంలో జడేజా టాప్‌లో ఉండగా. వాషింగ్టన్ సుందర్ నాలుగు స్థానాలు మెరుగై 11 స్థానంలో నిలిచాడు.

## బెత్ మూనీ సూపర్ సెంచరీ..



పాకిస్థాన్ టార్గెట్ 222

మహిళల వన్డే ప్రపంచ కప్‌లో భాగంగా ఆస్ట్రేలియా, పాకిస్థాన్ తలపడుతున్నాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్..ఆరంభంలో వికెట్లు కోల్పోయి తక్కువ స్కోరుకే ఆలౌటయ్యేలా కనిపించింది. కానీ, బెత్ మూనీ (109; 114 బంతుల్లో 11 ఫోర్లు) శతకం బాది జట్టును ఆదుకుంది. దీంతో ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది. చివర్లో అలానా కింగ్ (51*; 49 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడింది.

**76కే ఏడు వికెట్లు**

ఓపెనర్లు అలీస్సా హీలీ (20), ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (10) పరుగులు చేయడంతో 30/0తో నిలిచిన ఆసీస్ చూస్తుండగానే టపాటపా వికెట్లు కోల్పోయింది. ఓపెనర్లు నాలుగు బంతుల వ్యవధిలో వెనుదిరిగారు. తర్వాత వచ్చిన ఎల్లీస్ పెర్రీ (5), అనాబెల్ సదర్లాండ్ (1), ఆష్లీన్ గార్డ్‌నర్ (1), తాహిలా మెక్‌గ్రాత్ (5), జార్జియా వేర్‌హామ్ (0) ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. దీంతో ఆసీస్ 76 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో కిమ్ గార్త్ (11) కొద్దిసేపు క్రీజులో నిలవడంతో వికెట్ల పతనం ఆగింది. చివరకు గార్త్ జట్టు స్కోరు 115 పరుగుల వద్ద ఎనిమిదో వికెట్‌గా వెనుదిరిగింది. దీంతో ఆసీస్ 150 రన్స్‌లోపే కుప్పకూలేలా కనిపించింది. ఈ క్రమంలో క్రీజులో నిలదొక్కుకున్న అలానా బౌండరీలు బాదింది. మరో ఎండ్‌లో ఉన్న బెత్ మూనీ కూడా నిలకడగా ఆడి సెంచరీ చేయడంతో ఆసీస్ పోరాడే స్కోరు సాధించింది. డయానా వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో ఆఖరి బంతికి మూనీ ఔటైంది. పాక్ బౌలర్లలో నష్రా సంధు 3, రమీన్ షమీమ్ 2, సాదియా ఇక్బాల్ 2, ఫాతిమా సనా 2, డయానా బేగ్ ఒక వికెట్ పడగొట్టారు.

## ఆస్ట్రేలియాతో ఆడటం ఎంతో ఇష్టం
### రోహిత్ శర్మ సీక్రెట్ నెట్ ప్రాక్టీస్!



పరిమిత ఓవర్ల సిరీస్‌ల కోసం త్వరలో టీమ్ఇండియా ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. అక్టోబర్ 19 నుంచి మూడు వన్డేల సిరీస్.. 29 నుంచి ఐదు టీ20ల సిరీస్ ప్రారంభంకానున్నాయి. స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు ఎంపికయ్యాడు. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత భారత్ తరపున రోహిత్ ఆడనున్న సిరీస్ ఇదే. శుభ్‌మన్ గిల్‌కు వన్డే పగ్గాలు అప్పగించడంతో రోహిత్ ఆటగాడిగా మాత్రమే బరిలోకి దిగబోతున్నాడు. సారథ్య బాధ్యతలు లేకపోవడంతో రోహిత్ స్వేచ్ఛగా చెలరేగి ఆడాలని అభిమానులు ఆశిస్తున్నారు. ఈ క్రమంలో హిట్‌మ్యాన్ నవీ ముంబయిలో సీక్రెట్‌గా నెట్ ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొంటున్నట్లు తెలుస్తోంది. ఘన్సోలిలోని రిలయన్స్ కార్పొరేట్ పార్క్‌లో సాధన చేస్తున్నట్లు సమాచారం. రోహిత్ మంగళవారం ఉదయం మూడు గంటలపాటు ప్రాక్టీస్ చేసి సాయంత్రం సియట్ క్రికెట్ రేటింగ్ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రైవేట్ ట్రైనింగ్ సెషన్‌ను రోహిత్ సొంతంగా ఏర్పాటు చేసుకున్నాడట. ముంబయి ఇండియన్స్ ఫిజియో అమిత్ దుబే పర్యవేక్షణలో జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో 8–10 మంది నెట్ బౌలర్లు రోహిత్‌కు బౌలింగ్ చేశారని సమాచారం. ఆస్ట్రేలియా పిచ్‌లను దృష్టిలో ఉంచుకుని ఎక్కువగా బౌన్సర్లను ఎదుర్కొన్నాడట. సియట్ క్రికెట్ రేటింగ్ అవార్డుల కార్యక్రమంలో రోహిత్ శర్మ మాట్లాడుతూ.. ఆస్ట్రేలియాతో ఆడటం తనకు ఎంతో ఇష్టమని పేర్కొన్నాడు. 'ఆస్ట్రేలియా మాతో ఆడిన ప్రతిసారీ భిన్నమైన సవాలును విసురుతుంది. మేం చాలాసార్లు అక్కడ మ్యాచ్‌లు ఆడాం. అనుకూల ఫలితాలు రాబట్టడానికి ఏం చేయాలో మాకు తెలుసు' అని వివరించాడు.

# షో కేస్

## కళారంగం



### స్ఫూర్తి

జాత్యహంకారంతో నాజీలు జరిపిన విధ్వంస కాండ ఎంతో మంది జీవితాలను బలిగొంది. వారిలో తొమ్మిదేళ్ల ఇజాక్ స్టెయిన్ కూడా ఉన్నాడు. పోలాండ్‌లోని ఐశ్వర్యమైన యూదు వారసత్వంతో ప్రసిద్ధి చెందిన రాడోమ్ నగరంలో జన్మించిన ఇజాక్, చిన్న వయసు నుంచే తన మృదువైన స్వభావంతో అందరినీ ఆకట్టుకున్నాడు. జంతుప్రేమ ఎక్కువ. వాటి పట్ల కరుణతో వ్యవహరించేవాడు. పాఠశాలకు వెళ్లడం.. చదువుకోవడం.. జీవితంలో ఉన్నతంగా ఎదగడం వంటి ఎన్నో కలలు. మూగ జీవ కారుణ్యాన్ని ప్రచారం చేయాలని, మూగజీవుల సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని అనుకునేవాడు. తాను ఎక్కడికి వెళ్లినా, దారిలో కనిపించిన జంతువులకు ఆహారం పెట్టేవాడు. పక్షులతో ముచ్చటించేవాడు. క్రిమికీటకాలకు కూడా ఆహారాన్ని అందించేవాడు. కానీ, అతని ఆశలు, ఆశయాలు అన్నీ జాత్యహంకారం కీలల్లో మసైపోయాయి. అతని సుందర ప్రపంచం 1942లో దారుణంగా ధ్వంసమైంది. కేవలం 9 ఏళ్ల వయసులోనే అతను ట్రెబ్లింకా నిర్మూలన శిబిరానికి అతనిని బలవంతంగా తరలించారు. అక్కడ హోలోకాస్ట్ (మూకుమ్మడి హత్యలు) సమయంలో ప్రాణాలు కోల్పోయాడు. ఇజాక్ ఎదగడానికి, పాఠశాల పూర్తి చేసుకోవడానికి, కలల వెంట పరిగెత్తడానికి, లేదా అతను ఎంతో ప్రేమించిన జీవులను చూసుకోవడానికి ఒక్క అవకాశం లభించలేదు. ఇజాక్ పేరు లక్షలలో ఒకటి మాత్రమేకావచ్చు... కానీ, అతని స్మృతి.. మూగజీవాల పట్ల అతను ప్రదర్శించిన కరుణ ఇప్పటికీ ప్రాధాన్యమే. మనుషుల క్రూరత్వానికి, ఇప్పటికే ఎన్నో రకాల జంతుజాలం నశించిపోగా, వేలాది జాతులు ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇజాగ్ గుర్తుకురావడంలో ఆశ్చర్యం లేదు. అతనిని గుర్తించుకునే ఓపిక, తీరిక చరిత్రకు లేకపోవచ్చు. కానీ, మానవత్వం ఉన్న ఎవరికైనా అతని గురించి తెలుసుకోవడం, అతనిని గుర్తుచేసుకోవడం అత్యవసరం.

## సవాళ్లు విసురుతున్న ఆవిష్కరణ!



రష్యాకు చెందిన పురావస్తు శాస్త్రవేత్తలు 1890లో చేసిన ఒక ఆవిష్కరణ ఇప్పటికీ చరిత్ర పరిశోధకులకు సవాళ్లు విసురుతునే ఉంది. ఇది ప్రాచీన కళలపై మన అర్థాన్నే మార్చివేసింది. సాంద్ర అరణ్యాలలో శాస్త్రవేత్తలు ఒక పొడవైన మానవాకార కలప ప్రతిమను గుర్తించారు. అయితే, ఇది సాధారణమైన ప్రతిమ కాదు. దాదాపు 11,500 సంవత్సరాల చరిత్ర కలిగినది. అంటే ఈ విగ్రహం ఈజిప్టు పిరమిడ్లకంటే రెండింతలు పాతది. ఇది చివరి హిమ యుగాంతంలో మన ప్రాథమిక మానవులు ఎలా ప్రతీకాత్మక ఆలోచనలు చేసేవారో, కళా వ్యక్తీకరణ ద్వారా సమాజాన్ని ఎలా వ్యక్తపరచేవారో చూపించే అరుదైన నిదర్శనం. ఈ విగ్రహం ఆరు అడుగులకు మించి ఎత్తులో ఉంటుంది, ఒకే చెట్టు మాను నుంచి దానిని చెక్కారు. ముఖ లక్షణాలు, శరీరాకృతులు కొంత విచిత్రంగా కనిపించినా, ఆ బొమ్మ చెక్కిన తీరు చూస్తే, దీనికి ఆ కాలంలోని సమాజానికి మతపరమైన లేదా ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉండి ఉంటుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. కొందరు దీనిని వంశ మూల పురుషులదై ఉండవచ్చని అంటుంటే, మరికొందరు ఫలప్రదత, వేటా సాధనల ప్రార్థనలు లేదా గోత్ర సమైక్యతతో సంబంధమున్న యజ్ఞాలలో ఉపయోగించేవారని అభిప్రాయపడుతున్నారు. ఇది తయారైన కాలంలో ఇంకా వ్యవసాయం మొదలు కాలేదు. ఆ కాలంలో మనుషులు వేటాడి, అడవి పండ్లపైనే ఆధారపడే 'హంటర్–గాథరర్' జీవన విధానాన్నే కొనసాగించారు. శాశ్వత నివాసాలు, పట్టణ నిర్మాణాలు, మహత్తరమైన కట్టడాలు ఏవీ కూడా ఆరంభం కాలేదు. అయినప్పటికీ, అప్పటికే వారు ప్రతీకాత్మక ఆలోచనా శక్తి, కళాప్రతిభతో ఒక విగ్రహాన్ని సృష్టించగల సామర్థ్యం కలిగి ఉన్నారని ఈ చెక్క బొమ్మ చెప్తుంది. అంతేకాదు, ఈ కలప విగ్రహం ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉండడం ఓ అద్భుతం. దీని ద్వారా ప్రాచీన మనుషుల కళా నైపుణ్యం, వృక్ష పదార్థాల వినియోగం, ఆ సమాజపు సంస్కృతి గురించి కొత్త విషయాలను అధ్యయనం చేయవచ్చు. ఈ చెక్క బొమ్మ కనిపించిన ప్రాంతంలోనే, గుహా చిత్రాలు, చిన్నచిన్న మట్టి పట్టికలు, రాయి చెక్కులు వంటి హిమయుగ కళలకు ప్రతీకలుగా నిలుస్తాయి. దీనిని బట్టి కళాత్మకత, ప్రతీకావాదం వంటి అంశాలు మానవ జీవనంలో ఊహించిన దానికన్నా ముందుగానే ప్రధాన భాగమని స్పష్టమవుతోంది. అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, వేల సంవత్సరాల పాతదైన ఈ కలప విగ్రహంపై సూక్ష్మ విశ్లేషణలో పిగ్మెంట్‌ల ఆనవాళ్లు కనుగొన్నారు. అంటే ఈ విగ్రహం ఒకప్పుడు రంగులతో అలంకరించబడి ఉండే అవకాశం ఉంది. దీని వలన ఇది కేవలం ఒక శిల్ప సంప్రదాయ సాక్ష్యం కాకుండా, ఆధ్యాత్మిక రహస్యాలు, సాంస్కృతిక వ్యక్తీకరణకు సంబంధించిన మరింత లోతైన అర్థాలను ప్రతిబింబిస్తున్నదని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. ఏదిఏమైనా ఈ చెక్క బొమ్మ ఇప్పటి వరకూ హిమ యుగాంతపు పరిస్థితులపై ఉన్న అభిప్రాయాలను మార్చివేస్తున్నది.

## చారిత్రక ఆనవాళ్లు..



పరిశీలించాలేగానీ చారిత్రక ఆనవాళ్లు ఎన్నో కనిపిస్తాయి. అలాంటిదే ఎలిసెగ్ స్తంభం. ఇది క్రీస్తుశకం 9వ శతాబ్దానికి చెందిందని శాస్త్రవేత్తలు తేల్చారు. వేల్స్‌లోని లాంగోలెన్ సమీపంలో ఉన్న ఈ రాతి స్తంభాన్ని పొవిస్ రాజ్యం చివరి రాజైన కింగెన్ అప్ కడెల్ (మ. 855) తన ముత్తాత ఎలిసెగ్ లేదా ఎలిసెడ్ద్ గౌరవార్థం నిర్మించాడు. మొదట ఇది పొడవైన రాతి సిలువగా ఉండేది కాని ఇప్పుడు కేవలం రాతి స్తంభం మాత్రమే మిగిలింది. ఈ స్తంభంపై లాటిన్‌లో పొడవైన శాసనం చెక్కబడి ఉండేది. ఆ శాసనం చెదిరిపోయే లోపు 1696లో చరిత్రకారుడు ఎడ్వర్డ్ ల్యూడ దానిని నమోదు చేశాడు. ఈ శాసనం కింగెన్ యొక్క వంశవృక్షాన్ని ఎలిసెగ్ వరకు అనుసరిస్తూ, పొవిస్ రాజవంశం పాలనకు న్యాయబద్ధతను చూపించే శక్తివంతమైన రాజకీయ ప్రచారంలా పనిచేసింది. ప్రత్యేకంగా ఎలిసెగ్ చేసిన విజయాలను, ముఖ్యంగా ఆయన ఆంగ్లో సాక్సన్ ఆక్రమణదారుల నుండి ప్రాంతాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడాన్ని ఎన్నో విశేషణాలను చేర్చి, పొగడ్తలతో వివరించింది. ఎలిసెగ్ స్తంభం వేల్స్ ప్రారంభ మధ్యయుగ చరిత్రను అర్థం చేసుకోవడానికి అత్యంత ముఖ్యమైన సాక్ష్యం. ఇది రాజుల వంశవృక్షం, వారి రాజకీయ ధోరణులు, ప్రాంతీయ స్వాతంత్ర్య పోరాటాల గురించి విలువైన సమాచారాన్ని అందిస్తుంది.

## సిపిఐ శత జయంతి ఉత్సవాల ముగింపు ఘనంగా నిర్వహించాలి
### సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్



**ప్రజాపక్షం/వైరా :** డిసెంబర్26న జరుగబోయే భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతి ముగింపు ఉత్సవాలను ఖమ్మంలో ఘనంగా నిర్వహిస్తున్నామని ఈ ఉత్సవాల్లో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలతో పాటు సామాజిక వర్గాలు, పేద ప్రజలు మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. బుధవారం వైరా సిపిఐ కార్యాలయంలో యామాల గోపాలరావు అధ్యక్షతన జరిగిన వైరా నియోజకవర్గస్థాయిలో జిల్లా కార్యవర్గ సభ్యులు కౌన్సిల్ సభ్యులు మండల కార్యదర్శులు సమావేశంలో ముఖ్య అతిధిగా సిపిఐ జిల్లా కార్యదర్శి బండి సురేష్ పాల్గొన్నానరు. ఈస ందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ భారతదేశంలో 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఏకైక జాతీయ పార్టీ కమ్యూనిస్టు మాత్రమే అని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని మొట్టమొదటిసారిగా పిలుపునిచ్చి అనేక త్యాగాలు చేసిన పార్టీ సిపిఐ అని, ఆ తర్వాత దేశంలో భూసంస్కరణలు బ్యాంకుల జాతీయరణ దున్నే వాడికి భూమి దక్కాలని అనేక భూ పోరాటాలు నిర్వహించిన ఘనత ఉందని అన్నారు. దేశవ్యాప్తంగా శత జయంతి ఉత్సవాలు ముగింపు సభ ఖమ్మంలో జరగడం మనందరికి గర్వకారణం అని అన్నారు. ఇదే సందర్భంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులను అన్ని స్థానాల్లో గెలిపించుకోవడానికి గ్రామాల్లో ప్రణాళికాబద్ధంగా ఎన్నికల్లో పాల్గొని విజయాలు సాధించాలని కోరారు.

**దండి సురేష్‌కు సన్మానం :** సిపిఐ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా వైరా సిపిఐ కార్యాలయానికి వచ్చిన జిల్లా కార్యదర్శి దండి సురేష్‌ను సిపిఐ నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో వైరా నియోజకవర్గ ఇంచార్జి యర్రాబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు జాగర్లమూడి రంజిత్, కొణిజర్ల, జూలురుపాడు మండలాల కార్యదర్శిలు గుండెపిన్ని వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిల్ సభ్యులు స్వర్యణ రమేష్, షేక్ నాగుల్‌మీరా, సింగరేణి మండలం సీనియర్ నాయకులు బానోతు దళ్‌సింగ్, ఎల్లంకి మధు, మిట్టపల్లి రాఘవరావు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## బిల్లులు చెల్లిస్తారా, నిలిపివేయమంటారా!

**ప్రజాపక్షం/మాక్లూర్ :** మండలంలోని మధ్యాహ్న భోజన పథక కార్మికులు సమావేశంలో దసరాకు చెల్లిస్తామన్న మధ్యాహ్న కార్మికుల బిల్లును ఇప్పటివరకు చెల్లించకుండా దసరా పండగకు పస్తులుండేటట్లు చేసిందని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి చక్రపాణి అన్నారు. గ్రీన్ ఛానల్‌పై ప్రభుత్వం ప్రకటించిన జాడ లేదు ఈనెల 10 వరకు డబ్బులు రాకుంటే 13 నుంచి పూర్తిస్థాయిలో మధ్యాహ్న భోజన పథకం నిలిపివేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిస్తున్నామన్నారు. 10 వరకు పెండింగ్ బిల్లును చెల్లిస్తామని చెప్పి ఇంతవరకు అమలు కాలేదని ప్రభుత్వం ఇప్పటికైనా కానీ గ్రీన్ ఛానల్ ద్వారా తప్పనిసరి ఈనెల 10 వరకు పోయిన సంవత్సరం నుంచి ఇప్పటివరకు కోడిగుడ్డు బిల్లు 2000 వేలు, 9, 10వ తరగతుల మధ్యాహ్న భోజన పథకం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జిల్లాకు సుమారు ఇప్పటివరకు 10 కోట్ల బకాయి ఉన్నదని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 13న జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకాన్ని నిలిపివేస్తామని నల్లబ్యాడ్జీలు పెట్టుకుని నిరసన తెలిపాలని ప్రభుత్వానికి అధికారులకు తెలియజేస్తున్నామన్నారు. సమావేశంలో సాయమ్మ, లక్ష్మి , ప్రమీల, విజయ, కార్మికులు పాల్గొన్నారు.



# కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే ప్రజలకు రక్షణ

### స్థానిక సంస్థల ఎన్నికలలో సిపిఐని గెలిపించండి : సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/వరంగల్ :** కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే సమాజంలో ప్రజలకు రక్షణ ఉంటుందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం శివనగర్ తమ్మెర భవన్‌లో సిపిఐ జిల్లా సమితి పనాస ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రానున్న రోజులలో కమ్యూనిస్టులకే భవిష్యత్తు ఉంటుందని, ప్రజలు చట్టసభల్లో కమ్యూనిస్టులు బలంగా ఉండాలని కోరుకుంటున్నారన్నారు. సమాజంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం సిపిఐ ఉద్యమిస్తుందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్‌పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్ స్థానాలలో పార్టీ అభ్యర్థులను పోటీ చేయించి వారి గెలుపునకు కృషి చేయాలని సూచించారు. త్యాగాలకు, పోరాటాలకు నిలయం కమ్యూనిస్టులు అని, అందుకే వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేటికి ప్రజల గుండెల్లో నిలిచి ఉందన్నారు. ఎన్నికలు ధన ప్రవాహంగా మారిపోయినా, మతోన్మాద శక్తులు ప్రజలను విభజిస్తున్న వాటికి ఎదురొడ్డి సిపిఐ నిలబడిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలను ఓడించి లౌకిక, ప్రజాతంత్ర శక్తుల గెలుపుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్మియా, రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, నాయకులు దండు లక్ష్మణ్, గన్నారపు రమేష్, గుండె బద్రి, సంఘీ ఏలేందర్, అక్కపెల్లి రమేష్, గుంపల్లి మునీశ్వరుడు, చింతకింది కుమారస్వామి, వీరగోని శంకరయ్య, ఓర్సు రాజు, తాళ్లపల్లి జాన్ పాల్, ఎండి అక్బర్ పాషా, యాకాంబ్ర చారి, గోవర్ధన్ చారి, అయిత యాకయ్య, తాళ్లపల్లి రహేలా, చిట్యాల సువర్ణ, చిలువేరు విజయ, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ, కాంగ్రెస్ మైత్రి కొనసాగింపు

**ప్రజాపక్షం/ తాండూర్ :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ, కాంగ్రె స్ మధ్య మిత్ర ధర్మం కొనసాగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ స్పష్టం చేశారు. బుధవారం తాండూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపిఐ బృందం కాంగ్రెస్ పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో సమావేశమై స్థానిక ఎన్నికల్లో పొత్తు అంశంపై చర్చించిందని, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందించి, ముఖ్యమంత్రితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు సాలి గామ సంతోష్, బెల్లంపల్లి మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, తాండూర్ మండల సహాయ కార్యదర్శులు నరాల ప్రహ్లాద్, మలిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి పట్టి శంకర్ తో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## బెస్ట్ అవైలబుల్స్ స్కూల్స్ బిల్లులు చెల్లించకపోతే ఆందోళన తప్పదు

- ఫీజులు విడుదల చేయకపోతే చదువులు కొనసాగేదెలా
- పేద విద్యార్థులపై వివక్ష చూపిన ప్రభుత్వాలు మునగడ సాధించలేవు
- ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ విద్యార్థులకు బిల్లులు చెల్లించకుండా విద్యార్థులను విద్యకు దూరం చేస్తూ వారిపట్ల వివక్షత చూపుతుందని ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి పేద విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కూల్ ద్వారా నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నది. కానీ గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం విద్యార్థులకు అందించాల్సిన రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా మూసివేతకు సిద్ధపడుతున్నాయని అన్నారు. సుమారుగా రాష్ట్రవ్యాప్తంగా 200, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఉన్నాయని ఆ స్కూల్స్‌లో సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు 23,000 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ విద్యార్థులు మూడవ తరగతి నుండి పదవ తరగతి వరకు 7000 మంది విద్యార్థుల విద్యను అభ్యసిస్తుంటే కనీసం రాష్ట్ర ప్రభుత్వం 2023–24,25–26, విద్యా సంవత్సరం గాను సుమారుగా 180 కోట్లు బకాయిలు పెండింగ్ ఉండడంతో ప్రభుత్వం రియింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో బెస్ట్ అ వైలబుల్ స్కూల్స్ యాజమాన్యాలు ప్రభుత్వం ఫీజులు చెల్లించే వరకు విద్యార్థులను పాఠశాలలకు రావద్దని హుకుం జారీ చేశాయని దీనితో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు.ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలకు నిధులు ఉంటాయి గాని ఎస్‌సి, ఎస్‌టి పేద విద్యార్థులు చదువుకునే బెస్ట్ అవైలబుల్స్ స్కూల్‌కి నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర ఖజానా లేదని చెప్పడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా పేద విద్యార్థులు బెస్ట్ అవైలబుల్ ద్వారా ప్రతి ఏటా 3,500 మంది పేద విద్యార్థులకు విద్యను అందిస్తున్నారన్నారు ప్రభుత్వం పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే విధంగా కృషి చేస్తున్న ఆశించిన ఫలితాలు రావట్లేదన్నారు తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రియింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయకపోతే ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## కార్మిక వ్యతిరేక విధానాలపై తిరుగుబాటు చేయాలి
### ఎఐటియుసి ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ పిలుపు

**ప్రజాపక్షం/ములుగు :** కేంద్ర, రాష్ట్ర కార్మిక వ్యతిరేక విధానాలపై తిరుగుబాటు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ పిలుపునిచ్చారు. ములుగు మండల కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో గుంజ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఏఐటియూసి ములుగు మండల కమిటీ సమావేశంలో పాల్గొన్న రవీందర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ప్రయివేట్ పరం చేశారని, వెంటనే రద్దు చేసి ప్రభుత్వం ఆధ్వర్యంలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. పాఠశాల మధ్యాహ్న భోజన వంట కార్మికులకు ఎన్నికల హామీ ప్రకారం రూ.10వేల వేతనాలు పెంచాలని, అలాగే జిల్లా వైద్యశాలల్లో శానిటేషన్ సెక్యూరిటీ పేషెంట్ కేర్ విభాగాలలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, పాఠశాల స్కావెంజర్లను వేతనాలు నేరుగా వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే స్కీం వర్కర్స్ అందరిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికులకు సమగ్ర సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం కార్మికులు అందరూ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ముత్యాల రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఇంజం కొమురయ్య, బోడ రమేష్, బుడిమె సదయ్య, పెదకాసు వినోద్, పౌర రాధ, మాలగాని కమలక్క, లావుడ్య రఘు, రేగూరి రాజేందర్, సమ్మయ్య, బి నరేష్, రాజు, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## ఆహార పరిశుభ్రతను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : ఫుడ్ సేఫ్టీ అధికారి

**ప్రజాపక్షం/జనగామ :** ఆహార పరిశుభ్రతను ఉల్లంగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారి వినీల్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం జనగామ పట్టణంలోని పలు హోటళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులతోకలిసి ఈ దాడులు చేశారు. పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట ఉన్న హోటళ్లను ఆకస్మికంగా తనిఖీ చేసి పలు హెచ్చరికలు చేశారు. ఈ సందర్భంగా వినీల్‌కుమార్ మాట్లాడుతూ హోటళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిర్వాహణ సిబ్బందికి క్యాప్స్, డ్రెస్‌కోడ్ ఉండాలని, హ్యాండ్ బ్లౌసెస్ వాడాలన్నారు. 12 ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లను తనిఖీ చేసి 13వేల రూపాయల జరిమానా విధించారు. ఈ తనిఖీలో జిల్లా ఆహార పరిరక్షణ అధికారితో పాటు మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ పులి శేఖర్, సానిటరీ జవాన్లు పాల్గొన్నారు.




## అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ను జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ రెవెన్యు అడిషనల్ కలెక్టర్ అనిల్ కుమార్ తో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్బంగా కలెక్టర్ ఏటీసీలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు, పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అమలు అవుతున్న వివిధ కోర్సుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏటీసీలో ఉన్న అధునాతన మిషనరీ గురించి వివరాలను సంబందిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్శనలో కలెక్టర్ వెంట మహబూబాబాద్ తహసిల్దార్ రాజేశ్వర్, ఏటిసి ప్రిన్సిపల్ ఎన్. బాబు ఏటిసి ఇంచార్జ్ ఉప్పలయ్య, రాజేశ్వర్ మరియు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## కిషోర్‌దాస్‌పై చర్య తీసుకోవాలి



**ప్రజాపక్షం/జనగామ:** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ పై దాడి చేసిన మనువాది అయినా న్యాయవాధి కిషోర్ దాస్‌పై కఠిన చరయ్యలు తీసుకోవాలని సిపిఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం జిల్లా కమిటి ఆధ్వర్యంలో నెహ్రూ పార్కు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మోకు కనకారెడ్డి మాట్లాడుతూ బిఆర్ గవాయ్‌పై జరిగిన దాడి భారత రాజ్యాంగం, ప్రజలపై చేసిందిగానే భావించాలన్నారు. నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తరువాత మనువాదులు అరాచకాలు పెరిగిపోతున్నాయని, దళితులు, ఆదివాసిలు, గిరిజనుపై దాడులు పెరుగుతున్నాయన్నారు. మేధావులు, ప్రతిపక్ష ప్రభుత్వాలపై దాడులు చేయడం ఆయనకు పరిపాటిగా మారిందని, రాజ్యాంగాన్ని మార్చే కుట్ర జరుగుతుందన్నారు. ఈ దాడిని ప్రజలు, ప్రజాసామ్య వాధులు కఠించాలన్నారు. వెంటనే కిషోర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గుండ్రపల్లిలో ఆరోగ్య సర్వే



**ప్రజాపక్షం/నెక్కొండ:** మండలంలోని గుండ్రపల్లి గ్రామంలో గత కొద్ది రోజుల క్రితం డెంగీ లక్షణాతో ఇద్దరు మృతిచెందారు. దీంతో అప్రమత్తమైన ఆరోగ్య శాఖ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నెక్కొండ ప్రాథమిక వైద్య శాల డాక్టర్ సుమన్, డాక్టర్ తన్వీర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రతీ ఇంట్లో వ్యక్తుల ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 2100 ప్రజలు ఉండగా గ్రామంలో 423 ఇళ్లు ఉండగా అందులోని ప్రజలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు, గ్రామ మొత్తంలో ఐదుగురికి మాత్రం సీజనల్ జ్వరం వచ్చి ఉందని, వీరిని పరీక్షించి మందులు పంపిణీ చేశామని, గ్రామంలో ప్రతీ ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్య బృందం గ్రామంలో ఎవరికీ డెంగీ లక్షణాలు లేవని నిర్ధారించారు. దీంతో వైద్య సిబ్బంది, గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

## ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు: ఫణి



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** మండలంలో ఎవరైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవంటూ తహశిల్దార్ ఫణి కిషోర్‌లు హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఫణి కిషోర్ మాట్లాడుతూ మండల పరిధిలో ఎవరైనా ఇందిరమ్మ ఇండ్ల పేరుతో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేసినా, ఎక్కడైనా ఇసుకను నిల్వ చేసినా అలాంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అదే విధంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి గ్రామాలలో ఎన్నికల నియమావళి పట్ల అనుసరించాల్సిన వాటిపై చర్చించారు. ఎన్నికల నిబంధనలు పాటించి ప్రజలు ప్రశాంతంగా ఎన్నికలు జరగడానికి సహకరించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ శ్రీనివాసులు, జనగామ రూరల్ సిఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ దూదిమెట్ల నరేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## మద్యం షాపు దరఖాస్తులను సులభతరం చేయాలి

### డిప్యూటీ కమిషనర్ అంజన్ రావు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** మద్యం షాపుల దరఖాస్తు విధానాన్ని సులభతరంగా ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని ప్రొహిబిషన్ ఎక్సైజ్ వరంగల్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ జి.అంజన్ రావు సూచించారు. బుధవారం జిల్లా ఎక్సైజ్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన 202527 సంవత్సరాల ఏ4 మద్యం షాపుల దరఖాస్తు ప్రక్రియను పర్యవేక్షించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అభ్యర్థులు సౌకర్యవంతంగా దరఖాస్తు చేసుకునేలా దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచడం, అప్లికేషన్ ఫీజు చెల్లించేందుకు అవసరమైన చలానాలను సమయానికి జనరేట్ చేయడం దరఖాస్తుదారులకు మార్గద ర్శకత్వం అందించేందుకు హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.శ్రీనివాస్, భూపాలపల్లి, కాటారం, ములుగు, ఏటూరునాగారం స్టేషన్ల ఎక్సైజ్ సి.ఐలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# భూగర్భ జలాల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

### కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్

**ప్రజాపక్షం/జనగామ:** భూగర్భ జలాల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. భూగర్భ జలాలు పెంపొందించేందుకు వివిధ శాఖల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. బుధవారం భూగర్భ జల అంచనా సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. భూగర్భ జలాధికారి సిహెచ్ నర్సింహులుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మాట్లాడుతూ వివిధ శాఖల అధికారుల భాగస్వామ్యంతో జిల్లాలో భూగర్భలు సంరక్షించుకోవడంతో పాటు జలాల పెంపు కోసం ఇంకుడు గుంతల నిర్మాణం, సోక్ ఫిట్స్ వంటివి చేపట్టడం జరిగిందన్నారు. భూగర్భ జల వనరుల సంరక్షణపైన ప్రత్యేక దృష్టి పెట్టాలని, భూగర్భ జల వనరులను మెరుగు పరచడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ, డిఏఓ, డిసిఓ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి పాల్గొన్నారు.

**పిఎం ధన్ ధాన్య కృషి యోజనతో జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తుల పెంపకం**

ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన ద్వారా జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తులు పెంచే కార్యక్రమం జరగనుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. నీతి అయోగ్ ధ్వర్యంలో ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన కార్యక్రమంపై కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ, నీతి అయోగ్ ఆధ్వర్యంలో కాన్ఫరెన్స్ జరిగింది. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, పంట వైవిధీకరణ, స్థిరమైన వ్యవసాయ పద్దతులను అవలంభించడం, నీటి పారుదల సౌకర్యాలు మెరుగుపర్చడం జరుగుతుందన్నారు. దీర్ఘకాలిక, స్వల్ప కాలిక రుణ లభ్యతను సులభతరం చేయడం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ అనుబంధ శాఖల కార్యక్రమాలన్ని సమన్వయంతో నిర్వహణ చేయవలసి ఉంటుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ వ్యవసాయ, మత్స్య, ఇరిగేషన్ శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారు.




**జిల్లాలో సమాచార హక్కు చట్టం వారోత్సవాలు**

ప్రభుత్వ అధికారుల పనితీరులో పారదర్శకత జవాబుదారితనాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో రూపొందించిన సమాచార హక్కు చట్టంపై జిల్లా మండల, గ్రామ స్థాయిలో అధికారుంతు అందరు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. ఈ నెల 5 నుండి 12 వరకు గ్రామ, మండల జిల్లా స్థాయిలో నిర్వయిస్తున్న సమాచార హక్కు చట్టం వారోత్సవాల్లో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లో అన్ని శాఖల అధికారులతో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ చట్టం పైరులకు సాధికారిత కల్పించదని, అధికారులు ఎలా పనిచేస్తున్నారో తెలుసుకునే హక్కు పైరులకు లభించిందన్నారు. ప్రభుత్వ కార్యక్రలాపాలలో పారదర్శకతను తీసుకురావడం, ప్రభుత్వ అధికారులు తమ చర్యలకు జవాబుదారిగా ఉండేలా చేసిన ఈ చట్టం పట్ల అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉన్నప్పుడే దరఖాస్తు దారుడు కోరిన సమాచారాన్ని నిర్ణీత గడువులో నిర్భయంగా ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఆర్‌టిఐకి సంబందించిన ధరఖాస్తులను పరిష్కరించడంలో ఇప్పటి వరకు అన్ని శాఖల అధికారులు భాగా పనిచేయడం వలన జిల్లా ముందంజలో ఉందన్నారు. ఇప్పటి వరకు ఏ ఒక్క అప్లకేషన్ పెండింగ్‌లో లేదని ముమ్మందు ఇలాగే ఎప్పటికప్పుడు ఆర్‌టిఐ అప్లికేషన్‌లు త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెన్నలోమ్, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ ఆర్‌టిఐ జిల్లా నోడల్ అధికారి సుహాసిని, ఆర్‌డిఒ గోపిరాం, జడ్‌పి సిఇఒ మాధురిషా కలెక్టరేల్ ఎఒ.శ్రీకాంత్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ఈవిఎం గోదాంలను పరిశీలించిన కలెక్టర్**

ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం జనగామ సమగ్ర జిల్లా కార్యాలయంలో ఉన్న ప్రధాన ఈవిఎం గోదామును అదనపు కలెక్టర్ వెన్నలోమ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ పరిశీలించారు. భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్‌ఎఒ శ్రీకాంత్, జనగామ తహసీల్దార్ హుస్సేన్ పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూరిపై మతోన్మాది దాడిని ఖండిస్తున్నాం

### సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్

### ప్లకార్డులతో నిరసన

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సుప్రీం కోర్టు న్యాయమూర్తి పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ అన్నారు. హైకోర్టు న్యాయమూర్తి పై దాడిని నిరసిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో ప్లకాడ్లతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండించాలని, జస్టిస్ గవాయ్ పై ఆర్ ఎస్ఎస్ ముసుగులో ఉన్న అరాచక న్యాయవాది రాకేష్ కిషోర్ తన బూటు విసిరి దాడికి పాల్పడినాడని ఇది ఆర్ఎస్ఎస్ పథ కం ప్రకారం చేసిన దాడి అని సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ అన్నారు. ఈ దాడిని కమ్యూనిస్టు పార్టీగా తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ దాడులు కేవలం జస్టిస్ గవాయ్ పైన మాత్రమే కాదు భారతదేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలపైన దాడిగా చూడాలని అన్నారు. జస్టిస్ గవాయ్ ఎల్లప్పుడూ రాజ్యాంగ స్పూర్తిని నిలబెట్టే విధంగా తీర్పులు ఇచ్చారనీ, అది గిట్టని మతోన్మాద శక్తులు లాయర్ రాకేష్ కిషోర్ రూపంలో దాడులు చేపిస్తున్నారని తెలిపారు. బిజెపి ఆర్ఎస్ఎస్ మతోన్మాద అరాచకాలను ఆపాలని లాయర్ రాకేష్ కిషోర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు. ఈ దాడికి దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పూర్తి బాధ్యత వహించాలన్నారు. దేశ ప్రజల మెదడులో విద్వేషాలను నింపుతున్న ఆర్ఎస్ఎస్ విష సంస్కృతి వల్లే ఈ భౌతిక దాడులు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు , తదితరులు పాల్గొన్నారు.



## ప్రమాదకరంగా ప్రయాణం



**ప్రజాపక్షం/ములుగు:** వెంకటాపూర్ మండలంలో లింగాపూర్ నుండి వెంకటాపూర్ మధ్యలో ఉన్న బిటి రోడ్డు రోజుల తరబడి గుంతలుగా మారి ప్రయాణం చేయాలంటే ఇబ్బందిగా మారింది. ఎప్పుడు ఏ ప్రమాదాలు జరగుతాయోనని ప్రయాణికులు భయంతో ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. కొన్ని సంవత్సరాలుగా ఏర్పడిన గుంతలను ఇప్పటి వరకు మరమ్మత్తులు చేయకపోవడం వల న బిటి రోడ్డుపై ప్రయాణం చేయాలంటే భయం నెలకొంది. వెంకటాపూర్ నుండి గణపురం పోయే బిటి రోడ్డు కూలా చాలా ప్రమాదకరంగా ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిటి రోడ్డు ఎక్కువ మొత్తంలో పాడవడంతో నగరం నుండి వచ్చే ఇసుక లారీలు చాలా లోడ్‌తో రావడం వలన ఇంచర్ల జంగాలపల్లి, అలాగే గణపురం వరకు రోడ్డు ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉందని, దీనిపై సంబంధిత అధికారులు చొరవ తీసుకొని రోడ్డుకు మరమ్మత్తులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**ప్రమాదాలు జరిగేతే స్పందిస్తారా?**

కొన్ని సంవత్సరాలుగా వెంకటాపూర్ నుండి లింగాపూర్ వరకు బిటి రోడ్డు చాలా గుంటలు ఏర్పడి ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతుంది. రాత్రి సమయంలో ఈ రోడ్డుపైన ప్రయాణం చేస్తే ప్రాణాలు పోయే సందర్భాలు ఉన్నాయి, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బిటి రోడ్డు పనులను వెంటనే చేయాలి

## సిపిఐలో చేరిన పలువురు



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై నిరంతరం పోరాడే సిపిఐపార్టీని స్థానిక సంస్థల ఎన్నికలలో ఎంపిటిసిలుగా, సర్పంచ్‌లుగా ప్రజా ప్రతినిధులుగా గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు, మండల కార్యదర్శి జువారి రమేష్ కోరారు. బుధవారం ఉప్పుగల్లు గ్రామంలో సిపిఐ పార్టీ సమావేశం పెండ్యాల సమ్మయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రమేష్ హాజరై నూతనంగా పార్టీలో చేరిన వారిని అబినందించి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.స్థానిక సంస్థల ఎన్నికలలో ఉప్పుగల్లు గ్రామంలో సిపిఐ జెండా ఎగురవేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల నాయకులు అజయ్, జాఫర్, బు చ్చయ్య, సాయిలు, సతీష్, మధు, శంక ర్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు. ఉప్పుగల్లు గ్రామంలో బుధవారం సిపిఐలో పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు. సిపిఐలో చేరిన వారిలో రమేష్, కొమురయ్య, కృష్ణ, సతీష్, శ్రీకాంత్, రాజేష్, రంజిత్‌కుమార్, శ్రీకాంత్, రాజేష్, సతీష్, చంద్రశేఖర్, శ్రీకాంత్, చిన్న శ్రీనివాస్, అరుణ్‌కుమార్, శివకుమార్, శివ, సాయి, వరుణ్, ప్రవీణ్, గణేష్, శివతోపాటు 25 కుటుంబాలు పార్టీ ప్రజా ఉద్యమాలకు ఆకర్షితులై పెద్ద సంఖ్యలో పార్టీలో చేరారు.

## భూభారతి దరఖాస్తులకు త్వరితగతిన పరిష్కారం: కలెక్టర్

**ప్రజాపక్షం/ నర్సంపేట:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి కార్యక్రమం ద్వారా రైతులు సకాలంలో తమ భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకునేలా చొరవ చూపాలని, దరఖాస్తుల పరిశీలనలో జాప్యానికి తావు లేకుండా వెంటనే ఆర్జీలను పరిష్కరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. బుధవారం కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలసి నర్సంపేట ఆర్డీఓ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రెవిన్యూ డివిజన్లోని 6 మండలాల తహసిల్దార్, ఇతర సిబ్బందితో భూభారతి అమలుపై సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులలో ఆయా మాడ్యుల్స్ లో ఎన్ని అర్జీలు పరిష్కరించారని, ఎన్ని పెండింగ్ లో ఉన్నాయని, ఎంత మందికి నోటీసులు ఇచ్చారని, క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పూర్తయ్యిందా..? లేదా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి పరిశీలన నిర్ణీత గడువు లోపు అన్ని దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. దరఖాస్తులు తిరస్కరణకు గురయితే అందుకు గల కారణాలు స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. సాదా బైనామా, పీఓటీ లకు సంబంధించిన అప్లికేషన్ లను క్షుణ్ణంగా పరిశీలించాలని, వెంటనే నోటీసులు జారీ చేస్తూ క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ నిర్వహించాలన్నారు. భూభారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఆర్జీల పరిష్కారంలో జాప్యం జరుగకుండా రోజువారీగా దరఖాస్తుల పరిశీలనను పర్యవేక్షిస్తూ.. వేగవంతంగా వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమీక్షలో ఆర్డీఓ ఉమారాణి, తహశీల్దార్‌లు రవిచంద్ర రెడ్డి, రాజేశ్వరరావు, రాజ్ కుమార్, అబిడ్ అలీ, రమేష్, కృష్ణా, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ జినో సైడ్ హత్యాకాండ దురాక్రమణ దాడులను ఖండించాలి

**ప్రజాపక్షం/ నర్సంపేట :** పాలస్తీనా ప్రజలపై జినోసైడ్ హత్యాకాండకు పాల్పడుతూ ఇజ్రాయిల్ జరుపుతున్న దురాక్రమణ దాడులను తీవ్రంగా ఖండించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనివాస్, సిపిఎం రాష్ట్ర నాయకులు కుమారస్వామి, తెలంగాణ ప్రజాఫ్రంట్ నాయకులు జనగాం కుమారస్వామిలు అన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులు నేటికీ రెండు సంవత్సరాల అవుతున్న సందర్భంగా సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా సిపిఐ, సిపిఎం, తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకులు నర్సంపేట పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత మధ్య ఆసియా లో తమ ఆధిపత్యం నిలుపుకోవడానికి అమెరికా, బ్రిటన్ సామ్రాజ్యవాద దేశాలు పాలస్తీనా భూభాగంపై 1948వ సంవత్సరంలో కృత్రిమంగా ఇజ్రాయిల్ దేశాన్ని ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు. ఇజ్రాయిల్ పాలకులు నాటి నుండి నేటి వరకు పాలస్తీనా దేశ భూభాగాన్ని ఆక్రమిస్తూ ప్రజలను ఊచకోత, కోస్తున్నదని ఈ దుశ్చర్యకు అమెరికా, బ్రిటన్ సామ్రాజ్యవాదుల అండ ఉందని ఆయన విమర్శించారు. ఐక్యరాజ్యసమితిలో ఉన్న సభ్య దేశాలుగా ఉన్న 145 దేశాలు, పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తిస్తున్నామని ప్రకటించినప్పటికీ ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో అమెరికా వ్యతిరేకించిందన్నారు. గత రెండు సంవత్సరాలుగా పాలస్తీనాలోని గాజా తదితర ప్రాంతాలపై జరిగిన దాడుల్లో దాదాపు 6 6 వేల మంది ప్రజలు హత్యకు గురయ్యారని, రెండు లక్షల మంది క్షతగాత్రులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ జిల్లా జిల్లా నాయకులు జక్కుల తిరుపతి, గట్టి కృష్ణ, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు పాణి, మల్లన్న, ఐఎఫ్‌టియూ జిల్లా నాయకులు పరిగెల కుమార్, గొర్రె ప్రదీప్, పిఓడబ్ల్యూ అధ్యక్షురాలు పూలక్క, పీవైఎల్ జిల్లా అధ్యక్షులు ఆకుల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.




## స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత సత్తా చూపుదాం



**ప్రజాపక్షం/ గోవిందరావుపేట :** తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క అదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనమేరకు మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చి చింత క్రాంతి అధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ యూత్ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయగా ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రదాన కార్యదర్శి రాకేష్,జిల్లా యూత్ అధ్యక్షులు ఇస్సార్ ఖాన్ ,నియెజకవర్గ యూత్ అధ్యక్షుడు మారం సుమన్ రెడ్డి హజరై స్థానిక సంస్థ ఎన్నికల్లో యువత సత్తా చూపించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పధాన కార్యదర్శి రాకేష్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం లో అవలంబించిన వ్యూహాలను కాంగ్రెస్ పార్టీ పెట్టిన పథకాలను మరియు బిఅర్ ఎస్ పార్టీ చేసిన అవినీతి అక్రమాలను ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ విజయాని కీ బాటలు వేయవలసిందిగా కోరారు ,జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్ మాట్లాడుతూ రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో యువతకు ఉన్న ప్రాముఖ్యత ,మరియు ఎన్నికల్లో పోటి చేసేటటువంటి యువతకు ,అభ్యర్ధులకు ప్రతి కార్యకర్త సహకారం అందిస్తూ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్నటువంటి పథకాలను విస్తృతస్థాయి లో ప్రచారం చేసి కాంగ్రెస్ అభ్యర్ధులను అధిక మెజారిటీ తో గెలిప్చికోవాలని ,యువత ఉత్సహంగా పనిచేసే రాబోయే రోజుల్లో మంచి పదవుల్లో వుంటారని అన్నారు.యూత్ అధ్యక్షులు సుమన్ రెడ్డి మాట్లాడుతూ సీతక్క మీద తప్పుడు ప్రచారాలు చేస్తున్న బిజెపి ,బిఅర్ఎస్ నాయకులకు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ది చెప్పాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ అధీస్థానం సూచించన అభ్యర్ధులను గెలిపించుకునే బాధ్యత మనందరిపై వున్నదని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడుపెండంశ్రీకాంత్,నియెజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షలు గొంది కీరణ్ మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కోరం రామ్మోహన్ ,జక్కు రణదీప్ ,కొల్లు శ్రీనివాస్ ,వివిద మండల అధ్యక్షులు ,ఉపాధ్యక్షులు ,యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## పరుచూరి రాధమ్మకు సిపిఐ నేతల నివాళి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సిపిఐ నాయకురాలు పరుచూరి రాధమ్మకు సిపిఐ నేతలు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం ఖమ్మంలో జరిగిన రాధమ్మ సంస్మరణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరుచూరి రాధమ్మ కుటుంబం కమ్యూనిస్టు పార్టీలో అనేక త్యాగాలు చేసిందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తెలిపారు. జంట హత్యలు జరిగిన అదరక, బెదరక తుదిశ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీలో పనిచేసిన ధీరోదాత్త కుటుంబమన్నారు. అర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహ రావు, పోటు కళావతి, సిహెచ్ సీతామహాలక్ష్మి, సిపిఐ నాయకులు పుచ్చకాయల సుధాకర్, శాఖ మూరి శ్రీనివాస రావు, తాటి నిర్మల, వెంకటాయపాలెం గ్రామ మాజీ సర్పంచ్ రావెళ్ళ మాధవి, నాయకులు వాసు, కృష్ణమోహన్, షర్మిల, శంకర్‌రావు పాల్గొన్నారు.

## పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్‌ను ప్రారంభించిన కమిషనర్



**ప్రజాపక్షం/కొణిజర్ల :** పోలీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌లో నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందించడమే లక్ష్యం అని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. మండల కేంద్రం కొణిజర్ల పోలీస్ స్టేషన్ ప్రక్కన ఏర్పాటుచేసిన హెచ్‌పిసిఎల్ పెట్రోల్ బంక్ ను సునీల్‌దత్ బుధవారం ప్రారంభించారు. హెచ్‌పి యాప్ ద్వారా నగదు చెల్లింపులు ఉచిత డిస్కౌంట్ సౌకర్యంకూడా ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు పోలీస్ పెట్రోల్ బంక్‌ను సందర్శించి పోలీస్ సంక్షేమానికి కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రామానుజం, ఎస్‌బి ఏసీపీ మహేష్, ఏఆర్ ఏసీపీలు నర్సయ్య, సుశీల్‌సింగ్, నర్సింహ్, టిఎస్ (వరంగల్ టీఓ హెచ్‌పిసిఎల్ చీఫ్ రీజనల్ మేనేజర్) సమ్మయ్య, సేల్స్ ఆఫీసర్ సంకేత్, ఇంజనీరింగ్ ఆఫీసర్ బి రాహుల్, వైరా సిఐ సాగర్, ఆర్‌ఐలు కామరాజు, శ్రీశైలం, సురేష్ సాంబశివరావు, నాగులమీరా, కొణిజర్ల ఎస్సై జి సూరజ్ పాల్గొన్నారు.

# నగరాన్ని ప్లాస్టిక్ ఫ్రీజోన్‌గా మార్చాలి

అభివృద్ధి పనులకుతుమ్మల శంకుస్థాపన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరాన్ని ప్లాస్టిక్ ఫ్రీగా తీర్చిదిద్దాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఖమ్మం నగరంలోని 18వ డివిజన్‌లో రూ. 1.45 కోట్లతో సిసి రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం నగరాన్ని అభివృద్ధికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. నగరంలో చేపడుతున్న అభివృద్ధి భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా, పది కాలాల పాటు నాణ్యతతో ఉండేలా చేపట్టాలన్నారు. ఖమ్మంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఖమ్మం నగరాన్ని పచ్చదనం, పరిశుభ్రతతో ఉండేలా చూడగలమన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని ప్లాస్టిక్ ఫ్రీగా ఖమ్మం నగరాన్ని తీర్చి దిద్దాలన్నారు. ప్లాస్లిక్ కంపెనీలను మూసివేస్తే తప్ప కాలుష్యాన్ని నివారించలేమన్నారు. యూరియా వాడకం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో ఖమ్మం నగర అభివృద్ధికి వందల కోట్ల నిధులను ఖర్చు చేస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ద్వారా అందించే సంక్షేమ పథకాల ద్వారా లబ్ది చేకూరుస్తున్నామన్నారు. మురికి కాలువల పక్కన నివాసం ఉండే పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేలా శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ మందడపు లక్ష్మి మనోహర్, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సాధు రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## తాళ్లూరి పల్లవిని అభినందించిన మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఖమ్మం జిల్లాకు చెందిన తాళ్లూరి పల్లవిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ విభాగంలో ఆలిండియా ట్రేడ్ టాపర్‌గా తాళ్లూరి పల్లవి నిలిచింది. ఈ సందర్భంగా వీడియోస్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును తాళ్లూరి పల్లవితో పాటు ఆమె తల్లిదండ్రులు మర్యాద పూర్వకంగా కలిశారు. పల్లవిని శాలువతో సత్కరించి మెమోంటోను బహూకరించారు. ఈ సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ విభాగంలో దేశంలోనే టాపర్‌గా నిలవడం ఎంతో అభినందనీయమన్నారు. పల్లవితో పాటు ఆమె తల్లిదండ్రులను మంత్రి తుమ్మల అభినందించారు. పల్లవిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు భావి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కమ్మ మహాజన సంఘం ఖమ్మం బాధ్యులు కొల్లు రఘు సత్యనారాయణ, చావా రాము, రాఘూరి సైదుబాబు, నల్లమల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి



**ప్రజాపక్షం/పాల్వంచ :** స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించి కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధి దంతెలబోర ఎస్‌సి కాలని, బంద్రుగొండ గ్రామాలలో ఆయన బుధవారం పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్ళి అవగాహన కల్పించి పార్టీని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి ఎర్రంశెట్టి ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న, జాలె జానకీరెడ్డి,పెద్దమ్మతల్లి దేవస్థాన ధర్మకర్తల మండల చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, నాయకులు ధర్మసోత్ ఉపేందర్ నాయక్, జమ్ముల రాజశేఖర్, కాకా శ్రీనివాసరావు,బెల్లం అలివేలు, బోద శ్రీలతారెడ్డి, గోసుల సతీష్, కొర్రయ్య, మల్లేష్, వెంకటేశ్వర్లు, రమేష్ పాల్గొన్నారు.

## పర్ణశాల వద్దకు బస్‌స్టాప్ తరలింపు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని ఇందిరానగర్ వద్ద గల బస్‌స్టాప్‌ను పక్కనే గల రామాలయం పర్ణశాల వద్దకు తరలిస్తున్నట్లు ఖమ్మం ఆర్టిసి డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, ట్రాఫిక్ సిఐ నాయుడు తెలిపారు. ప్రయాణికుల ఇబ్బందులు, ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఖమ్మం ఆర్టిసి రీజినల్ మేనేజర్ ఎ.సరిరామ్, ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు సూచనల మేరకు బస్‌స్టాప్‌ను పర్ణశాల వద్దకు తరలిస్తున్నట్లు వారు తెలిపారు. బుధవారం డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, ఖమ్మం డిపో మేనేజర్ శివప్రసాద్, ట్రాఫిక్ సిఐ నాయుడు పర్ణశాల వద్ద బస్‌స్టాప్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య మాట్లాడుతూ వైరా, తల్లాడ, భద్రాచలం, సత్తుపల్లి వెళ్లే మార్గమైన మమత రోడ్డు దగ్గర ఉన్న ఇందిరా నగర్ వద్ద గల బస్‌స్టాప్ వద్దే ట్రాఫిక్ సిగ్నల్ కూడా ఉండడంతో అటు ప్రయాణికులకు, ఇటు వాహన దారులకు ఇబ్బందిగా మారిందన్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని ఇందిరానగర్ బస్‌స్టాప్‌కు కొంచెం ముందు ఉన్న రామాలయం పర్ణశాల వద్దకు మార్చనున్నట్లు వారు తెలిపారు. నేటి నుంచి బసులన్ని పర్ణశాల వద్ద ఆగుతాయని ప్రయాణికులు సహకరించాలని వారు కోరారు.

## బిజెపి అక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** బిజెపి అక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఓట్ల చోరీపై సంతకాల సేకరణ చేపట్టాలని ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ జావిద్ తెలిపారు. బుధవారం కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ఖమ్మం నగరంలోని డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. స్వయం ప్రతిపత్తి కలిగిన ఎన్నికల సంఘం బిజెపి చేతిలో కీలుబొమ్మగా మారిందన్నారు. బిహార్‌లో ఓటర్ జాబితాలో జరిగిన అవకతవకలను ప్రజలకు వివరించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిని కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి , సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు రబాని, గౌస్, అబ్బాస్, యశ్వంత్, రమేష్, శ్రీనివాస్, కనకరాజు, పూర్ణచంద్, మహమూద్, వెంకటయ్య, సుగుణ పాల్గొన్నారు.

## ప్రారంభమైన ఎస్‌జిఎఫ్ జిల్లా స్థాయి క్రీడలు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లా కేంద్రంలోని ప్రకాశం మైదానంలో 69వ ఎస్‌జిఎఫ్ జిల్లా స్థాయి పాఠశాల క్రీడలు ప్రారంభమయ్యాయి. ఈ క్రీడలను కలెక్టర్ జితేష్ వి పాటిల్ లాంఛనంగా ప్రారంబించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, విజేతలుగా నిలిచిన వారు రాష్ట్ర స్థాయిలో ఆడి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తేవాలని, ఓటమి పాలైన వారు మరిన్ని మెలుకువలు నేర్చుకుని విజయానికి కృషి చేయాలన్నారు. రెండురోజుల పాటు జరిగే ఈ క్రీడల్లో 17సం. విభాగంలో బాలబాలికలు, గురువారం 14సం. విభాగంలో బాల బాలికలు జరుగుతాయన్నారు. విజేతలను రాష్ట్రస్థాయిలో ఆడేందుకు ఉమ్మడి జిల్లా జట్టుతో కలిపి పంపనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పరంధామరెడ్డి, నీరజ, ప్రేమ్‌కుమార్, వేణుగోపాల్, యుగంధర్, స్టెల్లా, కవిత, వీరన్న, కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 'స్థానిక' ఎన్నికల్లో బిఆర్‌ఎస్ సత్తా చాటాలి

**ప్రజాపక్షం/కామేపల్లి:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బిఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు కార్యకర్తలను పని చేయాలని ఇల్లందు మాజీ ఎంఎల్‌ఎ బానోత్ హరి ప్రియా నాయక్ అన్నారు. బుధవారం కామేపల్లి మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.గ్యారెంటీలను గ్యారెంటీ కార్డు రూపంలో ప్రతి ఒక్క ఓటరుకు చేరేలా తెలియజేయాలని సూచించారు. కామేపల్లి మండల ముఖ్య నాయకులు అచ్చయ్య, ఒడియాల కృష్ణారెడ్డి, మూడు కృష్ణ ప్రసాద్, భీమా, మోహన్‌రెడ్డి, బి శంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.


## ఇంటిలిజెన్స్ ఎఎస్‌ఐగా గింజల



**ప్రజాపక్షం/కామేపల్లి:** కామేపల్లి మండల పరిధిలోని పొన్నెకల్లు గ్రామానికి చెందిన గింజల సురేందర్‌రెడ్డి ఇంటిలిజెన్స్ ఏఎస్‌ఐగా పదోన్నతి పొందారు. గత 36 సంవత్సరాలుగా పోలీసు విభాగం లో పని చేస్తూ అంచెలంచెలుగా ఎదిగిన సురేందర్‌రెడ్డిని ఇల్లందు నియోజకవర్గ ఎంఎల్‌ఎ కోరం కనకయ్య, రైతు కమిషన్ సభ్యులు రామ్‌రెడ్డి గోపాల్‌రెడ్డి, మండల నాయకులు, గ్రామస్తులు అభినందించారు.

# స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

మధిర జిల్లా కలెక్టర్ అనుదీప్



**ప్రజాపక్షం/ మధిర :** స్థానిక సంస్థల జెడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ అన్నారు. బుధవారం మధిర మండల కేంద్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన మూడు మండలాలకు( మధిర, ఎర్రుపాలెం, బోనకల్) సంబంధించిన ఎంపిటిసి జెడ్పిటిసి స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని పర్యవేక్షించి కౌంటింగ్ కేంద్రం వద్ద తీసుకోవాల్సిన తగు చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం స్థానిక రిక్రియేష్ క్లబ్‌లో ప్రి సైడింగ్ అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులతో తొలి విడత శిక్షణ కార్యక్రమంలో పాల్గొని శిక్షణ పొందుతున్న అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని, ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. శిక్షణకు హాజరు కాని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లు పోలింగ్ బూతుల వారీగా సమీక్షలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టరర్ శ్రీజ, అదనపు పోలీస్ కమీషన ర్ ప్రసాదరావు, డిఆర్‌డిఎ పిడి స న్యాసయ్య, ఆర్‌డిఓ నర్సింహారావు, మధిర తహశీల్దార్ రాళ్లబండి రాంబాబు, రూరల్ సిఐ మధు, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

# కార్పెంటర్లపై అటవీ అధికారుల దాడులు నిలిపివేయాలి



**ప్రజాపక్షం/పాల్వంచ :** కార్పెంటర్లపై అటవీ అధికారుల దాడులు నిలిపివేసి ప్రభుత్వం వేలం పాట లేకుండా నామ మాత్రపు ధరకు కలపను ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. స్థానిక చంద్రా రాజేశ్వరరావు భవనం సిపిఐ కార్యాలయంలో ఏఐటియుసి అనుబంధ పట్టణ, మండల కార్పెంటర్ల మహాసభ వైకుంఠనాథం అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సంధర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుండి ఫ్లైవుడ్ తదితర గృహ అవసర షాపులు అధికంగా నిర్వహిస్తున్నారని అన్నారు. దీనితో కార్పెంటర్లకు చేతి నిండా పని దొరకటం కష్టంగా మారి కుటుంబాలను పోషించుకోవటం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలు కార్మికులకు గుదిబండగా మారాయని అన్నారు. మరోవైపు కార్పెంటర్లు పని చేసుకుంటున్న సమయంలో అటవీ అధికారులు దాడులు దాడులు చేస్తున్నారని దానితో వృత్తిని కొనసాగించుకోలేక సతమతమవుతున్నదని వారి బతుకు భారమవుతున్నదన్నారు. పలు ఇబ్బందులకు గురి అవుతున్న కార్పెంటర్లను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్పెంటర్లకు తక్కువ ధరకు కలపను సరఫరా చేయాలని, వడ్డీ లేకుండా బ్యాంకుల ద్వారా పది లక్షల రుణం మంజూరు చేయించాలన్నారు. 55 సంవత్సరాలు దాటిన ప్రతీ కార్మికుడికి నెలకు 10 వేయిల పించన్ మంజూరు చేయాలన్నారు. కార్పెంటర్ కుటుంబ సభ్యులకు ఉచిత వైద్యం అందిజేయాలని దీనికి అర్హత కార్డులు ఇవ్వాలన్నారు. కార్పోరేట్ సక్తులకు అనుకూలంగా, కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. అనంతరం నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఏఐటియుసి నాయకులు ఇట్టి వెంకటరావు, మడుపు ఉపేంద్రాచారి, నిమ్మల రాంబాబు, కాసర్ల రామారావు, బాబూచారి, వెంకటాచారి, ఐటిఐ చారి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి పలువురు చేరిక



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బిఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో పలువురు చేరారు. బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సమక్షంలో రఘునాథపాలెం, ఈర్లపుడి గ్రామాలకు చెందిన బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన 85 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి పార్టీలోకి చేరుతున్నట్లు వారు తెలిపారు. రఘునాథపాలెం బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు గాజుల కృష్ణారావు తెలిపారు. మండల కన్వీనర్ దీప్లానాయక్, గుడిపూడి రామారావు,రెంటాల ప్రసాద్, దేవ్‌సింగ్, బోయన వెంకటనర్సయ్య, అల్లిక సీతయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఆదేశాలు బేఖాతర్ ఆగని ఆక్రమణలు ....

కాలువలపై కొనసాగుతున్న నిర్మాణాలు



**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రభుత్వం ఎన్ని కఠిన చ ర్యలు తీసుకున్నా ఆక్రమణదారులు యథేచ్ఛగా ప్రభుత్వ భూముల్లో భవనాలను నిర్మిస్తూనే ఉన్నారు. జిల్లాలోనే అత్యంత వివాదస్పదంగా మా రిన ఎన్నెస్పి కాలువల ఆక్రమణ ఖమ్మం నగరం లో ఇంకా కొనసాగుతూనే ఉంది. నగరం మధ్యలో ఎన్నెస్పి కాలువ ఉండడం, అతి ఖరీదైన భూములు కావడంతో ఆక్రమణదారులు కాలువలపై నిర్మాణాలను చేపడుతున్నారు. ఖమ్మం నగరంలోని మమత రోడ్డు సమీపంలోని గొల్లగూడెం ఎన్నెస్పి కెనల్ గతంలో ఆక్రమణలకు గురికాగా 66 అడుగుల వెడల్పున ఇరువైపులా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఫెన్సింగ్‌ను కాదని సైతం కొందరు అక్రమించుకున్న విషయం విధితమే. స్థానిక నాయకులు పైరవీకారులుగా మారి స్థలాలను అక్రమించడం, అధికారులను బెదిరించిన సంఘటనలు ఉన్నాయి. ఈ వివాదాలు ఇలా కొనాసాగుతుండగానే మమత గొల్లగూడెం రోడ్డులో మమత ఆసుపత్రి గేటుకు ఎదురుగా ఓ వ్యక్తి కాలువలను పూ ర్తిగా అక్రమించి భవన నిర్మాణం చేపట్టాడు. అధికార యంత్రాంగం ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. ఇప్పటికే బేస్‌మట్టం లేపి ఫిల్లర్స్ వేశాడు. ఇదే విషయాన్ని స్థానికులు కొందరు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా మంత్రి తుమ్మల ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న కార్పోరేషన్ అధికారులను ఆదేశించారు. ఇం దుకు సంబంధించి అధికారులు తీసుకోకపోవడం వెనక పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. అధికారులను తప్పుదారి పట్టించే పైరవీకారులు ఈ విషయంలో కూడా జోక్యం చేసుకున్నారా అన్న అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. కార్పోరేషన్ అధికారులు ఇప్పటికైనా స్పందించి కాలువ భూములను పరిరక్షించాలని, అక్రమ నిర్మాణాలకు ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆర్‌టిసి లక్కీ డ్రా విజేతలు ఎంపిక



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** దసరా పండుగ సందర్భంగా ఆర్టిసి బస్సుల్లో ప్రయాణించిన ప్రయాణికులకు నిర్వహించిన లక్కీ డ్రాకు సంబంధించి విజేతలను ఎంపిక చేశారు. బుధవారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి సమక్షంలో లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా రవాణాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఉమ్మడి ఖమ్మంజిల్లా రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా ఆర్టిసి ఎండి నాగిరెడ్డి సహకారంతో ఆర్టిసి బస్సుల్లో ప్రయాణించిన ప్రయాణికులకు లక్కీ డ్రా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఖమ్మం రీజియన్ పరిధిలో ముగ్గురు విజేతలను ఎంపిక చేశామన్నారు. విజేతలకు హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో నగదు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు. సెప్టెంబర్ 28న ఖమ్మం డిపోకు చెందిన రాజధాని బస్సులో హైదరాబాద్ నుంచి ఖమ్మం వరకు ప్రయాణం చేసిన కాంతారావుకు మొదటి బహుమతి, అక్టోబర్ ఆరున భద్రాచలం సూపర్ లగ్జరీ బస్సులో కొత్తగూడెం నుంచి భద్రాచలం వరకు ప్రయాణం చేసిన సాయి బాబకు రెండవ బహుమతి, మణుగూరు డిపోకు చెందిన డిలక్స్ బస్సులో సెప్టెంబర్ 29న మణుగూరు నుంచి పినపాక వరకు ప్రయాణం చేసిన సునీల్‌కుమార్‌కు మూడవ బహుమతికి ఎంపికయ్యారన్నారు. దసరా పండుగ సందర్భంగా ఆర్టిసి బస్సుల్లో ప్రయాణం చేసిన ప్రయాణికులకు కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్ వి. మల్లయ్య, ఖమ్మం డిపో మేనేజర్ ఎం. శివప్రసాద్, సెక్యూరిటీ అధికారి కోటాజీ, విజిలెన్స్, సెక్యూరిటీ సిబ్బంది, ఉద్యోగులు, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను పట్టించుకునే వారేరీ ?

ప్రజలకు ఇబ్బందిగా మారిన పరిశ్రమ

**ప్రజాపక్షం/భద్రాచలం :** ప్రజా స్వామ్యంలో అంగబలం, అర్థ బలం ఉన్న వాడిదే పెత్తనం తప్ప పేదల సమస్యలు పట్టించుకునే నాధుడే కరవయ్యాడు. ప్రజల కోసం ఎన్నుకోబడ్డ పాలకులు, నియమించబడ్డ అధికారులు ప్రజలకు న్యాయం చేసేందుకు ముందుకు రాకపోవడం అశ్చార్యాన్ని కలిగించే అంశం. స్థానిక భూపతిరావు కాలనీకి అనుకుని ఇండస్ట్రియల్ పార్కు ఉంది. ప్లాట్ నెం.28ని చర్ల ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి యూపీవీసీ పరిశ్రమ పెట్టుకునేందుకు ఇండస్ట్రియల్ విభాగానికి డబ్బులు చెల్లించి దక్కించుకున్నాడు. దీనిపై పలు మార్లు వాదోపవాదాలు చోటు చేసుకోగా కాలనీకి చెందిన సుమారు 200 మంది ప్రజలు స్థానిక ఎంఎల్‌ఎ డా. తెల్లం వెంకటరావును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అదే విధంగా జిల్లా కలెక్టరేట్‌లోనూ, ఐటిడిఎ పిఓకు వినతి పత్రం అందించారు. దీంతో స్పందించిన పిఓ వినతి పత్రం ఆధారంగా విచారణ చేపట్టాలని గ్రామపంచాయితీ ఇఓను ఆదేశించారు. దీని పై విచారణ చేపట్టిన ఇఓ ఆ స్థలంలో పరిశ్రమ నిర్మించుకునేందుకు స్థలం దక్కించుకున్న వారికి పూర్తి హక్కులు ఉన్నాయి. ఐటిడిఓ పీఓ వారిని పరిశ్రమ కట్టుకోమన్నాడు అంటూ ఫిర్యాదు చేసిన వారికి వివరించారు. ఇదే దారి ద్వారా మసీదు, చర్చ్, కనకదుర్గ అమ్మవారి ఆలయాలకు భక్తులు వెళుతుంటారు. ఇంత ప్రాముఖ్యత ఉన్న దారి ఒక్కసారిగా పరిశ్రమ పేరుతో మూసేస్తే ఎలా అంటూ ప్రజలు వేడుకుంటున్నప్పటికీ కనీస న్యాయం జరగడం లేదు. ఇలాంటి దారి సమస్య గతంలో ఇదే ప్రాంతంలో ఎర్పడినప్పుడు ప్రజలు నడిచేందుకు దారిని ఇచ్చిన తర్వాతే సరిహద్దులు ఏర్పాటు చేసుకున్నారు. కానీ ప్రస్తుత విషయానికి వచ్చే వరకు అంగబలం, అర్థ బలం ఉన్న వ్యక్తులు మొండిగా వ్యవహరించడం ఒకింత ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ప్రజా స్వామ్యంలో ప్రజలే పాలకులు అంటూ చెబుతున్నప్పటికీ ఇక్కడ మాత్రం ఆ ప్రజలనే సమిదలుగా మార్చి వారి కనీస అవసరాన్ని కూడా తీర్చే పరిస్థితిలో ప్రజాప్రతినిధులు, అధికారులు లేకుండా పో యారు. చేసిన విన్నపాలు



అన్నీ బుట్టదాఖలు అయ్యాయి.

**పొంచి ఉన్న ప్రమాదం :** ఇదిలా ఉండగా ఈ దారి మూసుకుపోవడం ద్వారా విపత్కర పరిస్థితుల్లో ప్రజలు తీవ్ర నష్టాన్ని చవి చూడాల్సిన పరిస్థితి ఎదురవనుంది.భూకంప జోన్‌లో ఉన్న భద్రాచలం ప్రాంతంలో భూ కంపం సంభవించినప్పుడు ప్రజలు ఇళ్లల్లో నుండి పరుగులు తీయాలన్నా కూడా కష్టమే. మరో ప్రక్క ఇప్పటికే కాలనీని అనుకూని రైస్ మిల్లులు, ఇటుకబట్టీలు, ఇతర పరిశ్రమలు ఉన్నాయి. వాటి ద్వారా వెలువడే దుమ్మీ ధూళీ తో ప్రజలు తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారు. ఇప్పుడు ఇళ్లను ఆనుకుని కొత్తగా నిర్మించే మరో పరిశ్రమతో మరిన్ని ఆరోగ్య సమస్యలు తప్పవని వా పోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు న్యాయం చేసేందుకు ముందుకు రావాలని కోరుతున్నారు.

# రీల్



## 'హుడియో హుడియో' పాట ఆవిష్కరణ



'మాస్ జాతర' చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన 'తు మేరా లవర్', 'ఓలే ఓలే' పాటలు శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమా నుంచి 'హుడియో హుడియో' మూడవ పాటను ఆవిష్కరించారు.మాస్ , మెలోడీని అందంగా మిళితం చేసిన ఈ మనోహరమైన ట్యూన్, అందరినీ కట్టిపడేస్తోంది.'హుడియో హుడియో' గీతాన్ని సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో శ్రావ్యంగా, హుషారుగా ఉండేలా తనదైన శైలిలో అద్భుతంగా స్వరపరిచారు. మాస్ చిత్రానికి తగ్గట్టుగా ఓ సరికొత్త మెలోడీని అందించారు.

## 'మటన్ సూప్'కు సెన్సార్ సమస్య



డిఫరెంట్ కథ, కథనాలతో రామకృష్ణ వట్టికూటి సమర్పణలో అలుక్కా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్స్, భవిష్య విహార్ చిత్రాలు బ్యానర్లపై రమణ్, వర్షా విశ్వనాథ్ హీరో హీరోయిన్లుగా రామచంద్ర వట్టికూటి తెరకెక్కించిన చిత్రం 'మటన్ సూప్'. 'విట్‌నెస్ ది రియల్ క్రైమ్' ట్యాగ్ లైన్. మల్లిఖార్జున ఎలికా (గోపాల్), రామకృష్ణ సనపల, అరుణ్ చంద్ర వట్టికూటి సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 10న థియేటర్లోకి రాబోతోంది. ఈక్రమంలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సెన్సేషనల్ డైరెక్టర్ వశిష్ట ముఖ్య అతిథిగా విచ్చేసి ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మల్లిఖార్జున ఎలికా మాట్లాడుతూ మటన్ సూప్' సినిమాకు టీం ఎంతో సహకరించింది. జెమినీ సురేష్ మాకు ఇచ్చిన సపోర్ట్ ఎప్పటికీ మర్చిపోలేం. ఇందులో జెమినీ సురేష్ నటన చూస్తే అందరూ ఆశ్చర్యపోతారు. వెంకీ వీణా ఇచ్చిన మ్యూజిక్ అద్భుతం. 'మటన్ సూప్' టైటిల్ వద్దని మొదట్లో చెప్పాను. కానీ కథ విన్న తరువాత ఆ టైటిల్ అయితేనే పర్ఫెక్ట్ అని తెలిసింది. సెన్సార్ నుంచి కూడా మాకు సమస్యలు వచ్చాయి. అన్ని అడ్డంకులు దాటుకుని అక్టోబర్ 10న మా చిత్రం ఆడియెన్స్ ముందుకు రాబోతోంది. రామచంద్ర ఈ సినిమాను ఎంతో గొప్పగా చిత్రీకరించారు. మా అమ్మ కలను ఆడియెన్స్ ముందుకు అక్టోబర్ 10న తీసుకు వస్తున్నాం. మా మూవీని ఆడియెన్స్ చూసి సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాను. అని అన్నారు. డైరెక్టర్ వశిష్ట మాట్లాడుతూ ''మటన్ సూప్' టైటిల్ చాలా బాగుంది. ట్రైలర్ బాగుంది. ట్రైలర్ ఎంత బాగుందో.. సినిమా కూడా అంత పెద్ద సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నాను. చిత్రయూనిట్‌కు ఆల్ ది బెస్ట్' అని అన్నారు. హీరో రమణ్ మాట్లాడుతూ మటన్ సూప్'ని రామచంద్ర అద్భుతంగా తీశారు. ప్రతీ ఒక్కరూ ప్రాణం పెట్టి సినిమా కోసం పని చేశారు. నిర్మాతలు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. సినిమా చాలా బాగా వచ్చింది. అక్టోబర్ 10న మా సినిమాను చూడండి. చూసిన ప్రతీ ఒక్కరికీ నచ్చుతుంది' అని అన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్ర వట్టికూటి, హీరో రమణ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ పర్వతనేని రాంబాబు, నిర్మాత రామకృష్ణ సనపల, నటుడు జెమినీ సురేష్ , నటుడు శ్రీ చరణ్, సంగీత దర్శకుడు వెంకీ వీణా, నటుడు కిరణ్ మేడసాని, నటుడు గోవింద్ పాల్గొన్నారు.

## కాస్ట్యూమ్ డిజైనర్ నుంచి డైరెక్షన్ వరకు..

### వంద సినిమాలకు కాస్ట్యూమ్ డిజైన్ చేశా.. మీడియా చిట్ చాట్‌లో నీరజ కోన



సిద్ధూ జొన్నలగడ్డ హీరోగా, శ్రీనిధి శెట్టి, రాశి ఖన్నా హీరో హీరోయిన్లుగా నటించిన సినిమా 'తెలుసు కదా'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా అక్టోబర్ 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా పరిచయమవుతున్న నీరజా కోన మీడియాతో చిట్ చాట్ చేశారు. నాకు స్కూల్ డేస్ నుంచి రైటింగ్ ఇష్టం. కవితల పుస్తకం కూడా పబ్లిష్ చేయడం జరిగింది. కథలు చెప్పమంటే చాలా ఇష్టం. నాని ఇలాంటి స్నేహితులు చాలా సపోర్ట్ చేశారు. ఒక దశలో సినిమాకి కథ రాయగలనే నమ్మకం కుదిరింది. అలా రాసుకున్న కథల్లో ఒకటి.. 'తెలుసు కదా'. నేను సినిమాలకి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేయలేదు. దాదాపుగా వంద సినిమాలకి కాస్ట్యూమ్ డిజైన్ చేశాను. కాస్ట్యూమ్ డిజైనర్‌గా బాద్షా నా ఫస్ట్ ఫిలిం. అత్తారింటికి దారేది, ఎవడు, రామయ్య వస్తావయ్య ఎన్నో పెద్ద సినిమాలుకి వర్క్ చేశాను. తమిళ్‌లో విజయ్ కార్తీక్ సూర్య విక్రమ్ శివ కార్తికేయన్ ఇలా అందరి పెద్ద హీరోలతో పనిచేసే అవకాశం దొరికింది. 12 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నాను. అదే నా అనుభవం, లెర్నింగ్ స్కూల్. పులి మేక ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో నితిన్ ని కలిసాను. అప్పుడు ఈ ఐడియా చెప్పాను. ఈ కథకు సిద్ధు అయితే బాగుంటుందని ఆయనే చెప్పారు. సిద్దుని కలిసి ఈ కథ చెప్పాను. సింగిల్ సిట్టింగ్లో మొత్తం కథ విన్నారు. ఆయన మేనేజర్ ఫోన్ చేసి ఈ కథ చేస్తున్నామని చెప్పారు అది నా జీవితంలో మర్చిపోలేని మూమెంట్. రైటర్‌గా డైరెక్టర్‌గా తెలుసు కదా ప్రాజెక్ట్‌తో పరిచయం కావడం ఆనందంగా వుంది. తెలుసు కదా సినిమా ఒక లవ్ స్టోరీ. ఇద్దరి మధ్య ఉండే ప్రేమ కథ. ఒక ప్రేమ కథతో పాటు ఒక కాంప్లెక్స్ సిటీ కూడా వుంది. ఇందులో మూడు క్యారెక్టర్స్ కూడా చాలా స్ట్రాంగ్‌గా ఉంటాయి. ప్రతి క్యారెక్టర్ హానెస్ట్‌గా ఉంటుంది. ప్రతి క్యారెక్టర్ ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతుంది. కథని టీజర్ లో రివిల్ చేయలేదు. ట్రైలర్ తో ఇది ఫలానా టైప్ స్టోరీని అని చెప్పబోతున్నాం. ఒక కథ అమ్మాయి రాసిందా అబ్బాయి రాసిందా అనేదానికంటే బాగా రాశారు అన్నదే ఇంపార్టెంట్. నా దృష్టి కూడా కథని హానెస్ట్‌గా చెప్పడం పైనే ఉంది. ఈ కథ ఎలాంటి బయోస్ లేకుండా రాసింది. ఈ సినిమాని అబ్బాయి తీసారా అమ్మాయి తీసారా అన్నదాని కంటే ఒక గుడ్ ఫిలిం మేకర్ తీసిన సినిమా అని పేరు తెచ్చుకోవడం నాకు ఇష్టం.కెరీర్లో ఐకానిక్ క్యారెక్టర్ దొరకడం అనేది ఒక అదృష్టం. ఎన్ని సినిమాలు చేసిన కొందరికి ఐకానిక్ రోల్ దొరకదు. కానీ సిద్దూకి టిల్లు లాంటి అద్భుతమైన క్యారెక్టర్ కెరీర్ బిగినింగ్‌లోనే పడింది. నిజానికి అలాంటి ఇమేజ్ ఉన్నప్పుడు ఒక కొత్త క్యారెక్టర్ చేయడం ఒత్తిడితో కూడుకున్న వ్యవహారం. కానీ ఇందులో వరుణ్ క్యారెక్టర్ ఆయన చాలా యూనిక్‌గా ప్రజెంట్ చేశారు. ఒక ఫిలిం మేకర్‌గా నేను ఏమి అనుకుంటున్నానో ఆ క్యారెక్టర్‌ని వరుణ్‌గా సిద్ధులో చూశాను. నాకు నేర్చుకోవడం ఇష్టం. ఈ జర్నీలో ఎంతో మంది గొప్ప టెక్నిషియన్స్‌తో వర్క్ చేశాను. ఇవన్నీ నాకు నేర్చుకోవడానికి, ఫిల్మ్ మేకర్ కావడానికి ఎంతగానో సహాయపడ్డాయి.శ్రీనిధి చేసిన రాగ చాలా కాంప్లెక్స్ క్యారెక్టర్. హిట్ 3 కి ముందే ఈ క్యారెక్టర్ చెప్పాను. తను కేజీఎఫ్, హిట్ 3 లాంటి సినిమాలు చేయడం మాకు చాలా హెల్ప్ అయ్యింది. అంజలి క్యారెక్టర్‌లో రాశి చాలా అద్భుతంగా నటించింది. తనది చాలా యూనిక్ క్యారెక్టర్. కొత్త ప్రాజెక్ట్స్ గురించి అంటారా త్వరలోనే ప్రకటిస్తా.

## 'టిక్కల్ టిక్కల్' పాట రిలీజ్




హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'కే ర్యాంప్'. ఈ సినిమాను హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద ప్రొడ్యూసర్ రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'కే ర్యాంప్' సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 18న థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ సినిమా నుంచి థర్డ్ సింగిల్ 'టిక్కల్ టిక్కల్' పాటను విడుదల చేశారు. చేతన్ భరద్వాజ్ కంపోజ్ చేసిన 'టిక్కల్ టిక్కల్..' పాటకు సురేంద్ర కృష్ణ సాహిత్యం అందించారు.

## కబడ్డీ ఆట నేపథ్యంలో 'బల్టీ'




షేన్ నిగమ్, ప్రీతి అస్రానీ, శాంతను భాగ్యరాజ్, సెల్వరాఘవన్ తో పాటు ప్రేమమ్ డైరెక్టర్ ఆల్ఫాన్స్ పుదిరన్ ప్రధాన తారాగణంగా ఉన్ని శివలింగం దర్శకత్వంలో తమిళ, మలయాళ భాషల్లో ఘన విజయం సాధించిన బల్టీ చిత్రం ఈ నెల 10న తెలుగులో విడుదలవుతోంది. కబడ్డీ ఆట నేపథ్యంలో సాగే ఈ సినిమాలో రాజకీయాలు, గ్యాంగ్ స్టర్ కథలతో కలిపి వైవిధ్యంగా రూపొందించారు. ఈ చిత్రాన్ని తెలుగులో ఎల్మా పిక్చర్స్ సంస్థ విడుదల చేస్తోంది.ఈ సందర్భంగా సంస్థ అధినేత ఎన్. ఎథిల్ రాజ్ మాట్లాడుతూ ' తమిళ, మలయాళ భాషల్లో రూపొందిన ఈ సినిమా అక్కడ ఘనవిజయం సాధించింది. క్రిటిక్స్ కూడా చక్కటి రివ్యూలు ఇవ్వడంతో ఈ సినిమాను తెలుగులోకి డబ్ చేసి విడుదల చేయడం జరుగుతోంది. ప్రస్తుతం మంచి ఫామ్ లో వున్న యువ సంగీత దర్శకుడు సాయి అభయంకర్ సంగీతాన్ని అందించారు. మలయాళంలో ఆర్.డి.ఎక్స్ సినిమాతో గత సంవత్సరం ఘన విజయాన్ని సొంతం చేసుకొని మలయాళంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న యువ నటుడు షేన్ నిగమ్ ఇందులో హీరోగా అద్భుతమైన నటన కనబరిచారు. ప్రీతి అస్రానీ, శాంతను భాగ్యరాజ్ నటన ఆకట్టుకుంటుంది. ప్రముఖ దర్శకుడు సెల్వరాఘవన్ విలన్ పాత్రలో అద్భుతంగా నటించారు అని అన్నారు. దర్శకుడు ఉన్ని శివలింగం మాట్లాడుతూ.. తమిళనాడు, కేరళ సరిహద్దులో ఉన్న వెలంపాళయంలో జరిగే ఔట్ అండ్ ఔట్ రా రస్టిక్ విలేజ్ డ్రామాగా సినిమా వుంటుంది. ఆ ఊరిని శాసించే ముగ్గురు పెద్దలు వారి మధ్య జరిగే వ్యాపార రాజకీయాల్లో నలుగురు కబడ్డీ ప్లేయర్స్ చిక్కుకోవడం, ఆపై వచ్చే ఘర్షణలు, భావోద్వేగాల సమాహారంగా బల్టీ సినిమా వుంటుంది అని అన్నారు.

## డిసెంబర్ 5న 'వా వాతియార్' విడుదల




స్టార్ హీరో కార్తి నటిస్తున్న తాజా చిత్రం 'వా వాతియార్' విడుదల తేదీ ఖరారయింది. ఈ సినిమాను డిసెంబర్ 5న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్టు నిర్మతలు ప్రకటించారు. 'వా వాతియార్' చిత్రాన్ని స్టూడియో గ్రీన్ బ్యానర్‌లో కె.ఇ. జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. యాక్షన్ కామెడీ కథతో దర్శకుడు నలన్ కుమారస్వామి రూపొందిస్తున్నారు. కృతి శెట్టి హీరోయిన్ గా నటిస్తోంది. పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ గా హీరో కార్తి నటిస్తున్న 'వా వాతియార్' సినిమా పాన్ ఇండియా స్థాయిలో మూవీ లవర్స్ దృష్టిని ఆకట్టుకునేలా రూపొందిస్తున్నారు.


## గత వైభవ పాట విడుదల



ఎస్ఎస్ దుశ్యంత్, అశికా రంగనాథ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఎపిక్ ఫాంటసీ డ్రామా గత వైభవ. సింపుల్ సుని దర్శకత్వంలో సర్వెగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బ్యానర్స్ పై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. నవంబర్ 14న ఈ చిత్రం విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా నుంచి వర్ణమాల సాంగ్‌ని లాంచ్ చేశారు.సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరో దుశ్యంత్ మాట్లాడుతూ తెలుగు ప్రేక్షకులు అంటే నాకు చాలా ఇష్టం. ఈ సినిమాతో మీ అందరికి ముందుకు రావడం చాలా సంతోషంగా ఉంది.నేను కూడా హైదరాబాద్ వచ్చినప్పుడు తెలుగులో మాట్లాడడానికి ప్రయత్నించాను. నవంబర్ 14న కన్నడ తెలుగులో గత వైభవ సినిమా రిలీజ్ అవుతుంది. తెలుగు ప్రేక్షకుల ఆశీర్వాదం ఉండాలని కోరుకుంటున్నాను.

## 'అరసన్' టైటిల్ పోస్టర్ విడుదల

సిలంబరసన్ హీరోగా వెట్రిమారన్ దర్శకత్వంలో కలైపులి ఎస్.థాను నిర్మిస్తున్న చిత్రాన్ని 'అరసన్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ మేరకు టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ భారీ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా విడుదలైన పోస్టర్‌లో సిలంబరసన్ పవర్ ఫుల్ గా కనిపించారు. దర్శకుడు వెట్రిమారన్, నిర్మాత కలైపులి ఎస్. థాను లాంటి క్రేజీ కాంబినేషన్‌లో రావడంతో సినిమాపై మరింత ఆసక్తిని పెంచింది.పాన్ ఇండియా ప్రేక్షకులను ఆకట్టుకున్న సిలంబరసన్, ఇప్పుడు 'అరసన్'గా వెండితెరపై అలరించడాన్నికి సిద్ధమవుతున్నారు. ఈ సినిమా ఆయన కెరీర్‌లో మరో మైల్ స్టోన్ సినిమా నిలుస్తుందని హీరో సిలంబరసన్ ఆశ భావం వ్యక్తం చేస్తున్నారు.




# ఆర్‌టిసి నూతన ఎండిని కలిసిన.. ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు

### కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేత



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆర్‌టిసి నూతన మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వై. నాగిరెడ్డిని ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించింది. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందచేశారు. అనంతరం యూనియన్ అధ్యక్షుడు ఎస్.బాబు, ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న మాట్లాడుతూ ఆర్‌టిసిలో ప్రస్తుతం నెలకొన్న సిబ్బంది కొరత, వేతన సవరణలు, ట్రేడ్ యూనియన్‌ల అనుమతిపై విస్తృతంగా చర్చించామని తెలిపారు. ఇప్పటికే 1,753 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి నియామక ప్రక్రియ ప్రారంభించినందుకు ఎండికి ధన్యవాదాలు తెలిపారు. అయితే సంస్థలో ఇంకా 17,000 పోస్టులు ఖాళీగా ఉన్నందున వీటి భర్తీకి త్వరలో చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 2021, 2025 సంవత్సరాల వేతన సవరణలు ఇంకా అమలుకాకపోవడంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని త్వరగా అమలు చేయాలని కోరారు. ట్రేడ్ యూనియన్లను అనుమతించకపోవడం వల్ల కార్మికుల హక్కులకు అవకాసం లేకపోతుందని, సంస్థలో యూనియన్లను గుర్తించాలని డిమాండ్ చేశారు. ఇది మర్యాదపూర్వక భేటీ అయినందున, త్వరలో యూనియన్‌ను మరోసారి ఆహ్వానించి, సంస్థ సమస్యలపై సమగ్రంగా చర్చించాలని కోరినట్లు తెలిపారు. ఎండిగా బాధ్యతలు స్వీకరించిన వై.నాగిరెడ్డి గారికి శుభాభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి. అహ్మద్ అలీ, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ ఎం.వెంకటి గౌడ్, ఉపాధ్యక్షులు ఎన్.బాలరెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు పి.అప్పారావు, జె.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శులు ఎం.ఎ.మజీద్, వి.కె.స్వామి, కె.రామిరెడ్డి, బి.జ్యోతి, బాలామణి, మంగ, త్రిలోచన, ఎండి. ఖదీర్, పాండురంగయ్య, బి.ఆంధ్రవేణి తదితరులు పాల్గొన్నారు.

# నిజాంపేటలో కేంద్రబృందం పర్యటన



### భారీవర్షాలకు కుంగిన బ్రిడ్జీలు, తెగిన రోడ్ల పరిశీలన

ప్రజాపక్షం/నిజాంపేట్: గత నెలలో కురిసిన భారీ వర్షాలకు మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ నందిగామ గ్రామాలలో వరదల కారణంగా జరిగిన నష్టాన్ని కేంద్రబృందం బుధవారం సందర్శించి పరిశీలించారు. మొదటగా నందిగామ గ్రామ శివారులో నేషనల్ రోడ్డు 765 డీజీ కుంగిన బ్రిడ్జి పరిశీలించారు. అనంతరం నిజాంపేట మల్కా చెరువు మత్తడి కింది భాగంలో నస్కల్ రోడ్డులో తెగిన బ్రిడ్జిలను కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలించారు. భారీవర్షాల కారణంగా కలిగిన నష్టాల అంచనా వేయడం జరుగుతుందని ఈ సందర్భంగా కేంద్రం సభ్యులు తెలిపారు. వారితోపాటు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఆర్డీవో రమాదేవి, మండల తహాసిల్దార్ శ్రీనివాస్, సిఐ వెంకటరాజా గౌడ్, ఎస్సై రాజేష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఇమాద్‌తో పాటు కేంద్ర బృందం సభ్యులు పాల్గొన్నారు.

# బోటానికల్ గార్డెన్‌లో పాల పిట్ట పండుగ




ప్రజాపక్షం/హైదరాబాద్: బోటానికల్ గార్డెన్‌లో తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 'ప్రపంచ వన్యప్రాణి వారోత్సవాలని పురస్కరించుకొని ఈ నెల 2 నుండి 8 వరకు పాల పిట్ట పండుగ', అనేక కార్యక్రమాలు నిర్వహించింది.ఈ కార్యక్రమాలలో ఆన్లైన్ పోస్టర్, డ్రాయింగ్ పోటీలు, చిత్రలేఖనం, పోస్టర్ తయారీ, వన్యప్రాణి ఫోటోగ్రఫీ పోటీలు, వన్యప్రాణుల ఫోటోల ప్రదర్శనలు, పాములపై అవగాహన సదస్సు వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇందులో ప్రోగ్రెస్ గ్రూప్ అఫ్ స్కూల్స్, గీతాంజలి వేదిక స్కూల్, జమైతుల్ ముఫ్లిహాట్ హై స్కూల్, పల్లవి అవేర్ ఇంటర్నేషనల్ స్కూల్ సరూర్ నగర్, డెక్కన్ కాలేజ్ అఫ్ మెడికల్ సైన్సస్, గోకరాజు రంగరాజు వంటి పాఠశాల, కళాషాలల నుండి ఆన్లైన్ ద్వారా 58 డ్రాయింగ్స్ పోస్టర్స్ రాగా వాటిల్లో ఉత్తమ డ్రాయింగ్స్ మరియు పోస్టర్ లను ఎంపిక చేసి వారికి సర్టిఫేట్, జియోమెట్రీ బాక్స్‌లు అందజేయడం జరిగింది. 5వ తేదీన ఫోటోగ్రఫీ పోటీ నిర్వహించారు. ఇందులో 18 మంది పాల్గొనగా ముగ్గురు విజేతలుగా నిలిచారు. వారికి కూడా బుధవారం సర్టిఫికెట్, మెమెంటోలు బహుకరించడం జరిగింది. ఫోటో ఎగ్జిబిషన్‌కి కూడా 23మంది నుండి 82 ఫోటోలు రాగా ఉత్తమ 40 ఫోటోలు ప్రదర్శనలో ఉంచడం జరిగింది. ఈ యొక్క ప్రదర్శన మరో రెండు రోజులు కొనసాగనుంది. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఎకో టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ ఎకో టూరిజం శిరీష, రంగారెడ్డి డివిజన్ డిఎం వి.తనూజ, ఎఫ్ఆర్ఒ శ్రీనివాస్, ప్లాంటేషన్ మానేజర్ వి.లక్ష్మారెడ్డి, డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీనివాసు రెడ్డి, ప్రాజెక్ట్ మానేజర్ సుమన్, డా. ఐ.వీర కిషోర్, నేచురలిస్ట్ అపరంజని, సూపెర్వైసర్ రాజు, ఎకో టూరిజం మరియు టి.జి.ఎఫ్.డి.సి. సిబ్బంది పాల్గొన్నారు.

# భారత అభివృద్ధి వేగవంతం

(మొదటి పేజీ తరువాయి)

అవకాశాలు ఎదురుచూస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఒప్పందం వల్ల యూరోపియన్ యూనియన్‌పై బ్రిటన్ ఆధారపడడం తగ్గుతుందని తెలిపారు. దీంతో పాటు భారత్ లాంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థతో వాణిజ్య భాగస్వామ్యం బలోపేతం అవుతుందని వివరించారు.

### శివాజీ విమానాశ్రయంలో ఘనస్వాగతం

బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌కు ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. మహారాష్ట్ర గవర్నర్ ఆచార్య దేవ్ రత్, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, డిప్యూటీ సీఎంలు ఏక్‌నాథ్ శిందే, అజిత్ పవార్ ఆయనకు ఎదురేగి స్వాగతం పలికారు. స్టార్మర్‌తో పాటు పారిశ్రామికవేత్తలు, వర్సిటీల ఉప కులపతులు సహా 125మంది ప్రతినిధులు వచ్చారు. గురువారం జరిగే గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో వారు పాల్గొంటారు. దీనికోసం 75 దేశాలకు చెందిన లక్షమంది ప్రతినిధులు, 7,500 కంపెనీల నుంచి 800 మంది వక్తలు హాజరు కానున్నారు. అంతకుముందు బ్రిటిష్ ఎయిర్‌వేస్‌కు చెందిన 9100 విమానంలో స్టార్మర్ ముంబైకి వచ్చే క్రమంలో విమానంలోని కాక్‌పిట్ వద్దకు వెళ్లి ఇంటర్‌కామ్ ద్వారా ప్రయాణికులతో మాట్లాడారు. ''ఇది ఎయిర్ సేఫ్టీ ప్రకటన కాదు. కాక్‌పిట్‌లో ఉన్నది మీ ప్రధానమంత్రి స్టార్మర్. ప్రయాణికులందరికీ హృదయపూర్వక స్వాగతం. మీరంతా విమానంలో ఉండటం అద్భుతంగా ఉంది. ఇప్పటివరకు జరగనివిధంగా భారత్ యూకే మధ్య వాణిజ్య ఒప్పందం కుదరనుంది. మా కొత్త స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలోని అన్ని అవకాశాలను పూర్తిగా ఉపయోగించుకునేందుకు మీతో కలిసి పనిచేసేందుకు చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. అందరూ విమాన ప్రయాణాన్ని ఆస్వాదించండి. తర్వాత మరిన్ని విషయాలను మీకు అందిస్తా. థాంక్యూ'' అని స్టార్మర్ చెప్పారు.

### నేడు ఇద్దరు ప్రధానుల చర్చలు

బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్‌కు స్వాగతం పలికారు ప్రధాని నరేంద్ర మోదీ. భారీ వాణిజ్య ప్రతినిధి బందంతో ప్రధానిగా తొలిసారిగా భారత్ పర్యటనకు వస్తున్న ప్రధాని స్టార్మర్‌కు స్వాగతమంటూ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. కాగా, భారత్‌బ్రిటన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీయే)లో పదేళ్ల మార్గసూచీకి అనుగుణంగా వ్యూహాత్మక భాగస్వామ్య పురోగతిపై ఇద్దరు ప్రధానులు ఆర్థిక రాజధాని ముంబైలో చర్చించనున్నారు. ఈ ఏడాది జులైలో భారత్‌బ్రిటన్ మధ్య చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. సంబంధించిన ఒప్పందంపై ఇరు దేశాలు సంతకాలు చేశాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ సమక్షంలో ఇరుదేశాల వాణిజ్యశాఖ మంత్రులు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. దీని ద్వారా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం కావడంతోపాటు ఏటా 34 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరుగుతుందని భావిస్తున్నారు.

# ...ఇచ్చిపుచ్చుకున్న హమాస్, ఇజ్రాయెల్

(మొదటి పేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. చర్చల నేపథ్యంలో ఖలీల్ హయ్యా ఈజిప్టు టీవీ ఛానల్ 'అల్–ఖ్వహెరా'తో మాట్లాడుతూ, యుద్ధం ముగింపు, గాజాలో ఇజ్రాయెల్ దురాక్రమణ ఉపసంహరణ లక్ష్యంతో తాము ఇక్కడికి వచ్చామన్నారు. ఇజ్రాయెలీ బందీలను విడుదల చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. మరణించిన బందీల మృతదేహాలు కూడా స్వాధీనం చేస్తామన్నారు. అదేసమయంలో పాలస్తినా జైళ్లలో ఉన్న వందలమంది ఖైదీలను విడుదల చేయాలని, ఆ జాబితా తమకు ఇవ్వాలని హయ్యా కోరారు. అరబ్, ఇస్లామిక్ దేశాల నాయకులు, ఇతర తమ సోదరులు చర్చల పునరుద్ధరణకు చేస్తున్న కృషికి అంతర్జాతీయ ప్రపంచంతోపాటు ముఖ్యంగా యుద్ధం ముగించేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్న డోనాల్డ్ ట్రంప్‌కు కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. దోహాలో ఇజ్రాయెల్ చేసిన దాడి నుండి తప్పించుకున్న హమాస్ నేత హయ్యా ఆ తర్వాత మొదటిసారి ఈ ఇంటర్వ్యూ ద్వారా బాహ్య ప్రపంచానికి కనిపించారు. గాజాలో యుద్ధం ముగించేందుకు ట్రంప్ ప్రతిపాదించిన 20 అంశాల ప్రణాళికకు గడచిన శుక్రవారం (అక్టోబరు 3వతేదీ) హమాస్ కొన్ని మినహాయింపులతో అంగీకారం తెలియజేసింది. ఇజ్రాయెల్ బందీలను, పాలస్తినా ఖైదీలను పరస్పరం విడుదల చేసేందుకు వీలైన కార్యాచరణపై ఈజిప్టు–ఖతార్ మధ్యవర్తుల సమక్షంలో ఇజ్రాయెల్–హమాస్ ప్రతినిధులమధ్య పరోక్ష చర్చలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఎర్రసముద్ర తీరప్రాంత ఈజిప్టుదేశ నగరం షర్మ్–ఎల్–షేక్‌లో జరుగుతున్న ఈ చర్చల్లో అమెరికా ప్రభుత్వం తరపున కూడా ఇద్దరు ప్రతినిధులు పాల్గొంటున్నారు. హమాస్ తరపు బృందానికి ఆ సంస్థ అగ్రనాయకుడు ఖలీల్ హయ్యా నాయకత్వం వహిస్తున్నారు. దోహాలో ఖలీల్ హయ్యా, ఇతర హమాస్ అగ్రనాయకులను లక్ష్యంగా చేసుకుని గతనెలారంభంలో ఇజ్రాయెల్ సైన్యం దాడులు చేసింది. కానీ ఈ దాడుల నుండి హమాస్ నాయకులు బయటపడ్డారు. వారు ఎక్కడున్నాగానీ వెతికి పట్టుకుని మరీ హతమారుస్తామని ఇజ్రాయెల్ శపథం చేసింది. కానీ ఇప్పుడు అదే నాయకుడు ఖలీల్ హయ్యా నాయకత్వంలో ఉన్న ప్రతినిధిబృందంతోనే ఇజ్రాయెల్ ప్రతినిధిబృందం ఇప్పుడు ఈజిప్టులో పరోక్ష చర్చల్లో పాల్గొంటున్నది. గాజాలో యుద్ధం ప్రారంభమై బుధవారంనాటికి 733 రోజులు గడిచాయి. హమాస్ వద్ద ఇంకా 48 మంది బందీలు ఉన్నారు. వీరిలో 20 మంది మాత్రమే సజీవులుగా ఉన్నారు. గాజాలో ఇజ్రాయెల్ ప్రారంభించిన యుద్ధంలో రెండేళ్ళుగా 67,183 మంది పాలస్తీనియన్లు మరణించారు. వేలమంది శిథిలాల్లో కూరుకుపోయారు. 15నెలలపాటు గాజాపై ఎడతెగని దాడులు చేశాక ఒక ఒప్పందం జరిగింది. దీంతో 45రోజులు బలవంతంగా యుద్ధవిరామం పాటించారు. ఈ సమయంలో 25 మంది బందీలను, మృతదేహాలను హమాస్ స్వాధీనం చేయగా, ఇజ్రాయెల్ జైళ్ళనుండి 1700మంది పాలస్తినా ఖైదీలను విడుదల చేసింది. తర్వాత ఈ ఏడాది మార్చి 18న ఇజ్రాయెల్ తిరిగి యుద్ధం ప్రారంభించి మొదటిరోజే 400 మంది పాలస్తీనియన్లను పొట్టనపెట్టుకుంది. ఈ యుద్ధంలో ఇప్పటివరకూ అనేకమంది అగ్రశ్రేణి హమాస్ నాయకులను ఇజ్రాయెల్ మట్టుపెట్టింది. 400మంది ఇజ్రాయెల్ సైనికులు ఈ యుద్ధంలో మరణించారు. గాజాలో మొత్తం 36 ఆసుపత్రులు ఉండగా 22 ఆసుపత్రులను ఇజ్రాయెల్ సైన్యం నేలమట్టం చేసింది. పాలస్తినా ప్రిజనర్స్ సొసైటీ (పిపిఎస్) సమాచారం ప్రకారం యుద్ధం మొదలయ్యేనాటికి ఇజ్రాయెల్ జైళ్ళలో 11,100మంది పాలస్తీనియన్లు ఖైదీలుగా ఉన్నారు. వీరిలో 53 మంది మహిళలు, మరో 400మంది పిల్లలు కూడా ఉన్నారు. తాజాగా బుధవారంనాడు గాజాలో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఎనిమిదిమంది పాలస్తీనియన్లు మరణించారు.

### ఒప్పందం ఖరారైతే ఈజిప్టు రండి : ట్రంప్‌కు ఆహ్వానం

ఇజ్రాయెల్–హమాస్ ప్రతినిధులమధ్య పరోక్ష చర్చల్లో మధ్యవర్తుల ద్వారా గాజాలో యుద్ధ విరమణకు ఒప్పందం కుదిరితే తమ దేశానికి రావాల్సిందిగా ఈజిప్టు దేశాధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్‌సిసి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఆహ్వానం పలికారు. షర్మ్–ఎల్–షేక్‌లో బుధవారం జరిగిన పోలీస్ అకాడమీ గ్రాడ్యుయేషన్ ఉత్సవ సభలో మాట్లాడుతూ, చర్చలు విజయవంతమైతే ఈ ఒప్పందంపై సంతకాలు చేయాడానికి తమ దేశానికి రావాలని ట్రంప్‌ను ఎల్‌సిసి ఆహ్వానించారు. చర్చల పురోగతి ఎంతో ప్రోత్సాహకరంగా ఉందన్నారు. ఈ చర్చల ద్వారా ఒక పెద్ద ముందంజ వేసేందుకు ట్రంప్ చూపిస్తున్న శ్రద్ధ, ఆయనకున్న పట్టుదలను ఆయన ప్రశంసించారు. ఈ ఒప్పందం కుదిరితే యుద్ధ విరమణ జరుగుతుంది. ఇజ్రాయెల్ బందీలు విడుదలవుతారు. పాలస్తినా ఖైదీలు విడుదలవుతారు.గాజాలో ప్రజలకు మానవతా సహాయం పుష్కలంగా లభిస్తుందన్నారు. అదేవిధంగా గాజాను పూర్తిగా పునర్నిర్మించాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్ఘాటించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com